
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 174
శనివారం 9-3-2024


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'


సింధు పరాజయం
ఫ్రెంచ్ ఓపెన్ సూపర్–750 సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం - 13లో



టాటా సన్స్ మెగా ఐపీవో!
అంచనా విలువ రూ.11 లక్షల కోట్లు స్పార్క్ క్యాపిటల్ వెల్లడి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


రాజ్యసభకు సుధామూర్తి
ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సతీమణి డాక్టర్ సుధా నారాయణ మూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు.
వివరాలు 6లో ▸


ఇది ప్రజల గ్యారంటీ
ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400 సీట్లు గెలుచుకోవడం తథ్యమని.. ఇది ప్రజలు ఇస్తున్న గ్యారంటీ అని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸


స్వేచ్ఛకు ముప్పుగా ట్రంప్
ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకు డోనాల్డ్ ట్రంప్ ముప్పుగా పరిణమించాడని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆరోపించారు.
వివరాలు 6లో ▸


మే 20 నుంచి స్పెక్ట్రం వేలం
తదుపరి స్పెక్ట్రం వేలం ఈ ఏడాది మే 20 నుంచి ప్రారంభం కానున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ శాఖ తెలిపింది.
వివరాలు 13లో ▸

ఫ్యాక్ట్‌చెక్

డబ్బా కాదు బాస్.. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై కుటిల రాతలెందుకు రామోజీ?
- లక్షలాది మందికి స్పెషలిస్టు వైద్యులు చేసిన సేవలు కనిపించవా?
- ప్రజారోగ్యంపై సీఎం జగన్‌కు ఉన్న శ్రద్ధకు వైద్య రంగంలో సంస్కరణలే నిదర్శనం
- చంద్రబాబు ఏనాడైనా ఒక్క వైద్య శిబిరం పెట్టారా?
- బాబు హయాంలో వైద్య రంగ దుస్థితి కనిపించలేదా?
- నాడు ఆస్పత్రులు పాములు, ఎలుకలకు నిలయాలు కాదా?
- నేడు ఆస్పత్రులను ఆధునికంగా తీర్చిదిద్దుతున్న సీఎం జగన్
- వాడవాడలా, గ్రామ గ్రామాన వైద్య శిబిరాలతో లక్షలాది మందికి సేవలు
- ఉచితంగా మందులు పంపిణీ
- అవసరమైన వారికి కేటరాక్ట్, ఇతర చికిత్సలు

10లో



20 ఏళ్ల కిందటే అత్యంత భారీ దోపిడీకి స్కెచ్

ఐఎంజీ భారత పేరుతో బిల్లీరావును దింపి కథ నడిపిన చంద్రబాబు

హైదరాబాద్‌లో విలువైన 850 ఎకరాలు.. రూ.2 కోట్లకే కేటాయింపు

- అప్పట్లోనే వాటి విలువ రూ.20వేల కోట్లు... ఇప్పుడు రూ.60వేల కోట్లపైనే
- స్టేడియంలన్నీ లీజుకివ్వటంతో పాటు నిర్వహణ వ్యయాలు సర్కారువే
- మొత్తం క్రీడారంగాన్ని బిల్లీరావు చేతిలో పెట్టేసిన నారా వారి నిర్వాకం
- అలా మరో రూ.50-60వేల కోట్లు లబ్ధి చేకూర్చేందుకు పన్నాగం
- అదే జరిగితే రాష్ట్రంలో సామాన్యులకు క్రీడలే దూరమయ్యేవి
- 2004లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉంటూనే అన్నీ కానిచ్చేసిన తీరు
- 2004లో వైఎస్సార్ గెలవటంతో ఒప్పందం వెనక కుట్ర బట్టబయలు
- రద్దు చేసి భూముల్ని వెనక్కి తీసుకుని... సీబీఐ విచారణకు ఆదేశం
- తగిన సిబ్బంది లేరంటూ సీబీఐ విచారణ చేయని లక్ష్మీనారాయణ
- భూములు వెనక్కి తీసుకోవటంపై కోర్టుకెక్కిన చంద్రబాబు బినామీ బిల్లీ
- కోర్టుల్ని 'మేనేజ్' చేయటానికి మొత్తం స్కీమ్‌తో సిద్ధమైన ముఠా
- రహస్య కెమెరాల 'సాక్షి'గా 2009 లోనే ఇవన్నీ వెల్లడించిన బిల్లీ రావు
- కుట్ర మొత్తం బట్టబయలవటంతో ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్
- బిల్లీ వేసిన కేసును గురువారం నాడు కొట్టేసిన తెలంగాణ హైకోర్టు
- సీబీఐ విచారణ ఎందుకు జరిపించలేదని తెలంగాణ ప్రభుత్వానికి ప్రశ్న
- కుదరదని చెబితే తామే ఆదేశిస్తామంటూ... వారం రోజుల గడువు
- అప్పట్లోనే సీబీఐ దర్యాప్తు జరిగితే ఈ పాటికి బాబు జైల్లోకి

సాక్షి, అమరావతి: చంద్రబాబు నిజంగా విజనరీయే. 20 ఏళ్ల కిందటే రూ. లక్ష కోట్లు కొట్టేయడానికి పన్నాగం పన్నారంటే... అందుకోసం ఎవ్వరి దృష్టీ పడని క్రీడా రంగానికి ఎంచుకున్నారంటే ఏమనుకోవాలి. 2004లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి హోదాలో తన బినామీ బిల్లీరావు అలియాస్ అహోబిలరావు చేత 'ఐఎంజీ అకాడెమీస్ భారత' అనే కంపెనీని పెట్టించి... అది అమెరికాలో ఉన్న ఐఎంజీ అకాడెమీకి చెందిన కంపెనీ అని నమ్మించి... హడావుడిగా దానికి గచ్చిబౌలిలోని 400 ఎకరాలు కేటాయించి, సేల్‌డీడ్ కూడా చేసేశారంటే ఏమనుకోవాలి? శంషాబాద్ పక్కన మరో 450 ఎకరాలు కూడా కేటాయించటంతో పాటు... హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని అన్ని స్టేడియాలనూ

మిగతా 10వ పేజీలో ▶



ఖాయంగా తు'ఫ్యానే'

టైమ్స్‌నౌ - ఈటీజీ సర్వేలో వెల్లడి

21-22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం

3-4 ఎంపీ సీట్లకే టీడీపీ-జనసేన కూటమి పరిమితం

2లో

కేంద్రంలో బీజేపీకి 333 పైమాటే

6లో

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు

- సీఎం మహిళా పక్షపాతి.. అందుకే అన్నిరంగాల్లో వారికే అగ్రస్థానం
- సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందిన వారిలో బీసీ మహిళలే అధికం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు పోతుల సునీత, వరుదు కళ్యాణి
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

3లో

రికార్డు స్థాయిలో పసుపు ధర

ఈ ఏడాది కనీస మద్దతు ధర క్వింటా రూ.6,850

- ఎమ్మెస్పీ కంటే రెట్టింపు
- ప్రస్తుతం మార్కెట్‌లో గరిష్ట ధర క్వింటా రూ.13,712
- గత జూన్, జూలైల్లో రూ.5,300 నుంచి రూ.6,250 పలికిన ధర
- 5,020 టన్నులు కొని రైతులకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పుడు వ్యాపారుల మధ్య పోటీ.. అంతర్జాతీయంగా పెరిగిన డిమాండ్
- ఫలితంగా మార్కెట్‌లో రెట్టింపైన ధర
- ఈసారి రూ.15 వేలు దాటే అవకాశం ఉందని అంచనా

2లో





ఎల్పీజీ సిలిండర్ ధర రూ.100 తగ్గింపు

- దీంతో ఢిల్లీలో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.803
- స్థానిక పన్నుల్లో వ్యత్యాసాలను బట్టి రాష్ట్రాల్లో ధరలో స్వల్ప మార్పులు
- నారీశక్తికి లబ్ధి చేకూరుతుందన్న ప్రధాని మోదీ

6లో

'స్టార్టప్ ఇండియా' లోపభూయిష్టం

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

6లో

కొనసాగుతున్న పడిగాపులు

కమలనాథుల కరుణ కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పాట్లు

నేడు పాట్నా పర్యటనకు అమిత్ షా

పొత్తు కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని రెండు రోజులుగా ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నా కమలనాథులు కరుణించక పోవడంతో చంద్రబాబు – పవన్ ద్వయం మల్లగుల్లాలు పడుతోంది. ఎలాగైనా ఎన్డీఏలో చేరాలని, బీజేపీతో పొత్తు లేకుంటే తనకు దిక్కు లేదని భావిస్తున్న చంద్రబాబు...అమిత్ షా పిలుపు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

5లో

ఇదండీ సంగతి



అంతటా శివోహం


అర్ధరాత్రి శ్రీశైలంలో పాగాలంకరణ దృశ్యం

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు.. శ్రీశైలం మల్లన్నకు సంప్రదాయబద్ధంగా పాగాలంకరణ
- వైభవంగా కోటప్పకొండ తిరునాళ్లు
- శ్రీకాళహస్తిలో విశేష అభిషేకాలు

- వివరాలు 5లో


రామయ్య (కర్నూలు) | రాపాక (అమలాపురం) | సూర్యారావు (రాజోలు)

కర్నూలు లోక్‌సభ సమన్వయకర్తగా బీవై రామయ్య

- అమలాపురం లోక్‌సభ సమన్వయకర్తగా రాపాక
- రాజోలు అసెంబ్లీకి గొల్లపల్లి సూర్యారావు
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రెండు పార్లమెంట్ స్థానాలకు, ఒక అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ సమన్వకర్తలను నియమించింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గానికి బీవై రామయ్య, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి గొల్లపల్లి సూర్యారావులను సమన్వయకర్తలుగా నియమించారు.

ఆన్‌లైన్‌లో గ్రూప్-1 హాల్‌టికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అత్యున్నత ఉద్యోగాల భర్తీకి చేపట్టే గ్రూప్–1 పరీక్షలకు హాల్‌టికెట్లను 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 17న గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో భాగంగా ఉదయం పేపర్–1, మధ్యాహ్నం పేపర్–2 పరీక్ష 18 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. https://psc.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు పొంది నిబంధనలను అవగాహన చేసుకోవడంతో పాటు పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకునేలా చూసుకోవాలన్నారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బిడ్డ ఇలా ఉన్నాడంటే జగనన్న చలవే



మాది నిరుపేద కుటుంబం. నా భర్త పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం సింగన్నవలసలో కూలి పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నారు. వచ్చిన అరకొర ఆదాయం మాకు ఒక పూట తినడానికే సరిపోయేది. ఇక పిల్లల భవిష్యత్తుపై ఎప్పుడూ మాకు బెంగ ఉండేది. మాకు ఇద్దరు పిల్లలు. పెద్ద కొడుకు నవీన్‌కు ఆరోగ్యం బాగోక ఆస్పత్రుల చుట్టూ తిరిగాం. ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. సికిల్‌సెల్ ఎనీమాతో బాధపడుతున్నాడని, వైద్యం కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. జగనన్న పాదయాత్ర సమయంలో ఆయనకు మా బాధను మొరపెట్టుకున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే బాబుకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. నెలకు రూ.10వేలు అందిస్తున్నారు. దీంతో వాడి వైద్య ఖర్చులు, పోషకాహారం అందించేందుకు అవకాశం కలిగింది. ప్రస్తుతం వాడు ఆరోగ్యంగా ఉండి బడికి వెళ్తున్నాడు. వాడిపేరున అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు అందుతోంది. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.18,500లు ఇప్పటివరకూ అందింది. మా మామకు పింఛన్ వస్తోంది. మాకు బతుకు పెట్టిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– బోనుల రజిని, సింగన్నవలస
(సూరాబత్తుల గాంధి, విలేకరి, పాలకొండ)

పేదరికం నుంచి బయటపడ్డాం



మేం గిరిజనులం. మాకు పోడు వ్యవసాయం, వ్యవసాయ కూలి పనులే జీవనాధారం. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం పునికినవలస గ్రామంలో పనులు చేసుకుంటూ తద్వారా వచ్చిన అరకొర ఆదాయంతో కష్టంగా జీవనం సాగించే వాళ్లం. మా గురించి ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత సంక్షేమపథకాలు మమ్ములను ఎంతగానో ఆదుకున్నాయి. నాకు పింఛన్ వస్తోంది. పోడు వ్యవసాయం చేస్తున్న మాకు వైఎస్సార్ రైతుభరోసా కింద రూ. 28,500లు, నా భార్య పార్వతికి వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికికి రూ. 18,750లు వంతున, వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటివరకూ రూ. 6,202లు, సున్నా వడ్డీకింద రూ.823లు లబ్ధి చేకూరింది. నాకు నలుగురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. ఇప్పుడు నేను, నాభార్య ప్రభుత్వం అందిస్తున్న పథకాలద్వారా ఇబ్బందులు లేకుండా బతుకుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సాయం మరువలేనిది.

– నందెళ్ల సీతయ్య, పునికినవలస, సాలూరు మండలం
(ఎం.కృష్ణారావు, విలేకరి, సాలూరు రూరల్)

నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టారు



మాది పేద కుటుంబం. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామంలో చిన్న సెలూన్‌షాపు పెట్టుకొని బతుకు బండి లాగుతున్నాను. చాలీచాలని ఆదాయంతో భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాను. గతేడాది సెప్టెంబర్‌లో అనుకోకుండా సుస్తీ చేసింది. గుంటూరులోని వైద్యశాలకు వెళ్లగా వైద్యులు గుండె సంబంధితవ్యాధి అని వెంటనే ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. అసలే అంతంతమాత్రం బతుకులు. ఈ స్థితిలో ఆపరేషన్ కు డబ్బులు ఎలా అని ఆలోచిస్తున్న క్రమంలో ఆరోగ్యశ్రీ ఉంటే ఉచితంగా చేస్తారని చెప్పడంతో మళ్లీ బతుకుతానన్న ఆశ వచ్చింది. ఈ పథకం ద్వారా రెండు లక్షలు విలువచేసే ఆపరేషన్ నాకు ఉచితంగా చేయడంతో పాటు ఖర్చులకు డబ్బులు ఇచ్చారు. ప్రస్తుతం నా పనులు నేను చేసుకుంటున్నాను. నా ప్రాణాలు కాపాడిన జగన్‌కు సదా రుణపడి ఉంటాను. ఇల్లు లేని మా కుటుంబానికి ఇటీవల ప్రభుత్వం ఇంటి స్థలం కూడా కేటాయించింది. అంతే కాకుండా మూడేళ్లుగా జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ. పదివేలు వంతున రావడంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. మంచి పనులు చేస్తున్న జగన్ మోహన్ రెడ్డికి మాలాంటి పేదలంతా రుణపడి ఉంటాం.

– గుంటుపల్లి సాంబశివరావు, వేములూరిపాడు
(దీవి సత్యనారాయణ, విలేకరి, ఫిరంగిపురం)

13న లబ్ధిదారులతో ప్రధాని మోదీ ముఖాముఖి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో 13న సాయంత్రం 4 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ముఖాముఖి నిర్వహిస్తారని ఏపీ షెడ్యూల్డ్ కులాల సహకార, ఆర్థిక సంస్థ వైస్ చైర్మన్, ఎండీ విజయ కృష్ణన్ శుక్రవారం తెలిపారు. దేశంలోని 525 జిల్లాల్లోని లబ్ధిదారులతో 'ప్రధానమంత్రి సు–రాజ్' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ, ఎన్ఏఎంఏఎస్‌టీఈ పథకాల్లో లబ్ధిదారులతో మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.



ఈ రైతు పేరు ఆవుల వెంకటచినసుబ్బయ్య. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం బుచ్చంపల్లి గ్రామానికి చెందిన ఈయనకు పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. పసుపుతో పాటు ఇతర పంటలు సాగు చేస్తుంటారు. ఇటీవలే 70 క్వింటాళ్ల పసుపును మార్కెట్ యార్డులో విక్రయించారు. క్వింటా గరిష్టంగా రూ.12,700కు పైగా అమ్ముడుపోయింది. ప్రస్తుతం క్వింటా నాణ్యతను బట్టి రూ.14 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ స్థాయిధర ఎప్పుడూ చూడలేదని వెంకటచినసుబ్బయ్య సాక్షి వద్ద తన ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జోక్యం వల్ల ఒక్క పసుపే కాదు.. దాదాపు ఇతర పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో రికార్డు స్థాయిలోనే ధరలు పలుకుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

రికార్డుస్థాయిలో పసుపు ధర



- ఎమ్మెస్పీ కంటే రెట్టింపు
- ఈ ఏడాది కనీస మద్దతు ధర క్వింటా రూ.6,850

సాక్షి, అమరావతి: ప్రభుత్వ చర్యలు ఫలించాయి. పసుపు ధర అమాంతం పెరిగింది. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో రికార్డుస్థాయి ధర లభిస్తుండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా ఉంది. క్వింటా పసుపు గరిష్ఠంగా కడప మార్కెట్ యార్డులో రూ.13,712 పలకగా, దుగ్గిరాల పసుపు యార్డులో రూ.13,600 పలికింది. ఈ స్థాయి ధర చరిత్రలో ఎన్నడూ లభించలేదని రైతులు చెబుతున్నారు. క్వింటా రూ.15 వేలు దాటే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

నెల తిరక్కుండానే పెరిగిన ధర

రాష్ట్రంలో 2022–23 సీజన్‌లో 83,540 ఎకరాల్లో పసుపు సాగవగా.. 3.68 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. 2023–24 సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల ప్రభావం వల్ల 78 వేల ఎకరాల్లో సాగైంది. హెక్టార్‌కు సగటున 11 టన్నుల దిగుబడి వచ్చింది. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించే పంటల జాబితాలో లేని పసుపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6,850 మద్దతు ధర ప్రకటించింది. మరోవైపు ధర తగ్గినప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతులకు మద్దతు ధర దక్కేలా చేస్తోంది. గతేడాది జూన్, జూలైల్లో క్వింటా రూ.5,300 నుంచి రూ.6,250 మధ్య పలకడంతో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని రూ.36 కోట్లు వెచ్చించి 5,020 టన్నుల పసుపును మద్దతుధరకు సేకరించింది. ఫలితంగా ఆగస్టు, సెప్టెంబర్‌లలో క్వింటా రూ.8 వేల నుంచి రూ.11,750 పలికింది. ఆ తర్వాత ఏ దశలోను మార్కెట్‌లో ధర తగ్గలేదు. ప్రస్తుతం ఎమ్మెస్పీ కంటే రెట్టింపు ధర పలుకుతుండడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కడప మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.11,555, గరిష్ఠంగా రూ.13,712 పలికింది. దుగ్గిరాల మార్కెట్ యార్డులో కనిష్ఠంగా రూ.12,300, గరిష్ఠంగా రూ.13,600 పలికింది.

బాబు హయాంలో క్వింటా రూ.6,358 మించని ధర

టీడీపీ హయాంలో అసలు మద్దతు ధర ప్రస్తావనే లేదు. మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ధర.. చెల్లించిందే సొమ్ము అన్నట్టుగా ఉండేది. ఆ ఐదేళ్లలో సగటున క్వింటాకు రూ.6,358 మించి ధర లభించిన పరిస్థితి లేదు. ఆ ఐదేళ్లలో గరిష్ట ధరలు 2014–15లో రూ.5,335, 2015–16లో రూ.7 వేలు, 2016–17లో రూ.5,755, 2017–18లో రూ.7,200, 2018–19లో రూ.6,500 ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదేళ్లలో ఒకటి రెండు సీజన్లలో అదీ ఒకటిరెండు నెలలు మాత్రమే అంతర్జాతీయ పరిస్థితులకు తోడు దేశీయంగా పసుపు పంట ఒకేసారి మార్కెట్‌కు రావడంతో ధరలో కాస్త తగ్గుదల కనిపించింది. మిగిలిన అన్ని సీజన్లలో ప్రభుత్వ చర్యల ఫలితంగా ఎమ్మెస్పీకి మించే ధరలు పలికాయి. రెండేళ్ల పాటు గరిష్ఠంగా క్వింటా రూ.10 వేలకు పైనే పలికింది. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.305 కోట్ల విలువైన 48,540 టన్నుల పసుపును సేకరిస్తే, ఈ ప్రభుత్వం 2019–20 నుంచి ఇప్పటివరకు రూ.449 కోట్ల విలువైన 57,973 టన్నుల పసుపును సేకరించింది.

ప్రభుత్వ జోక్యం వల్లే..



ఐదేళ్లుగా కేంద్రం మద్దతు ధర ప్రకటించని పంట ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా మద్దతు ధరలను ప్రకటిస్తోంది. మార్కెట్‌లో ధరలు తగ్గిన ప్రతిసారి సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ప్రభుత్వం ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ అండగా నిలుస్తోంది. ప్రతి రైతుకు ప్రతి పంటకు మద్దతు ధర దక్కేలా చేస్తోంది. ప్రస్తుతం పసుపు క్వింటా ధర గరిష్ఠంగా రూ.14 వేలకు చేరుకోగా, మిగిలిన పంట ఉత్పత్తులకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో రికార్డుస్థాయి ధరలు లభిస్తున్నాయి.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి

సిద్ధం సభకు ఏర్పాట్లు పూర్తి



సభావేదిక



ప్రజల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

- ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

అద్దంకి రూరల్/మేదరమెట్ల: గత మూడు సిద్ధం సభలకు ప్రజలు, పార్టీ శ్రేణులు లక్షలాదిగా హాజరైన నేపథ్యంలో.. ఆదివారం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడులో జరిగే నాలుగో సిద్ధం సభకు భారీఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్ని లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సభాస్థలంలో సీఎం ప్రసంగం అందరికి కనబడేటట్లుగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. సీఎం జగన్ ప్రజలకు చేరువగా వచ్చి అభివాదం చేసేందుకు వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేశారు. ఈసభలోనే సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో విడుదల చేస్తారన్న ప్రచారం జరగటంతో అంచనాలకు మించి ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారని భావిస్తున్నారు. సభ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు ఉన్నతాధికారులు సభాస్థలాన్ని, వేదికను నిశితంగా పరిశీలిస్తున్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సభకు అన్నీ సిద్ధం: తలశిల రఘురామ్



సిద్ధం సభకు అన్నీ సిద్ధం చేశామని ఎమ్మెల్సీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురామ్ చెప్పారు. సిద్ధం సభా ప్రాంగణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. మొత్తం సుమారు 200 ఎకరాల్లో సిద్ధం సభ నిర్వహణ సాగుతుందని, సభకు వచ్చే వాహనాల కోసం 28 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు

సిద్ధం సభ నేపథ్యంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- నెల్లూరు వైపు నుంచి ఒంగోలు మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలను ఒంగోలు సౌత్ బైపాస్ సంఘమిత్ర హాస్పిటల్, కర్నూలు రోడ్డు, చీమకుర్తి, పొదిలి, దొనకొండ, అద్దరోడ్డు మీదుగా మళ్లించారు. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వచ్చే భారీ వాహనాలు సంతమాగులూరు అడ్డరోడ్డు, వినుకొండ, మార్కాపురం, పొదిలి, చీమకుర్తి మీదుగా మళ్లిస్తారు. ఒంగోలు మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే సాధారణ వాహనాలు మేదరమెట్ల వద్ద నుంచి నామ్ హైవేపై అద్దంకి, సంతమాగులూరు మీదుగా వెళ్లాలి.
- ఒంగోలు వైపు నుంచి విశాఖపట్నం వైపు 16వ నంబరు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను త్రోవగుంట నుంచి ఎన్‌హెచ్ 216పైకి దారి మళ్లించి చీరాల, బాపట్ల, మచిలీపట్నం మీదుగా పంపుతారు.
- ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను త్రోవగుంట, చీరాల, బాపట్ల, పొన్నూరు మీదుగా దారి మళ్లిస్తారు. ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే వాహనాలు త్రోవగుంట, చీరాల, పర్చూరు మీదుగా వెళ్లాలి.
- విశాఖపట్నం నుంచి ఒంగోలు, చెన్నై వైపు వచ్చే వాహనాలను నరసాపురం, మచిలీపట్నం, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా దారి మళ్లిస్తారు. గుంటూరు నుంచి ఒంగోలు–చెన్నై వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు అడ్డరోడ్డు నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా మళ్లిస్తారు.
- 16వ నంబర్ జాతీయ రహదారి మేదరమెట్ల గ్రోత్ సెంటర్ నుంచి బొల్లాపల్లి టోల్ ప్లాజా వరకు సిద్ధం సభకు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. అద్దంకి నుంచి నాగులపాడు, వెంకటాపురం మీదుగా జాతీయ రహదారిపై ఎటువంటి వాహనాలు అనుమతించరు.
- ఈ ఆంక్షలు 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అమలులోకి వస్తాయని ఎస్పీ తెలిపారు.

మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు కూడా..

సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రజలందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే, రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'సృష్టికి మూలం మహిళలు. అలాంటి అక్కచెల్లెమ్మలకు మన ప్రభుత్వంలో అత్యున్నత పదవులు కల్పించాం, సంక్షేమ పథకాల్లోనూ ఎక్కువ శాతం వారినే లబ్ధిదారులను చేశాం. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజ, కుటుంబ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ప్రతి అక్కచెల్లెమ్మలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పేర్కొంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

సుధామూర్తికి సీఎం వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాజ్యసభకు నామినేట్ అయిన సుధామూర్తికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. సుధామూర్తిని రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేసినట్లు ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా వెల్లడించిన విషయం తెలిసిందే. సుధామూర్తి ఎంపికపై హర్షం వ్యక్తంచేస్తూ సీఎం వైఎస్ జగన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'పరోపకారిగా, సామాజిక సేవకురాలిగా, వ్యాపారవేత్తగా, రచయిత్రిగా సుధామూర్తి చేసిన సేవలు ఎనలేనివి. ఆమె భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

రేపు బాపట్ల జిల్లాకు ముఖ్యమంత్రి జగన్

సిద్ధం సభలో ప్రసంగించనున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో జరిగే వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావ సభ 'సిద్ధం'లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మేదరమెట్లకు చేరుకుంటారు. అక్కడ జరిగే సిద్ధం బహిరంగ సభలో పాల్గొంటారు. లక్షలాదిగా తరలి వచ్చే ప్రజలు, పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం తిరిగి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

మెడ్‌టెక్‌జోన్‌తో కిర్గిజిస్తాన్ ప్రభుత్వం ఒప్పందం

వైద్య పరికరాలు ఎగుమతులు చేసేలా ఎంవోయూ



వైద్య ఉపకరణాల తయారీని పరిశీలిస్తున్న కిర్గిజిస్తాన్ మంత్రి బిషనలియవ్

సాక్షి, విశాఖపట్నం: వైద్య పరికరాల తయారీలో విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్(ఏఎంటీజెడ్) అందిస్తోన్న సేవలతో భారత్..ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారిందని కిర్గిజిస్తాన్ వైద్యారోగ్యశాఖ మంత్రి ఏ.బిషనలియవ్ ప్రశంసించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌ని ఆయన సందర్శించి అక్కడ తయారు చేస్తోన్న వైద్య ఉపకరణాల విభాగాల్ని పరిశీలించారు. అనంతరం ఏఎంటీజెడ్ నుంచి వైద్య ఉపకరణాల ఎగుమతులు చేసేలా కిజికిస్తాన్ చేసుకున్న ఎంవోయూపై మంత్రి అలకందియా, మెడ్‌టెక్ జోన్ ఎండీ, సీఈవో డా.జితేంద్రశర్మ సంతకాలు చేశారు. భవిష్యత్తులో ఏఎంటీజెడ్ నుంచి మరింత భాగస్వామ్యం కోరుకుంటున్నామని అలకందియ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖాయంగా తు'ఫ్యానే'

21–22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని టౌమ్స్ నౌ – ఈటీజీ రీసెర్చ్ సర్వే తేల్చి చెప్పింది. వైఎస్సార్ సీపీ 49 శాతం ఓట్లతో 21 నుంచి 22 లోక్‌సభ స్థానాలను దక్కించుకుని ఘనవిజయం సాధిస్తుందని వెల్లడించింది. టీడీపీ – జనసేన కూటమి 45 శాతం ఓట్లతో 3 నుంచి 4 లోక్‌సభ స్థానాలకే పరిమితం కానుందని తేల్చింది. బీజేపీ 2 శాతం ఓట్లు, కాంగ్రెస్, వామపక్షాలు తదితరులు 4 శాతం ఓట్లు దక్కించుకుంటాయని అంచనా వేసింది. జీ న్యూస్, రిపబ్లిక్ టీవీ లాంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు సైతం సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమని ఇప్పటికే తేల్చాయి. టీడీపీ – జనసేన పొత్తు కుదిరాక గతేడాది డిసెంబర్ 13 నుంచి ఈనెల 7 వరకూ రాష్ట్రంలో వివిధ వర్గాలకు చెందిన 3,23,257 మంది అభిప్రాయాలను సేకరించి సర్వే ఫలితాలను రూపొందించినట్లు టైమ్స్‌నౌ – ఈటీజీ సర్వేను శుక్రవారం టైమ్స్‌నౌ ఛానెల్‌లో సమర్పించిన సంస్థ సీనియర్ న్యూస్ ఎడిటర్ పద్మజా జోషి వెల్లడించారు. ఆ అభిప్రాయాలను క్రోడీకరిస్తే వైఎస్సార్‌సీపీ సంచలన విజయం సాధించడం ఖాయమని తేలిందన్నారు. టీడీపీ–జనసేన పచ్చి అవకాశవాదంతో పొత్తు పెట్టుకున్నాయని అధిక శాతం ప్రజలు తమ అభిప్రాయాన్ని కుండబద్ధలు కొట్టినట్లు తెలిపారు. హామీల్లో 99 శాతం అమలు, సుపరిపాలన ద్వారా సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయత చాటుకున్నారని, వైఎస్సార్‌సీపీ ఘనవిజయానికి ఇదే బాటలు వేస్తున్నట్లు తాము నిర్వహించిన సర్వేలో వెల్లడైందన్నారు.

పప్పు ధాన్యాల సేకరణ షురూ

- మద్దతు ధరకు శనగ, మినుము, పెసలు, వేరుశనగ కొనుగోళ్లు
- 2.75 లక్షల టన్నుల సేకరణకు ప్రభుత్వం అనుమతి
- ఆర్బీకేల్లో రైతుల నమోదుకు శ్రీకారం



సాక్షి, అమరావతి: రబీ పంట ఉత్పత్తుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత నెలలో శనగల కొనుగోలుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం.. తాజాగా మినుము, పెసలు, వేరుశనగ సేకరణకూ అనుమతి ఇవ్వడంతో ఆర్బీకేల ద్వారా కొనుగోలుకు ఏపీ మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేసింది. రబీ 2023–24 సీజన్‌లో 7 లక్షల ఎకరాల్లో శనగ, 7.50 లక్షల ఎకరాల్లో మినుము, 1.92 లక్షల ఎకరాల్లో పెసలు, 1.61 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగయ్యాయి. శనగ 5.26 లక్షల టన్నులు, మినుము 3.89 లక్షల టన్నులు, వేరుశనగ 1.86 లక్షల టన్నులు, పెసలు 84 వేల టన్నుల దిగుబడులొస్తాయని అంచనా వేశారు. క్వింటాల్ శనగలకు రూ.5,440, పెసలుకు రూ.8,558, మినుముకు రూ.6,950, వేరుశనగకు రూ.5,850 చొప్పున ప్రభుత్వం కనీస మద్దతు ధర నిర్ణయించింది.

2.75 లక్షల టన్నుల సేకరణకు అనుమతి

కనీస మద్దతు ధరకు శనగలు 1,14,163 టన్నుల సేకరణకు గత నెలాఖరున ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తాజాగా 97,185 టన్నుల మినుము, 46,463 టన్నుల వేరుశనగ, 17,505 టన్నుల పెసలు సేకరణకు అనుమతి ఇవ్వడంతో ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏపీ మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేసింది. పంట నమోదు (ఈ–క్రాప్) ఆధారంగానే ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. పంట కోతల తేదీ ఆధారంగా కొనుగోలు తేదీని నిర్ధారిస్తారు. దళారుల బెడద లేకుండా బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. సేకరించిన ఉత్పత్తులను సులభంగా ట్రాక్ చేయడానికి వీలుగా సంచులకు క్యూఆర్ కోడ్/ఆర్ఎఫ్ ఐడీ ట్యాగ్ వేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశం



రబీ పంట ఉత్పత్తుల సేకరణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శనగలు, మినుము, పెసలు, వేరుశనగ సేకరిస్తున్నాం. మార్కెట్‌లో కనీస మద్దతు ధర దక్కని వారు ఆర్బీకేల్లో తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలి. మార్కెట్‌లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. తొందరపడి ఏ ఒక్క రైతు తమ పంట ఉత్పత్తులను ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు అమ్ముకోవద్దు.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు
ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న కాకర్ల. చిత్రంలో కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శాంతమ్మ తదితరులు

- ఐదేళ్లలో 6 లక్షలకు పైగా ఉద్యోగాలిచ్చిన జగన్ ప్రభుత్వం
- విద్యా వ్యవస్థలో రూ.71 వేల కోట్లతో సమూల మార్పులు
- పుట్టపర్తిలో విద్యా సదస్సులో వక్తలు

సాక్షి, పుట్టపర్తి : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సదస్సు, మహిళా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర సచివాలయాల ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, హిందూపురం పార్లమెంటు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో కూడా సీఎం జగన్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అండగా నిలిచారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా జీతాలిచ్చారని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షలాది ఉద్యోగాలిచ్చిన ఘనత జగన్‌దే అని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 6 లక్షలకు పైగా ఉద్యోగాలిచ్చారని తెలిపారు. 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారని, 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చారని వివరించారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించకముందే సీఎం వైఎస్ జగన్ ఇక్కడ మహిళలకు మంచి అవకాశాలిచ్చారని కొనియాడారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్‌లను 60 రోజుల నుంచి 180 రోజులకు పెంచారన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అన్ని రంగాల్లో 50 శాతానికి పైగా మహిళలకు కేటాయిస్తూ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దే అని అన్నారు. విద్య కోసం మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వమూ చేయని విధంగా ఏపీలో రూ.71 వేల కోట్లు ఖర్చు చేయడం అభినందనీయమని అన్నారు. 'నాడు – నేడు' ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో ఆధునిక వసతులు కల్పించారని చెప్పారు.

క్లుప్తంగా...

ఉమ్మడి ప్రకాశం వైఎస్సార్‌సీపీదే..

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 సీట్లకు 12 సీట్లు గెలవనున్నామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఖాయమని స్పష్టంచేశారు. ఆయన శుక్రవారం ఉదయం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న మేదరమెట్ల సమీపంలో సిద్ధం సభకు సర్వం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఒంగోలు నియోజకవర్గం నుంచి 30వేలమంది నాయకులు, కార్యకర్తలు హాజరవుతారన్నారు. సిద్ధం సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ సభ అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని బాలినేని చెప్పారు.

వెలవెలబోయిన శంఖారావం సభ

మద్యం పంచినా రాని జనం



మద్యం పంచుతున్న టీడీపీ కార్యకర్త

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో శుక్రవారం టీడీపీ నాయకుడు లోకేశ్ నిర్వహించిన శంఖారావం సభ వెలవెలబోయింది. సభను సక్సెస్ చేసేందుకు టీడీపీ నాయకులు మూడురోజుల నుంచి పల్లెల్లో విస్తృత ప్రచారం చేశారు. మద్యం కూడా భారీగా పంపిణీ చేశారు. అయినా జనం నామమాత్రంగానే హాజరయ్యారు. వచ్చిన వారిలోను టీడీపీ కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారు. సభ సందర్భంగా పుట్టపర్తి, కొత్తచెరువు పరిసర ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు 'తమ్ముళ్ల'తో కిటకిటలాడాయి. సభలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. దీంతో పుట్టపర్తి టీడీపీ టికెట్ ఆశిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, పెదరాసు సుబ్రమణ్యం, ఇతర అసమ్మతి నేతలు అసంతృప్తిగా కనిపించారు. బీసీ కులాలకు పెద్దపీట వేస్తామంటూ చంద్రబాబు గొప్పలు చెబుతున్నప్పటికీ శంఖారావం సభా వేదికపై మాత్రం అంతా అగ్రవర్ణాల వారే ఆశీనులయ్యారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని కోరుతూ ఈనెల 11న ఎస్‌బీఐ బ్రాంచ్‌ల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల బాండ్లపై సుప్రీం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని పేర్కొన్నారు.

బండారు కథ కంచికి!

పెందుర్తి టికెట్ ఇవ్వబోమని స్పష్టం చేసిన చంద్రబాబు

- ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నేత పంచకర్లకు దాదాపు ఖరారు
- రెండు వారాలుగా పత్తా లేని బండారు సత్యనారాయణమూర్తి
- టీడీపీ–జనసేన కీలక బీసీ, జెండా సభలకు డుమ్మా
- నియోజకవర్గంలో టీడీపీ కేడర్‌కు కూడా మొహం చాటేసిన మాజీ మంత్రి



పెందుర్తి (విశాఖ జిల్లా): బండారు సత్యనారాయణమూర్తి... 40 ఏళ్ల రాజకీయానుభవం. ఐదుసార్లు ఎమ్మెల్యే. ఒకసారి మంత్రి.. కానీ ఏం లాభం. చంద్రబాబు ఛీ పొమ్మన్నారు. టికెట్ లేదనేశారు. ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నేత పంచకర్లకు టికెట్ దాదాపు ఖరారైనట్లు వార్తలు రావడంతో బండారు భవిష్యత్తు డోలాయమానంలో పడింది. బీసీలపై చంద్రబాబు చూపించే కపట ప్రేమకు బండారు ఉదంతమే తాజా ఉదాహరణ అని విశ్లేషకులు అంటున్నారు. చంద్రబాబు మెప్పు కోసం అధికార పక్షంపై, మహిళా మంత్రి రోజాపై బండారు నోరు పారేసుకుని అభాసుపాలయ్యారు. పార్టీ కోసం చేతి చమురు వదిలించుకున్నారు. అయినా వాడుకుని వదిలేసే చంద్రబాబు చివరకు అదే చేశారు. తన అల్లుడైన శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్‌నాయుడు, వియ్యంకుడైన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడుల సిఫార్సులు కూడా బండారును గట్టెక్కించలేకపోయాయి. దీంతో టికెట్ రేసు నుంచి తప్పుకుని పత్తాలేకుండా పోయారు. రెండు వారాలుగా కార్యకర్తలకు అందుబాటులో లేరు. ముఖ్యమైన ఏ సమావేశంలోనూ కనిపించడం లేదు. ఇటీవల టీడీపీ–జనసేన ఉమ్మడిగా నిర్వహించిన జెండా, జయహో బీసీ సభలకు కూడా దూరంగా ఉండడంతో కేడర్‌కు ఏమీ పాలుపోవడంలేదు.

ఒక్కసారిగా సీన్ రివర్స్

పెందుర్తి నియోజకవర్గంలో అత్యంత బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీని ఎదుర్కోనేందుకు ప్రతిపక్షాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ–జనసేన పొత్తు పెట్టుకోవడంతో గత కొన్నాళ్లుగా 'టికెట్ మాదంటే మాది' అంటూ జనసేన, టీడీపీలు ప్రచారం చేసుకున్నాయి. ముఖ్యంగా రాజకీయ చరమాంకంలో ఉన్న టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి గంపెడాసలు పెట్టుకున్నారు. జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుతో టికెట్ రేసులో పోటీ పడ్డారు. 'తనకు ప్రత్యక్ష ఎన్నికల్లో ఇదే ఆఖరి కదా.. చంద్రబాబు కూడా అవకాశం ఇస్తారు' అన్న నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో కేడర్‌తో సమావేశాలు నిర్వహించారు. బహిరంగ వేదికలపై అధికార పక్షంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వచ్చారు. మంత్రి రోజాను అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో టికెట్ బండారుదేనని టీడీపీ కేడర్ కూడా ధీమాగా ఉంది. అయితే పెందుర్తి టికెట్ కోసం పంచకర్ల రమేష్‌బాబు పట్టుపట్టడం, సీట్ల పంపకాల్లో కచ్చితంగా పెందుర్తిని జనసేనకే కేటాయిస్తారని బలమైన సంకేతాలు రావడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. పంచకర్ల కూడా నియోజకవర్గంలో జోరు పెంచడంతో అవమానభారంతో కేడర్‌కు బండారు మొహం చూపించట్లేదు.

వరుస ఓటములతో అవమానం

ఒకప్పుడు రాజకీయంగా వైభవం చూసిన బండారులో 2014లో టీడీపీ అధికారం చేపట్టిన తరువాత మరింత జోష్ కనిపించింది. అయితే టీడీపీ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో లెక్కలేని అవినీతి.. కొడుకు అప్పలనాయుడు వ్యవహారశైలి కారణంగా సత్యనారాయణమూర్తి గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతిలో దాదాపు 30 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2022 పంచాయతీ ఎన్నికల్లో స్వగ్రామం వెన్నెలపాలెంలో సర్పంచ్‌గా పోటీ చేసిన ఆయన భార్య మాధవీలత సహా పంచాయతీలో పది వార్డుల్లోనూ బండారు అనుచరులు చిత్తుగా ఓడిపోయారు. దెబ్బ మీద దెబ్బ.. చందంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వెన్నెలపాలెం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. అయితే ప్రజాతీర్పును గౌరవించని బండారు ఆ తరువాత పూర్తిగా అదుపు తప్పారు. వరుస ఓటముల అవమానభారంతో అధికార పార్టీపై నోరు పారేసుకోవడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో పొత్తులో భాగంగా అని బయటకు ప్రచారం చేసుకుంటున్నా.. జనంలో పూర్తిగా గుర్తింపు కోల్పోయారన్న కారణంతోనే బండారును చంద్రబాబు పక్కన పెట్టారని టీడీపీ నాయకులే అంటున్నారు.

తేలని గుంటూరు పశ్చిమ

- అభ్యర్థి కోసం టీడీపీ వెతుకులాట
- తెరపైకి అరడజను మంది అభ్యర్థులు
- రోజుకో అభ్యర్థి పేరుతో ఐవీఆర్‌ఎస్ సర్వే
- ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్న మాధవి
- పొత్తులో బీజేపీకి ఇస్తారంటూ ప్రచారం
- అయోమయంలో టీడీపీ నేతలు...



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వరుసగా రెండుసార్లు గెలిచిన సీటులో కూడా తమ అభ్యర్థిని నిలబెట్టలేని పరిస్థితిలో తెలుగుదేశం ఉండటం ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. గుంటూరు పశ్చిమలో వరుసగా రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే గెలిచారు. 2019లో తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన మద్దాళి గిరిధర్ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పెద్దసంఖ్యలో గెలిచారు. అయితే ఇప్పటికీ ఇది తమకు బలమైన సీటు అని చెప్పుకుంటున్న తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ అభ్యర్థిని ప్రకటించలేక పోయింది. రోజుకో అభ్యర్థిని రంగంలోకి తీసుకువచ్చి ఐవీఆర్‌ఎస్ సర్వే జరపడంతో ఆ పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ సీటు తమకే వస్తుందంటూ పలువురు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు. మరోవైపు పొత్తులో తమకే వస్తుందని జనసేన ఇటీవల వరకూ హడావుడి చేసింది. అయితే పొత్తు 24 సీట్లకే పరిమితం కావడంతో గుంటూరు జిల్లాలో మరోసీటు వచ్చే అవకాశం లేదని తేలడంతో వారు మౌనం పాటిస్తున్నారు. మరోవైపు బీజేపీ నేతలు కూడా పొత్తు కుదిరితే గుంటూరు పశ్చిమ సీటు తమకే అని ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున ఇప్పటివరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కోవెలమూడి రవీంద్ర, మాజీ మంత్రి ఆలపాటి రాజా, గల్లా మాధవి, పిడుగురాళ్ల మాధవి, తాడిశెట్టి మురళి, నిమ్మల శేషయ్య పేరుతో ఐవీఆర్‌ఎస్ సర్వేలు నిర్వహించింది. వీళ్లే కాకుండా ఈ సీటు కోసం ఎన్‌ఆర్‌ఐలు ఉయ్యూరు శ్రీనివాస్, మన్నవ మోహనకృష్ణ తదితరులు కూడా ప్రయత్నాలు చేశారు. 2019 నుంచి కోవెలమూడి రవీంద్ర ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. పార్టీ తరపున అన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. ఉయ్యూరు శ్రీనివాస్ 2023 నుంచి సీటు కోసం ప్రయత్నాలు చేస్తూ వేర్వేరు కార్యక్రమాలతో నియోజకవర్గంలో తిరుగుతున్నారు. మరో ఎన్‌ఆర్‌ఐ మన్నవ మోహనకృష్ణ కూడా పనిచేస్తూ వచ్చారు. పొత్తులో భాగంగా తెనాలి సీటు జనసేనకు ఇవ్వడంతో మాజీ మంత్రి ఆలపాటి రాజా కూడా ఈ సీటుపై కన్నేశారు.

వైఎస్సార్‌సీపీ జోరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు నెలల ముందే చిలకలూరిపేటకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనిని సమన్వయకర్తగా ప్రకటించడంతో ఒక్కసారిగా పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆమె నియోజకవర్గంలో చొచ్చుకుపోవడం, 'మనతో మన రజనమ్మ' అంటూ డివిజన్లలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేస్తూ ప్రజల వద్దకు వెళ్లడం, స్థానికుల నుంచి అనూహ్య స్పందన రావడంతో టీడీపీ అప్పటి వరకూ తమ సామాజికవర్గ అభ్యర్థిని పరిశీలించినా, ఆ తర్వాత మనసు మార్చుకుని బీసీ మహిళను రంగంలోకి తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించింది. గతంలో ఒక రిటైర్డ్ ఐఏఎస్‌ను పరిశీలించినా ఆమె ఆసక్తి చూపకపోవడంతో ప్రస్తుతం ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన మహిళను రంగంలోకి తీసుకువచ్చింది. అయితే ఇప్పటివరకూ సీటు ప్రకటించకపోవడం రోజుకొకరు రంగంలోకి వస్తుండటంతో టీడీపీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

కాపు సంక్షేమ సేన తాత్కాలికంగా రద్దు

- హరిరామజోగయ్య ప్రకటన
- పవన్‌కు సలహాలివ్వడం నాకు శాపంగా మారింది
- జనసైనికులు కొందరు అమర్యాదగా మాట్లాడుతున్నారు
- చిరంజీవి ప్రజారాజ్యాన్ని పెట్టినప్పుడు ఎంపీ పదవి వదులుకున్నా
- ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లో కలిపేయడంతో చాలా నష్టపోయాం
- మళ్లీ ఆ పరిస్థితి రాకూడదనే ఈ నిర్ణయం



పాలకొల్లు సెంట్రల్: కాపు సంక్షేమ సేనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడ ఒక లేఖ విడుదల చేశారు. ముద్రగడ పద్మనాభం కాపు సంక్షేమ పోరాటం నుంచి తప్పుకున్న తరువాత కొందరు మిత్రుల సలహా మేరకు కాపు సంక్షేమ సేన స్థాపించినట్టు తెలిపారు. కాపులకు విద్య, ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు దక్కించుకోవడమే ధ్యేయంగా ఆమరణ నిరాహార దీక్ష కూడా చేశామని వివరించారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏపీ హైకోర్టులో వ్యాజ్యం కూడా వేసినట్టు తెలిపారు. కాపు సంక్షేమ సేన కొన్ని పరిణామాలతో పరోక్షంగా రాజకీయాల్లోకి ప్రవేశించి తప్పు చేసిందని పేర్కొన్నారు. పవన్‌ను ముఖ్యమంత్రిని చేస్తే కాపులకు న్యాయం జరుగుతుందనే ఆలోచనతో ఆయనకు సలహాలు ఇవ్వడం తనకు శాపంగా మారిందన్నారు. కొందరు జనసైనికులు తనను అపార్థం చేసుకుని చాలా అమర్యాదగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు తాను ఎంపీ పదవి వదులుకుని ఆ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఆ తర్వాత ఆయన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేశారని, దీంతో తనతో పాటు చాలామంది కాపులు నష్టపోయారని తెలిపారు. మళ్లీ అలాంటి పరిస్థితి రాకూడదనేదే తన తపన అని చెప్పారు. అందువల్ల శుక్రవారం జరిగిన కాపు సంక్షేమ సేన జనరల్ బాడీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సంస్థలోని వివిధ హోదాలను, కమిటీలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. ఎన్నికలైన తర్వాత జూన్ నుంచి కొత్త కమిటీలను ఏర్పాటు చేసి కాపు సంక్షేమ సేనను కొనసాగిస్తానని హరిరామజోగయ్య ఆ లేఖలో వెల్లడించారు.

చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చి మద్దతంటారా?



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

1,258వ రోజు రిలే దీక్షలో పురందేశ్వరిపై బహుజన నేతల ధ్వజం

తాడికొండ: రాజధాని శంకుస్థాపనకు హాజరైన ప్రధాని మోదీ చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చి పత్తాలేకుండా పోయి ఒక్క పైసా విదల్చలేదని, కానీ ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాత్రం అమరావతికి బీజేపీ మద్దతు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1,258వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, మెట్రో రైలు, జాతీయ రహదారి, రైల్వే లైన్, ఐకానిక్ బ్రిడ్జి, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మిస్తానని చెప్పిన బీజేపీ పత్తాలేకుండా పోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే రాజకీయ ముఖచిత్రం మార్చేది 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులేనని గుర్తుంచుకుని మసలుకోవాలని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్న తీరు చూసి ప్రత్యర్థుల గుండెల్లో దడ పుడుతుందన్నారు. కాపుల పేరును బాబుకు తాకట్టు పెట్టిన 'పావలా పవన్'ను కాపులే నమ్మడం లేదని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, కొమరవల్లి కిషోర్ బాబు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పెరుగుతున్న చంద్రబాబు ప్యాకేజీ లిస్టు



తణుకు అర్బన్: ఏపీలో చంద్రబాబు ప్యాకేజీదారుల లిస్టు రోజురోజుకూ పెరుగుతున్నదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పాతూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు పవన్‌కళ్యాణ్ మాత్రమే ప్యాకేజీదారుగా ఉండగా, తాజాగా షర్మిల, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా ఆ జాబితాలో చేరారని విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొడుతుందని చెప్పి పిల్లిమొగ్గలు వేసిన ప్రశాంత్ కిషోర్.. ఇప్పుడు ఏపీలో చంద్రబాబు నుంచి ప్రత్యేక ప్యాకేజీ తీసుకుని స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతూ చంద్రబాబు అనుకూల మీడియా సంస్థల్లో కూర్చుని మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం పారదర్శకంగా అందుతున్న సంక్షేమంతో జగన్ ప్రభుత్వానికి అండగా నిలబడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నాయకులు బి.సునీల్‌బాబు, బీఎస్ చిట్టిరాజు, బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనకు లక్షల ఉద్యోగాలిచ్చిన జగన్ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుదాం

సీఎం వైఎస్ జగన్ సచివాలయాలు ఏర్పాటు చేస్తామన్నప్పుడు కొందరు హేళన చేశారు

- అయినా, అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారు
- మనకు 1.36 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు
- మరో 2.66 లక్షల మంది వలంటీర్లను నియమించారు
- ఇంకొకరైతే వ్యవస్థ ఏర్పాటు నుంచి నియామకాలయ్యేసరికి ఎన్నికలొచ్చేవి
- సీఎం జగన్ కరోనా కాలంలో అధికారులు వద్దన్నా వినకుండా ప్రొబేషన్ ఇచ్చారు
- మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నించారు
- ఈ వ్యవస్థ పనికిమాలినదని ఓ ముఖ్య నాయకుడు అన్నాడు
- వలంటీర్ల గురించి మరో నేత నీచంగా మాట్లాడారు
- సీఎం జగన్ మనపై నమ్మకముంచి కీలకమైన స్థానం కల్పించారు
- ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుందాం.. ప్రజలను చైతన్యపరుద్దాం
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే మారుమూల గ్రామీణ ప్రజలకు సైతం సొంత గ్రామాల్లోనే సంపూర్ణంగా ప్రభుత్వ సేవలందించే లక్ష్యంతో రాష్ట్రంలో కొత్తగా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారా 1.36 లక్షల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు. మరో 2.66 లక్షల మందిని వలంటీర్లుగా నియమించారు. తద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉపాధి పొందారు. అందువల్ల మనకు లక్షల ఉద్యోగాలిచ్చిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రతిష్టను మనమూ పెంచుదాం' అంటూ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి సచివాలయాల ఉద్యోగులకు ఒక బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు. ఏపీజీఈఎఫ్ సెక్రటరీ జనరల్ అరవపాల్, సచివాలయాల ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ట్రెజరర్ మధుబాబు తదితరులతో కలిసి శుక్రవారం అనంతపురంలో ఈ లేఖను విడుదల చేశారు. బహిరంగ లేఖలోని ముఖ్యాంశాలు..

ఇచ్చిన మాట ప్రకారం..

'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి 10 మంది ఉద్యోగులను నియమించి ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం రాకుండా అన్ని సేవలూ గ్రామంలో వారి ఇంటి దగ్గర అందిస్తామని చెప్పినప్పుడు కొందరు హేళన చేశారు. కానీ ప్రజలు నమ్మారు. బ్రహ్మరథం పట్టారు. చెప్పిన మాట ప్రకారమే వైఎస్ జగన్ సీఎం అయిన మూడు నెలల్లోనే పాలనా వ్యవస్థలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు.

కొన్ని సమస్యలు ఉండొచ్చు.. కానీ..

సచివాలయాల ఉద్యోగులకు సమస్యల్లేవని, అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పడం నా ఉద్దేశం కాదు. సమస్యలు ఒకటి పోతే ఒకటి రిటైరయ్యే వరకు వస్తూనే ఉంటాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించుకుందాం. సీఎం వైఎస్ జగన్ ఎన్నో కష్టనష్టాలకోర్చి సచివాలయాల వ్యవస్థను రూపుదిద్దుతుంటే ఓర్చుకోలేని కొందరు ఎన్నో రకాలుగా మాట్లాడుతున్నారు. ప్రొబేషన్ ఖరారు కాకముందు ఎంత మంది హేళన చేశారో అందరికీ తెలుసు. ఒక మాజీ మంత్రి మేం అధికారంలోకి వస్తే సచివాలయాల ఉద్యోగులను తొలగిస్తామని అన్నట్టు వార్తలు వచ్చాయి. మరో ముఖ్య నాయకుడు ఈ వ్యవస్థ పనికిమాలినదని అన్నాడు. ఇంకో నాయకుడు ఈ వ్యవస్థలో భాగమైన వలంటీర్ల గురించి నీచంగా మాట్లాడాడు. కానీ ఈరోజు ఎవరైనా మన సచివాలయ వ్యవస్థను టచ్ చేయగలరా? ఒకవైపు ఈ వ్యవస్థ గురించి అవమానకరంగా మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని కొందరు చూస్తుంటే.. సీఎం జగన్ సచివాలయాల ఉద్యోగులపై నమ్మకముంచి కీలకమైన స్థానం కల్పించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టడానికి కొన్ని చానళ్లు, పత్రికలు విషపు రాతలతో అసత్యాలు ప్రచారం చేస్తూ మానసిక దాడి చేస్తున్నాయి. ఈ దుష్ప్రచారాలను అడ్డుకోవాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపైనే ఉంది. ప్రజలకు వాస్తవాలు వివరించడానికి ఉద్యోగులందరూ ప్రతి ఒక్కరూ రోజుకు ఇద్దరిని చైతన్యం చేయాలి. ఇలా రాబోయే 50 రోజుల్లో కనీసం వంద మందిని చైతన్యం చేయాలని కోరుతున్నా' అని వెంకట్రామిరెడ్డి ఆ బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

ఇంకెవరన్నా అయితేనా..

'వైఎస్ జగన్ కాకుండా వేరే ఎవరైనా సచివాలయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, అమలు చేయాలనుకుంటే.. ఈ వ్యవస్థ ఏర్పాటుకు సంవత్సరం పట్టేది. ఆ తర్వాత ఉద్యోగాల నియామక నోటిఫికేషన్‌కు మరో సంవత్సరం, పరీక్షలకు ఇంకో సంవత్సరం, నియామకాలకు మరో సంవత్సరం తీసుకొనేవారు. 2024 ఎన్నికలకు నియామకాలు చేపట్టి, ఆ తర్వాత ఎన్నికల్లో గెలిపిస్తేనే ప్రొబేషన్ ఇస్తామని ఓట్ల రాజకీయం చేసేవారు. కానీ, మన ముఖ్యమంత్రి అవేమీ ఆలోచించకుండా ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే మూడు నెలల్లోనే ఇంత పెద్ద వ్యవస్థకు ప్రాణం పోశారు. తర్వాత 010 పద్దు కింద జీతాలు ఇచ్చారు. ప్రసూతి సెలవులు ఇచ్చారు. ప్రొబేషన్ ఖరారులో ఇబ్బంది లేకుండా శాఖాపరమైన పరీక్షల్లో నెగెటివ్ మార్కులు తొలగించారు. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత కరోనా రూపంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవడంతో సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ వాయిదా వేయాలని అధికారులు ఎంత ఒత్తిడి తెచ్చినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. ప్రొబేషన్ డిక్లేర్ చేసి, కొత్త పీఆర్సీ ప్రకారం జీతాలు ఇచ్చారు.' అని వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీతో బాబు పొత్తు

విజయవాడ ఎంపీ కేశినేని నాని



భవానీపురం (విజయవాడ పశ్చిమ): చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో చేసిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతున్నాడని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో శుక్రవారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో మోదీ అధికారం కోల్పోతాడని, అప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ఈక్వేషన్స్‌లో తాను ప్రధానమంత్రి అవుతానని చంద్రబాబు ఆశపడ్డాడని చెప్పారు. అప్పుడే తమచేత పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టించి, మోదీని వ్యక్తిగతంగా దుర్భాషలాడాడని గుర్తుచేశారు. అయితే సీఎం వైఎస్ జగన్ దెబ్బకు బొక్కబోర్లా పడిన చంద్రబాబుకు అప్పటి నుంచి తాను, తన కొడుకు లోకేశ్ చేసిన అవినీతి ఎక్కడ బయటపడిపోతుందోనన్న భయం పట్టుకుందని చెప్పారు. తమపై కేసులు పెట్టి ఇబ్బంది పెడతారేమోనన్న ఆందోళన వారిద్దరిలో నెలకొందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రైల్వేజోన్‌పైన, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని బీజేపీ అగ్రనాయకులు చంద్రబాబుకు హామీలేమైనా ఇచ్చారా.. అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు పార్టీ ఓడిపోవడం ఖాయమని, ఏపీలో ఎలాగూ సొంత ఇల్లు లేదు కాబట్టి, తెలంగాణకు వెళ్లిపోతాడని చెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన దగ్గర నుంచి రాజ్యసభలో టీడీపీ ఖాళీకావడం, తెలంగాణలో కూడా పార్టీ అడ్రస్ గల్లంతవడం చూశామని పేర్కొన్నారు. 2024 ఎన్నికల తరువాత ఏపీలో కూడా అదే పరిస్థితి నెలకొంటుందని చెప్పారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు



కేక్ కట్ చేస్తున్న వాసిరెడ్డి పద్మ, పోతుల సునీత, వరుదు కళ్యాణి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. జగనన్న గెలుపు.. ఈ రాష్ట్రంలోని మహిళల గెలుపు.. అని ఆమె అన్నారు. సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందిన వారిలో బీసీ మహిళలే అధికమని.. అన్ని రంగాల్లో మహిళలకు సీఎం జగన్ అగ్రస్థానం కల్పించారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాళ్లు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కల్యాణి, పార్టీ సీనియర్ నాయకురాలు వాసిరెడ్డి పద్మ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ 'అమ్మఒడి, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, దిశ యాప్, మహిళా పోలీసు.. ఇవన్నీ గతంలో ఎప్పుడూ జరగని విధంగా మన పార్టీ అధ్యక్షుడు సీఎం అయ్యాకే తీసుకొచ్చారు. ఇవన్నీ ప్రతి అక్కచెల్లెమ్మకు కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రతి ఓటరుకు చెప్పాలి.' అని పేర్కొన్నారు.

ప్రతీ మహిళా స్టార్ క్యాంపెయినర్‌గా పనిచేయాలి: వరుదు కళ్యాణి

వరుదు కళ్యాణి మాట్లాడుతూ 'ఈ ఐదేళ్లలో డీబీటీ ద్వారా రూ.2.55లక్షల కోట్లు పేదల ఖాతాల్లో సీఎం జగన్ జమచేశారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఇలా ఎప్పుడైనా చేశారా? సీఎం జగన్ మహిళా పక్షపాతి. ఇవాళ రాష్ట్రంలోని ఏ గ్రామానికి వెళ్లినా ఓ విలేజ్ సెక్రటేరియట్, విలేజ్ క్లినిక్, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తాయి. వీటన్నింటి లో ఎక్కువ ఉద్యోగాలు పొందింది మహిళలే. నాడు–నేడుతో కొత్తరూపు సంతరించుకున్న బడులు, ఆస్పత్రులూ కనిపిస్తాయి. ఇవన్నీ ఈ 57 నెలల కాలంలోనే సీఎం వైఎస్ జగన్ చేశారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రతి మహిళ ఒక స్టార్ క్యాంపెయినర్ అయి వచ్చే ఎన్నికల్లో పనిచేయాలి.' కోరారు.

ఎన్నికల్లో ప్రచారం కోసం రాజీనామా చేశా: వాసిరెడ్డి పద్మ

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని కోట్లాదిమంది మహిళలు హారతి పడుతూ సీఎం వైఎస్ జగన్‌కు బిగ్ థాంక్స్ చెబుతున్నాం. కుటుంబంలో ఎవరూ ఇవ్వని సమానత్వం సీఎం జగన్ ఇచ్చారు. మహిళల పేరిట ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇలా ప్రతి పథకంలోనూ మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతతో వారికి గుర్తింపు, సమానత్వం వచ్చింది. 'వై నాట్ 175' అనే సీఎం జగన్ నినాదాన్ని నిజంచేసే శక్తి మహిళలకు ఉంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం చేయడానికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశాను.' అని వివరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు అమ్మాజీ, బండి పుణ్యశీల, బెందాళం పద్మావతి, డాక్టర్ శశికళ, భవానీ, నాగమణి, సంపత్ విజితా, ఏబీ రాణి, రజనీ, డాక్టర్ షమా సుల్తానా, మాధవీ వర్మ, రాజేశ్వరి, పార్టీ ఉపాధ్యక్షులు, జోనల్ కమిటీ చైర్మన్లు, మహిళా అడ్వొకేట్లు పాల్గొన్నారు.



హృదయపు సర్వగ్రంథులూ చక్కగా విచ్చుకున్నప్పుడు,
మర్త్యుడైన మానవుడు ఈ శరీరంలోనే అమరత్వం
పొందగలుగుతాడు.
– కఠోపనిషత్తు

సాక్షి
శనివారం, 9 మార్చి 2024

భయపెడుతున్న వలస కథలు

దుర్భర కష్టాల నుంచి విముక్తి పొందాలన్న ఆకాంక్షతో అవకాశాలను అన్వేషిస్తూ ఎంత దూరమైనా పోవటానికి సిద్ధపడటం మనిషి నైజం. దీన్ని ఆసరాచేసుకుని మానవ వ్యాపారం చేస్తున్న మాయగాళ్ల ఆటకట్టించటం ప్రభుత్వాలకు అసాధ్యమా? గత కొన్ని నెలలుగా మీడియాలో వస్తున్న కథనాలు ప్రజల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఎక్కడో ఉద్యోగమని, ఏదో చదువని నమ్మి అప్పులు చేసి, ఏజెంట్లకు లక్షలకు లక్షలు పోసి విమానాలు ఎక్కుతున్న యువకులు చివరకు అత్యంత ప్రమాదకరమైన యుద్ధ క్షేత్రాల్లో తేలుతున్నారు. ఏ క్షిపణి దాడులకో, బాంబు పేలుళ్లకో బలవుతున్నారు. లేదా దుర్భరమైన చాకిరీలో ఇరుక్కుని బయటపడే మార్గం దొరక్క అల్లాడుతున్నారు. హైదరాబాద్ పాత బస్తీనుంచి రష్యా వెళ్లిన యువకుడు కిరాయి సైన్యంలో చేరి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటూ కన్నుమూశాడు. కేరళకు చెందిన మరో వ్యక్తి ఇజ్రాయెల్‌లో పనిచేస్తూ హమాస్ రాకెట్ దాడిలో చనిపోయాడు. మరో ఏడెనిమిదిమంది యువకులు తమను కాపాడాలంటూ రష్యానుంచి వీడియో కాల్‌లో ప్రాధేయపడ్డారు. కిరాయి సైన్యాల్లో పనిచేసినవారు తిరిగొచ్చాక తగిన ఉపాధి చూపకపోతే సమస్యాత్మకంగా మారే ప్రమాదం కూడా వుంటుంది. నిరుడు డిసెంబర్‌లో ఫ్రాన్స్‌లో మన దేశం నుంచి నికరాగువా, సోమాలియా వంటి దేశాలకు వెళ్లే 300 మందిని అనుమానం వచ్చి నిలువరిస్తే ఏజెంట్ల మాయ బయటపడింది. వీరిలో చిన్న పిల్లలు సైతం వున్నారు. చట్టవిరుద్ధ మార్గాల్లోనైనా అమెరికా పోయి డాలర్ల పంట పండించుకోవాలని ప్రయత్నించేవారూ పెరిగారు. 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ మధ్య 96,917 మంది భారతీయులు అమెరికాలో ప్రవేశించటానికి విఫలయత్నం చేసి పట్టుబడ్డారు. ఇది అంతకుముందు సంవత్సరంకన్నా అయిదు రెట్లు అధికం. అమెరికా పోవాలంటే వీసా రావటం అంత తేలిక కాదు గనుక ఇతరేతర మార్గాలు వెదుక్కుంటున్నారు. రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ తదితర దేశాలకు టూరిస్టు వీసాలు లభించటం పెద్ద కష్టం కాదు. అక్కణ్ణించి వేర్వేరు చోట్లకు వెళ్తున్నారు. ఇలాంటివారు వెనకబడిన రాష్ట్రాలనుంచి కాదు, సంపన్న రాష్ట్రాల నుంచే అధికంగా వుండటం ఆందోళన కలిగించే అంశం. ఎక్కువగా గుజరాత్, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల యువకులు ఈ వలలో చిక్కుకుంటున్నారు. గత రెండు రోజులుగా దేశ వ్యాప్తంగా సీబీఐ సాగిస్తున్న దాడుల్లో ఢిల్లీ చుట్టుపక్కలా, దేశంలోని వివిధ నగరాల్లో దర్జాగా బ్రాంచీలు పెట్టుకుని మనుషుల్ని రవాణా చేస్తున్న ముఠాల ఆచూకీ బట్టబయలైంది. సామాజిక మాధ్యమాల ద్వారా, స్థానిక ఏజెంట్ల ద్వారా యువకులకు వలవేసి ఈ ముఠాలు తీసుకుపోతున్నాయి. రష్యా వెళ్లేవారికి మంచి ఉద్యోగాలంటూ నమ్మించి తీరా ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రానికి బలవంతంగా తరలిస్తూ వారి ప్రాణాలను పణం పెడుతున్నారు. అనేకులు యుద్ధంలో తీవ్రంగా గాయపడి సాయం చేసే దిక్కులేక ఆసుపత్రుల్లో విలవిల్లాడుతున్నారు. ఇలా యువకులను తీసుకెళ్లిన ఉదంతాలు 35 వరకూ బయటపడ్డాయని సీబీఐ అంటున్నది. మరెందరు వీరివల్ల మోసపోయారో తేలాలి. హమాస్ నుంచి, హిజ్బుల్లా నుంచి నిరంతరం రాకెట్ దాడులు సాగుతున్న ఇజ్రాయెల్‌లో నిర్మాణరంగంలో తాత్కాలిక అవకాశాలున్నాయంటూ రిక్రూట్‌మెంట్ మొదలెడితే హిందీ భాషా రాష్ట్రాలనుంచి అత్యధికులు క్యూ కట్టారు. ప్రభుత్వ కనుసన్నల్లో జరిగిన ఈ రిక్రూట్‌మెంట్ కోసం వచ్చినవారిని మీడియా కదిలిస్తే ఆకలితో చచ్చేకన్నా పనిచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవటం నయమన్న జవాబొచ్చింది. తమ ప్రాణాలు పోయినా కుటుంబాలకు ఎంతో కొంత అందుతుందన్న ధీమా వారిది. ఎంత విషాదకర స్థితి!

మరో ఆరేళ్లలో మన దేశం ఏడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న చైనాను అధిగమించటం మరెంతో దూరంలో లేదని ఆర్థికరంగ నిపుణులు ఊరిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వున్న 6.1 శాతం వృద్ధి రేటు ఈ ఏడాది చివరికల్లా 6.8 శాతానికి ఎగబాకుతుందని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నారు. నిరుద్యోగిత తగ్గిందని, కొనుగోలు శక్తి బాగా పెరిగిందని, తయారీ రంగం పుంజుకుందని గణాంకాలు అంటున్నాయి. అయినా ఇంతమంది ఎందుకు వలసబాట పడుతున్నారు? ఇబ్బందులుంటాయని తెలిసినా తప్పుడు మార్గాల్లో అమెరికాకు ఎందుకు వెళ్లాలనుకుంటున్నారు? ప్రభుత్వాలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆర్థికవ్యవస్థ వెలుగులీనటం నిజమే అయినా అందులో సామాన్యులకు వాటా లేకపోతే సాధించిన అభివృద్ధికి అర్థమేముంటుంది? యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతున్నామంటే లోపం ఎక్కడుందో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేదా? యుద్ధ క్షేత్రాలవైపు పోయి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని మన విదేశాంగ శాఖ ఈమధ్య ఒక ప్రకటన చేసింది. మంచిదే. కానీ అదొక్కటే సరిపోతుందా?

తమ విధానాలను విమర్శిస్తారనుకున్నవారిని దేశంలో అడుగుపెట్టకుండా విమానాశ్రయాల నుంచే వెనక్కిపంపుతున్నారు. పరాయిగడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడతారన్న శంకతో కొందరిని బయటికి వెళ్లకుండా నిరోధిస్తున్నారు. కానీ మనుషుల్ని మోసపుచ్చి వారిని అక్రమంగా తరలిస్తున్న మాయదారి ముఠాలకు కళ్లెం వేయటం ఎందుకు సాధ్యపడదు? ఇది ఎన్నికల నామ సంవత్సరం గనుక కనీసం ఇప్పుడైనా ఉపాధి కల్పనకూ, తయారీరంగ పరిశ్రమలు పుంజుకోవటానికీ, వ్యవసాయ అనుబంధరంగాల్లో పనులు పుష్కలంగా లభించటానికీ చర్యలు తీసుకోవాలి. గణాంకాలు కళ్లు చెదిరేలావుండొచ్చు. కానీ అవి కడుపు నింపవు.

డబ్ల్యూటీవో అంతర్ధానానికి నాంది?

విశ్లేషణ



మోహన్ కుమార్

అబూ ధాబీలో ఇటీవల ముగిసిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13) పెద్దగా సాఫల్యతలు లేకుండానే ముగిసింది. భారత్ లాంటి దేశాలకు ముఖ్యమైన మత్స్య రాయితీల అంశంలో, ప్రభుత్వాలు నిల్వచేసే ఆహార ధాన్యాల అంశంలో ఏ విధమైన పరిష్కారాలనూ కనుగొనలేదు. పైగా వివాదాల పరిష్కారం కోసం ఉద్దేశించిన అప్పిలేట్ బాడీ పునరుద్ధరణకు అమెరికా ససేమిరా అంది. అదే జరిగితే మళ్లీ 'గాట్' రోజులకు తిరిగి మరలాల్సి ఉంటుంది. ఇక, డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే ఆ దేశం ఏకంగా డబ్ల్యూటీవో నుంచే నిష్క్రమించినా ఆశ్చర్యం లేదు. 166 సభ్య దేశాలున్న ఈ సంస్థ ఉనికి ఇప్పటికే ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో భారత్ తన ఒప్పందాల విషయంలో త్వరపడాలి.

అబూ ధాబీలో (ఫిబ్రవరి 26 నుంచి మార్చ్ 2 వరకు) జరిగిన మరో డబ్ల్యూటీవో (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) మంత్రివర్గ సమావేశం ఎలాంటి ఆసక్తిని రేకెత్తించకుండానే ముగిసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రధాన విధులు, అంటే చర్చల పనివిధానం, వివాద పరిష్కార పనితీరు గత కొంత కాలంగా స్తంభించిపోయాయి. ఇప్పటికే సమస్యల్లో ఉన్న ఈ సంస్థకు చెందిన 166 సభ్యదేశాల్లో బలమైన విభజనలు పెంచేలా, ఈ రెండింటినీ పునరుద్ధరించే ప్రయత్నాలు ఫలించలేదు.

అబూ ధాబీలో జరిగిన 13వ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13)లో డబ్ల్యూటీఓ సభ్యులకు నాలుగు ప్రధాన సవాళ్లు ఎదురయ్యాయి. ఒకటి, మత్స్య రాయితీలపై అంతుచిక్కని బహుపాక్షిక ఒప్పందాన్ని ఎలా ముగించాలి? రెండు, అప్పిలేట్ బాడీని ఎలా పునరుద్ధరించాలి? తద్వారా వివాద పరిష్కార యంత్రాంగంగా డబ్ల్యూటీఓ కిరీటంలో ఆభరణంగా ఉన్న దాని ఖ్యాతిని తిరిగి ఎలా పునరుద్ధరించాలి? మూడు, భారతదేశంతోపాటు అనేక ఇతర దేశాలు డిమాండ్ చేస్తున్న ఆహార భద్రతకు సంబంధించిన పబ్లిక్ స్టాక్ హోల్డింగ్ (ఆహార భద్రత కోసం ధాన్యాన్ని ప్రభుత్వం నిల్వచేయడం) సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఎలా పొందాలి? చివరగా, పరిశ్రమ కోరుతున్న ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్‌లపై కస్టమ్స్ డ్యూటీకి సంబంధించిన మారటోరియం పొడిగింపును ఎలా నిర్ధారించాలి? ఇందులో ఉన్న ఆదాయ నష్టం కారణంగా కొన్ని ప్రభుత్వాలు (భారత్ వంటివి) దీన్ని ఇష్టపడలేదు. కొన్ని ఇతర సమస్యలు కూడా ఉన్నా, ఇవి ఎంసీ 13 కోసం ప్రధాన అజెండా అయ్యాయి.

మత్స్యకారులకు సబ్సిడీలపై బహుపాక్షిక ఒప్పందం గత మంత్రివర్గ సమావేశంలో పాక్షికంగా ముగిసింది. ఇది అమల్లోకి వచ్చేలా ఈ ఎంసీ 13లో పూర్తి చేయవలసి ఉంది. కానీ ఈ సందర్భంలో, సంధానకర్తలు ఏదీ సాధించలేకపోయారు. భారత్ సమానత్వం కోసం, న్యాయం కోసం పోరాడింది. దీనివల్లే యూరోపియన్ యూనియన్ సంధానకర్త ఒకే ఒక్క దేశం (భారత్) దీనికి తన సమ్మతిని నిలిపివేసినట్లు చెప్పారు. ఇది నిజమే అయినప్పటికీ, భారత్ తన మత్స్యకారుల జీవనోపాధి కోసం మంజూరు చేస్తున్న సబ్సిడీలను యూరోపియన్ యూనియన్, జపాన్, చైనా, తైవాన్‌లు ఇస్తున్న భారీ సబ్సిడీలతో సమానం చేయడం అసంబద్ధం. భారత్ 25 ఏళ్ల సమయాన్ని కోరింది. ఇది కొంచెం ఎక్కువగానే కనిపిస్తుంది. కానీ మన లాంటి సమాఖ్య నిర్మాణంలో, మనం నెమ్మదిగా మాత్రమే త్వర పడగలము! ఎన్నికల సంవత్సరం కూడా అయినందువల్ల మత్స్య కారుల ప్రయోజనాలను గట్టిగా కాపాడటం తప్ప, ఇంకేదీ ప్రభుత్వం చేయలేకపోయింది.

మన రైతులకు కూడా ఇదే వర్తిస్తుంది. పబ్లిక్ స్టాక్‌హోల్డింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటామని భారత్ లాంటి దేశాలకు ప్రకటించిన నిబద్ధతను ప్రపంచ వాణిజ్య సంస్థ నిలుపుకోలేదు. సమస్యంతా మార్కెట్ ప్రాప్యతతో దీన్ని లింక్ చేయాలని పట్టుబట్టిన అభివృద్ధి చెందిన దేశాలతోనూ, కెయిర్న్స్ గ్రూప్ తోనూ (19 వ్యవసాయ సంబంధ ఎగుమతి దేశాల గ్రూప్) ఉంది. పబ్లిక్ స్టాక్ హోల్డింగ్ అనేది తీవ్రమైన పేదరికాన్ని, ఆకలిని నిర్మూలించే స్థిరమైన అభివృద్ధి లక్ష్యంతో ముడిపడిన ఒక తీవ్రమైన అంశం. దీనిని మార్కెట్ యాక్సెస్‌కు తాకట్టు పెట్టడం అన్యాయం, అధర్మం కూడా. అంతిమ పరిణామం ఏమిటంటే, ఎంసీ 13 ఈ సమస్యపై పురోగతి సాధించడంలో విఫలమైంది.



యూఏఈలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశం (ఎంసీ 13)

అప్పిలేట్ బాడీ పునరుద్ధరణ గురించిన కథ సైతం భిన్నంగా ఏమీ లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒక్క సభ్యదేశం, అంటే అమెరికా మాత్రమే దానిపై అభ్యంతరం వ్యక్తం చేయడమే గాక, దానిమీదే భీష్మించుకుని కూర్చుంది. అమెరికన్ ఎన్నికల వల్ల దీనికి అదనపు అనిశ్చితి కూడా తోడైంది. డోనాల్డ్ ట్రంప్ గనక విజయం సాధిస్తే, అన్నీ ముగిసిపోతాయి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా అప్పిలేట్ బాడీ పునరుద్ధరణను అడ్డుకోవడమే కాకుండా ఏకంగా డబ్ల్యూటీఓ నుండే మొత్తంగా వైదొలిగినా ఆశ్చర్యం లేదు. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే.

మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవడంలో విఫలమైన ఈ ఎంసీ 13 సమావేశం, ఎలక్ట్రానిక్ ప్రసారాలకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ నిలుపుదలను కేవలం రెండేళ్లపాటు పొడిగించగలిగింది. అలా జరగకుండా అడ్డుకోవాలనే పట్టుదలతో ఉన్న భారత్... యూఏఈ వాణిజ్య మంత్రి నుంచి వచ్చిన వ్యక్తిగత అభ్యర్థన మేరకు చివరి నిమిషంలో అంగీకరించినట్లు భారత వాణిజ్య మంత్రి ద్వారా స్పష్టం చేసింది.

ఎంసీ 13 ఎదుర్కొన్న ఇతర ప్రధాన సమస్య ఏమిటంటే, బహుపాక్షిక చర్చల కార్యక్రమాలతో ఎలా వ్యవహరించాలి అనేదే. ఒక విషయం చాలా ముఖ్యమైనది: అదేమిటంటే, 100 దేశాల మద్దతుతో జరిగిన చైనా నేతృత్వంలోని పెట్టుబడి సులభతర అభివృద్ధి ఒప్పందం. కానీ ప్రతి డబ్ల్యూటీవో సభ్యదేశ ఏకాభిప్రాయాన్ని పొందనందున, దీన్ని సూత్రప్రాయంగా భారత్, దక్షిణాఫ్రికా వ్యతిరేకించాయి. చైనా ఈ పరిణామాన్ని ఊహించి ఉండాల్సింది. దీంతో బహుపాక్షిక వేదికలలో చైనా–భారత సన్నిహిత సహకార యుగం ముగింపు దశకు చేరుకుందని నిర్ధారించవచ్చు. 'బ్రిక్స్' సమూహానికి ఇది ఎలాంటి చిక్కులను కలిగిస్తుందో చూడాలి.

కాబట్టి అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటే, ఎంసీ 13లో వచ్చిన ఫలితాలు స్వల్పం. కొన్ని తాత్కాలిక నిర్ధారణలుగా వీటిని తీసుకోవచ్చు: ఒకటి, ప్రపంచ వాణిజ్య సంస్థకు నిజమైన బహుపాక్షిక(మల్టీలేటెరల్) సంస్థగా ఉజ్వల భవిష్యత్తు లేదు. కాబట్టి, అది బహుముఖంగా(ప్లూరీలేటెరల్) మారుతుందా? అలా అయితే, భారత్ దాన్ని ఎలా చూస్తుంది? రెండు, యథాతథ స్థితిని సూచించే అప్పీలేట్ బాడీ పునరుద్ధరణకు అమెరికా అంగీకరించే అవకాశం కనిపించడం లేదు. బదులుగా మనం కేవలం ఒకే–దశ ప్యానెల్ విధానంతో సాగిన 'గాట్' (పన్నులు, సుంకాలపై సాధారణ ఒప్పందం) తరహా పాత చెడ్డ రోజులకు తిరిగి మరలవచ్చు. అదే జరిగితే, భారత్ దానిని ఎలా ఎదుర్కొంటుంది? చివరగా, ప్రపంచ వాణిజ్య సంస్థను పునరుజ్జీవింపజేసే స్వల్ప అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, బ్రిటన్, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ)తో తన కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ త్వరపడాలి. ఈ విషయంలో సమయాన్ని వృథా చేసే ప్రసక్తే లేదు, మే నెలలో వచ్చే కొత్త ప్రభుత్వం దీన్నొక ప్రాధాన్యతగా దృష్టి సారించాల్సి ఉంది.

భారత వ్యూహాత్మక/విదేశీ విధాన చర్చలకూ, దాని వాణిజ్య విధాన చర్చలకూ మధ్య కొంత వ్యత్యాసం కూడా ఉంది. మనం అనతి కాలంలోనే ఏడు లేదా పది ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారతాం అనే ఊహపై మన వ్యూహాత్మక చర్చలు ఆధారపడి ఉన్నాయి. అయితే ప్రస్తుత వాణిజ్య విధాన ప్రక్రియ కేవలం రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకే సరిపోతుంది! ఈ అంతరాన్ని పూడ్చాల్సిన అవసరం ఉంది. మే నెలలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం వ్యవసాయం, భూమి, కార్మికులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో లోతైన, నిర్మాణాత్మకమైన సంస్కరణలను చేపట్టడం దీనికి ఒక మార్గం. ఇది భారత్‌ను పెద్ద ఆర్థిక కూటమిలోకి చేరేలా సాయపడుతుంది.

వ్యాసకర్త మాజీ రాయబారి, డబ్ల్యూటీవోలో భారత అనుసంధానకర్త ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెనకేసుకొచ్చే కారణం



చాలామంది అమెరికన్లకు ఇప్పటికీ తెలియని విషయం ఏమిటంటే, ప్రతి రాష్ట్రానికి ఎన్ని హౌజ్ సీట్లు ఉండాలనేది నిర్ణయించడం కోసం జనగణన అనేది 'అందరినీ' లెక్కిస్తుంది, అక్రమ వలసదారులతో సహా. దీని ఫలితంగా డెమోక్రాట్ (పాలిత) రాష్ట్రాలు అదనంగా మరో 20 దాకా హౌజ్ సీట్లు పొందుతాయి. అక్రమ వలసదారులను వెనక్కి పంపకుండా ఉండేందుకు డెమోక్రాట్లకు ఇది మరొక బలమైన ప్రోత్సాహకం.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

టైము పాటించవా?



గత ఏడాదిలో నేను చేసిన ఏ ఒక్క దేశీయ విమాన ప్రయాణం కూడా ఠంచనుగా టైముకు ప్రారంభం కాలేదు. ఒక్కటి కూడా! ఏ ఎయిర్‌లైన్స్ అన్నదానితో సంబంధం లేకుండా అంతటా ఇదే కథ. ప్రయాణీకుల సమయం పట్ల గౌరవమే లేదు. పౌర విమానయాన డీజీ, ఇలా జరగడం సరైందేనా?

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

ఏం చేయాలని?



ఎన్‌ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) ప్రకారం, 2011 నుంచి 2022 మధ్యకాలంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) తన క్యాడర్‌కు చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో శిక్షణ ఇచ్చేందుకుగానూ అజ్ఞాత వర్గాల నుంచి 9 కోట్ల రూపాయలు బొగేసింది.

– ప్రకాశ్ సింగ్, పోలీసు మాజీ ఉన్నతాధికారి

ముందు నేను...



మమ్మల్ని తల్లులు, చెల్లెళ్లు అని పిలవడం మానుకోండి! ఒక వ్యక్తికీ, ఆ వ్యక్తి పోషించే ఒకానొక పాత్రకీ మీకు తేడా తెలియదా?

– తారా కృష్ణస్వామి, యాక్టివిస్ట్

లీవు పూర్తవుతుందా?



బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ బోర్డు) అద్భుతమైన యజమాని. ఎవరినీ (ఉద్యోగం లోంచి) తీసేయదు. కేవలం మెడికల్ లీవు మీద పంపుతుందంతే.

– రమేశ్ శ్రీవత్స, సెటైరిస్ట్

ఇన్ బాక్స్

ఓటు హక్కు కోల్పోతున్న విచారణ ఖైదీలు

మళ్ళీ ఎలక్షన్లు వస్తున్నాయి. విచారణ ఖైదీలు మరొక్కసారి ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నారు. నేరం రుజువు కాకుండా, న్యాయమూర్తి శిక్ష వేయకుండా జైలులో ఉన్న సుమారు ఐదు లక్షల మంది విచారణ ఖైదీలు 2019 లోక్‌సభ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5) ప్రకారం జైలు శిక్ష అనుభవిస్తున్నవారు, విచారణ ఖైదీలు, చట్టబద్ధమైన కస్టడీలో ఉన్నవారు ఎన్నికలలో ఓటు వేయకూడదు.

మన జైళ్లలో విచారణ ఖైదీలే 80 శాతం ఉన్నారు కాబట్టి ఓటు హక్కు విషయంలో శిక్ష పడ్డవారిని, విచారణ ఖైదీలను విడిగా చూడవలసిన అవసరం ఉంది. దోషిగా తేలిన వ్యక్తి బెయిల్‌పై బయట ఉంటే ఓటు వేయగలిగితే, కోర్టు ద్వారా నేరానికి పాల్పడినట్లు ఇంకా నిర్ధారణకాని వ్యక్తి హక్కు మాత్రం నిరాకరించబడుతోంది. ఎన్నికల చట్టంలోని ఈ నిబంధనను సవాలు చేస్తూ కొందరు కోర్టును ఆశ్రయించారు. 1997లో ఖైదీలకు ఓటు హక్కును కోరుతూ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరిస్తూ, అటువంటి నిషేధం ఎందుకు అనే దానికి కొన్ని కారణాలను తెలిపింది. జైలులోని ప్రతి వ్యక్తి ఓటు వేయడానికి భద్రతా ఏర్పాట్ల కోసం పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అవసరమవుతాయి. తన ప్రవర్తన ఫలితంగా జైలులో ఉన్న వ్యక్తి సమాన స్వేచ్ఛను పొందలేడు. నేర నేపథ్యం ఉన్న వ్యక్తులను ఓటు హక్కుకు దూరంగా ఉంచడం సామాజిక అవసరం అని సుప్రీం పేర్కొంది.

ఏప్రిల్ 2019లో ముగ్గురు న్యాయ విద్యార్థులు ఖైదీలకు ఓటు వేసే హక్కు, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951కు సవరణలు కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని పౌరులుగా తీర్చిదిద్ది తిరిగి సమాజానికి అందించే లక్ష్యంగా ఉన్న సంస్కరణాత్మక వ్యవస్థలో ఓటు హక్కు ఒక భాగం అని వారు సుప్రీం కోర్టుకు నివేదించారు. 2022 ఫిబ్రవరిలో వేసిన ఒక పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. అది శాసన నిర్ణయమనీ, అందులో కోర్టు జోక్యం కలిగించుకోలేదనీ పేర్కొంది. 2022 అక్టోబర్‌లో దాఖలైన మరో పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 62(5)లోని చట్టబద్ధతను పరిశీలించేందుకు సుప్రీం అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వానికీ, ఎన్నికల కమిషన్‌కూ నోటీసు పంపి వాటి అభిప్రాయాన్ని కోరింది. ఆ తరవాతే పిల్‌ను విచారణకు చేపట్టనుంది. 2018లో అమెరికాలోని ఖైదీలు దేశవ్యాప్త సమ్మె జరిపి ప్రధాన డిమాండుగా ఓటు హక్కును సాధించారు. బల్గేరియా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఇరాన్, ఇజ్రాయెల్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, ఘనా, కెన్యా, బోట్స్వానా వంటి దేశాలు తమ ఖైదీలకు ఎన్నికలలో ఓటు హక్కును అందిస్తున్నాయి.

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి నుండే ఓటేసే అవకాశం కొత్తగా కల్పించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేవారికి పోస్టల్ బ్యాలెట్ విధానం ఉంది. వీటిని పాటిస్తే పోలింగ్ స్టేషన్ దాకా తరలించేందుకు భద్రతా ఏర్పాట్ల కోసం పోలీసు సిబ్బంది సరిపోదు అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. నిజాయితీగా ఓటింగ్ జరగడమంటే యోగ్యులైన పౌరులందరికీ ఆ హక్కును వినియోగించుకొనే అవకాశం ఈయడమే అని శాసనకర్తలు గ్రహించాలి.

– బి. నర్సన్ । 94401 28169

నైపుణ్యాల అభివృద్ధిలో మునుముందుకు

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాశ్

యువత నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా వారికి మంచి అవకాశాలను అందిపుచ్చుకునే వీలు కల్పించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ ఆ పేరుతో కోట్లాది రూపాయలను మింగేయడం మాత్రం క్షంతవ్యం కాదు. చంద్రబాబు హయాంలో ప్రారంభమైన 'స్కిల్ డెవలప్మెంట్ సంస్థ' ముసుగులో చేసిన నిర్వాకం నిధుల భక్షణే అనేది ఆయన అరెస్ట్‌తో తేలిపోయింది.

అసలు స్కిల్ డెవెలప్మెంట్ అంటే ఏమిటి? వ్యక్తుల నైపుణ్యాన్ని పెంచడంతో పాటు, వారికి తగిన ఉపాధి కలిగేలా చూడడం కదా. తిరుపతి సమీపంలో ఉన్న 'శ్రీ సిటీ'లో జరుగుతున్నది ఇదే. అలాగే అందుబాటులో ఉన్న సహజ వనరులను రాష్ట్ర అభివృద్ధికి ఎలా నైపుణ్యంగా ఉపయోగించుకోవాలో దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతలదే. కానీ ఈ విషయంలో చంద్రబాబు విఫలమయ్యారనే చెప్పాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రమారమి వెయ్యి కి.మీ. సముద్ర తీరం ఉంది. ఇక్కడ గోవాలో మాదిరిగా టెంట్స్ వేద్దామా, క్యాసినోలు పెడదామా, పర్యాటకులకు వినోదం పంచుదామా అనే దగ్గరే ఆయన ఆలోచనలు ఆగిపోయాయి. అంటే సముద్ర తీరాన్ని ఒక జూద కేంద్రంగా, వ్యసనపరుల క్షేత్రంగా మార్చాలని చూశారు. అదృష్టవశాత్తు ఆయన కిందటి ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ ఆలోచనకు బ్రేక్ పడింది. అయితే అదే సముద్ర తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, మెరైన్ రీసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనను ఇప్పటి ముఖ్యమంత్రి జగన్ చేశారు. ఒక 'స్కిల్ యూనివర్స్' పోర్టల్‌ను నెలకొల్పడానికి చేసిన కృషి ఫలిస్తోంది.

ఇప్పటికే ఉన్న పాలిటెక్నిక్, ఐటీఐ శిక్షణ కేంద్రాలను ఉపయోగించుకుని యువతలో నైపుణ్యాన్ని పెంపొందించడం, కొత్త స్కిల్ కాలేజీలూ, యూనివర్సిటీలను పెట్టడం ద్వారా యువత ఈ పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకు పోవడానికి జగన్ చర్యలు చేపడుతున్నారు. 2019 వరకూ ఏపీలో అక్రిడిటేషన్ ఉన్న పాలిటెక్నిక్ కాలేజి ఒకటే అంటే ఆశ్చర్యం కలుగక మానదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 33 పాలిటెక్నిక్‌లు గుర్తింపు పొందాయి. ఐటీఐలను అభివృద్ధి చేశారు.

'నాడు నేడు' వంటి కార్యక్రమాలతో బడులను బాగు చేశారు. ఆంగ్ల మాధ్యమాన్ని దిగువ తరగతికి చేరువ చేశారు. ప్రభుత్వ బడులలో కార్పొరేటుకు ధీటుగా విద్యాభ్యాసం జరిగేలా చూశారు. ఈ తరహా పాఠశాల విద్యతో విద్యార్థులకు సహజంగానే నైపుణ్య స్థాయి పెరుగుతుందనడంలో సందేహం లేదు. పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెడుతూ, వాటితో టై అప్ పెట్టకొని యువతకు ట్రైనింగ్ ఇప్పించి ఉద్యోగాలను పొందేలా చేసే 'భవిత' కార్యక్రమం, సముద్ర తీరంలో 'మెరైన్ రీసెర్చ్ సెంటర్' ఏర్పాటు, తిరుపతిలో 'స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు చేయాలనుకోవడం వంటివి జగన్ విజన్‌కు కొన్ని నిదర్శనాలు మాత్రమే. విశాఖలో జగన్ ప్రసంగం రాష్ట్ర యువత నైపుణ్యాలు ఎలా పెరగబోతున్నాయో ఆవిష్కరింపచేసింది. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ హబ్, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజ్, ఇందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు నెలకొల్పుతామంటూ జగన్ చేసిన ప్రకటన యువత నైపుణ్యాల అభివృద్ధి పట్ల ఆయన ఎంత కృతనిశ్చయంతో ఉన్నదీ తేటతెల్లం చేసింది. చదువు పూర్తవ్వగానే ఉపాధి కూడా కలిగేలా చేయాలన్నది ఆయన ఆశయం. అంతేగానీ చంద్రబాబు హయాంలో మాదిరిగా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామని బీరాలు పలకడం, ఆ తరవాత వదిలెయ్యడం తన పద్ధతి కాదని జగన్ చెప్పకనే చెప్పారు.



స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలకు నిధులు ఎక్కడ నుంచి వస్తాయని బాబుకు అనుమానం రావచ్చు. ఆ అనుమానాలను పటాపంచలు చేయగలిగేలా ఎంపీ లాడ్స్ నిధులలో కొంత శాతాన్ని ఇందుకోసం ఉపయోగించవచ్చని సీఎం జగన్ అంటున్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులకు ఏటా వచ్చే ఈ నిధులు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలకు అక్కరకు వస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రజలను మోసగించాలనుకునే వారి ఆలోచనలు ఎప్పుడూ తిన్నగా ఉండవు. సదుద్దేశంతో పాండవులు నిర్మించుకున్న మయసభలో దుర్యోధనుడు ఏ విధంగా భంగపడ్డాడో మనందరికీ తెలుసు. ఎంత నగుబాటు పాలయ్యాడో భారత కథ చెబుతుంది. అనంతర పరిణామాలు అతని నాశనానికి దారితీశాయి. ఇప్పుడు చంద్రబాబు విషయంలో కూడా అదే జరగబోతుందనడంలో సందేహం లేదు. జగన్ నిర్మించిన స్కిల్ సౌధం చంద్రబాబుకు రాజకీయ సమాధిని కట్టడం ఖాయం.

ఇదీ బాబు నైపుణ్యానికీ జగన్ సామర్థ్యానికీ మధ్య తేడా.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు
మొబైల్ : 98481 28844

ఏవి నియంత్రించాలి?

అత్యంత ప్రాచీన శ్రేష్ఠమైన జీవనవిధానం మనది. ఋషి సంప్రదాయం మనది. మానవ జీవితంలో సాధించాల్సినవి కూడా ఏనాడో మన పూర్వీకులు గ్రంథాల్లో పొందుపరచారు. ఆచరణలో అందించారు. అవే చతుర్విధ పురుషార్థాలు. పురుషుడు అంటే ఇక్కడ మానవుడు (స్త్రీ/పురుష) అని అర్థం. ఆ మానవుడు సాధించాల్సిన నాలుగు వరుసగా ధర్మం, అర్థం, కామం, మోక్షం.

ఆలయానికి వెళ్లిన ప్రతి సందర్భంలోనూ అర్చక స్వామి 'ధర్మార్థకామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం' అని అంటారు. కాని చాలా మంది అవి ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయరు. ప్రతి ఒక్కరూ వరుసగా ఆ నాల్గింటినీ సాధించాలి మరి.

జ్యోతిర్మయం

అందులో మొట్టమొదటిదే ధర్మం. ఆ ధర్మానికి ముడిపడి ఉన్నవే అర్థ (సంపద), కామము (కోరిక)లు. ధర్మబద్ధమైన సంపదల వల్ల, ధర్మబద్ధమైన కోరికల వల్ల మానవ జన్మకి కలిగే విముక్తియే మోక్షం.

మనిషి ధర్మాన్ని పట్టుకోవాలి. అర్థ, కామాల్ని నియంత్రించుకోవాలి. ధర్మబద్ధ జీవితం వల్ల మోక్షం దానంతట అదే వస్తుంది. అర్థ, కామములు నది ప్రవాహంలోని వరదల వంటి వేగం కలవి. రెండు వైపులా వరదల వేగాన్ని నియంత్రించే నదీ తీరాలే ధర్మ, మోక్షాలు.

ఆధునిక మనోకాలుష్య ప్రపంచంలో ధార్మిక జీవనానికి స్థానమేది? చతుర్విధ పురుషార్థాల ఆలోచనేది? హడావిడి, ఆడంబర భక్తి పెరిగింది తప్ప ధర్మబద్ధ జీవనం, ఆధ్యాత్మికత్వం, ధర్మం అన్నదే లేదు. అధికాధిక డబ్బు సంపాదన, తరతరాలకు తరగని ఆస్తులు కూడబెట్టటం తప్ప ధర్మబద్ధమైన ఆర్థిక ప్రణాళిక, దానధర్మాలకు తావు లేదు. మితిమీరిన, తీరలేని, విలాసవంతమైన భౌతిక సుఖాలు–కోరికల వెంట పరుగెత్తటం తప్ప, ధర్మబద్ధమైన తృప్తి ఎక్కడ?

పాశ్చాత్య జీవన శైలికి అలవాటుపడ్డ మానవుడు భౌతిక సుఖాల వెంట పరుగెత్తుతూ, మానవ జీవిత లక్ష్యాన్ని విస్మరిస్తున్నాడు. ప్రపంచ దేశాలన్నీ భౌతిక వాదంతో ప్రకృతిని కొల్లగొట్టి, ప్రమాదకర పరిస్థితుల్లోకి భూగోళాన్నే నెట్టేశాయి. అనుభవించటమే జీవనసూత్రంగా పెట్టుకున్న దేశాలు, ఆయా దేశాల్లోని ప్రజలు తిరిగి ఆనందం, సుఖశాంతుల కోసం మన భారతీయ సాంస్కృతిక జీవన విధానం వైపు మరలుతున్నారు. ఈ క్రమంలో భారతీయులుగా మన వైభవోపేతమైన సాంస్కృతిక జీవన విలువల్ని పునఃస్థాపిద్దాం.

– సాకి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చతుర్దశి సా.5.58 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** ధనిష్ట ఉ.7.05 వరకు, తదుపరి శతభిషం తె.5.31 వరకు (తెల్లవారితే ఆదివారం), **వర్జ్యం:** ప.1.50 నుండి 3.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.15 నుండి 7.49 వరకు, **అమృతఘడియలు:** రా.10.45 నుండి 12.13 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.17, **సూర్యాస్తమయం:** 6.04.

క్లుప్తంగా...

భువనేశ్వర్–విశాఖ మధ్య వందేభారత్ ట్రయల్ రన్



తాటిచెట్లపాలెం(విశాఖ జిల్లా): త్వరలో భువనేశ్వర్–విశాఖపట్నం–భువనేశ్వర్ మధ్య నడవనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్ శుక్రవారం విజయవంతంగా పూర్తయింది. ఉదయం 5.15 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరిన ఖాళీ రైలు (ట్రయల్ రన్ కోసం) ఉదయం 10.55 గంటలకు విశాఖ చేరుకుంది. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి ఈ రైలు బయల్దేరింది. ఒక ఎగ్జిక్యూటివ్, ఏడు చెయిర్ కార్ కోచ్‌లతో కలిపి మొత్తం ఎనిమిది కోచ్‌లతో ఈ వందేభారత్ రాకపోకలు సాగించనుంది. భువనేశ్వర్ నుంచి బయల్దేరబోయే ఈ రైలుకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 12వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. వాల్తేర్ డివిజన్ మాత్రం అధికారికంగా ఈ రైలు వేళలు, రోజులు ఇంకా తెలియజేయలేదు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా, రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్యామ్ బాజీ శివాజీ షిండే శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో భీమా చిత్రం హీరో గోపీచంద్, నిర్మాత రాధా మోహన్, దర్శకుడు హరీష్ ఉన్నారు.

మహిళలకు బాబు మరో టోకరా పథకం

- మహిళా దినోత్సవం రోజునే వారిని మభ్యపెట్టే ఎత్తుగడ
- ఇప్పటికే 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ' పథకాలకు స్పందన కరువు
- ఇప్పుడు కొత్త పేరుతో మరో కొత్త హామీపై పార్టీలోనే విమర్శలు


సాక్షి, అమరావతి: మహిళా దినోత్సవం రోజునే మహిళల్ని మాయచేసేలా చంద్రబాబు మరో పథకాన్ని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే 'కలలకు రెక్కలు' పేరుతో ఒక పథకాన్ని అమలుచేస్తామని, దీనికి ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరడం గమనార్హం. ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసుకున్న ఆడపిల్లలు పై చదువులు చదివేందుకు తీసుకునే రుణాలకు ప్రభుత్వమే పూచీకత్తుగా ఉంటుందని, కోర్సు కాలానికి వారు తీసుకున్న రుణంపై వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల్ని నిండా ముంచి ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి పథకాలు ప్రకటించడంపట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికే 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ' పేరుతో కొన్ని పథకాలను ఆయన ప్రకటించినా ప్రజల్లో స్పందన కరువైంది. మహాశక్తి, యువగళం, పూర్ టు రిచ్ పేరుతో ఆయన ప్రకటించిన పథకాలను జనం నమ్మడంలేదు. 2014లో ఇష్టం వచ్చినట్లు హామీలిచ్చి ఐదేళ్లలో అమలుచేయకుండా నిండా ముంచిన చరిత్ర ఉండడంతో ఆయన పథకాలపై ప్రజల్లో ఏహ్యాభావం నెలకొంది. బంగారు నగలపై రుణాలను మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని అమలుచేయకపోవడంవల్ల చంద్రబాబును నమ్మి మహిళలు అన్ని విధాలా మోసపోయారు. మహిళలకు ఎన్నో చేస్తామని చెప్పినా ఒక్కటీ చేయలేదు. కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యను అమలుచేస్తామని చెప్పి అధికారంలో ఉన్నప్పుడు ఆ ఊసే ఎత్తలేదు. ఇప్పుడు మళ్లీ ఆడపిల్లలను మోసం చేసేందుకు 'కలలకు రెక్కలు' అంటూ కొత్త పేరుతో కొత్తగా హామీ ఇవ్వడంపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

ఇక రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు టీడీపీ ఇన్‌చార్జిలను నియమించింది. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గానికి గోరంట్ల రవికుమార్, వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గానికి ముక్కా రూపానందరెడ్డిని ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

శివోహం..

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
శ్రీశైలం మల్లన్నకు పాగాలంకరణ
వైభవంగా కోటప్పకొండ తిరునాళ్లు
శ్రీకాళహస్తిలో విశేష అభిషేకాలు



శ్రీశైలంలో అశేష భక్తజనం మధ్య ప్రభోత్సవం (ఇన్‌సెట్) ఆది దంపతులు

శ్రీశైలంటెంపుల్/సాక్షి, నరసరావుపేట/రేణిగుంట(తిరుపతి జిల్లా)/నెల్లిమర్ల రూరల్/బీచ్‌రోడ్డు (విశాఖ జిల్లా): మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ప్రముఖ శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీశైలంలో మల్లన్నకు సంప్రదాయబద్ధంగా తల పాగాలంకరణ, కోటప్పకొండలో భారీ విద్యుత్ ప్రభల ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష అభిషేకాలు జరిపారు. వివిధ వాహనాలపై కొలువుతీరిన ఆది దంపతులు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులను అనుగ్రహించారు... నంద్యాల జిల్లా శ్రీశైలంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామి వారు నంది వాహనంపై ఊరేగారు. వివిధ జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి 10 గంటల నుంచి స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. ఆ వెంటనే మరో వైపు పాగాలంకరణ ప్రారంభమైంది. ఆలయంలోని విద్యుత్ దీపాలను ఆర్పి వేయగా.. బాపట్ల జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు దిగంబరుడై పాగాను అలంకరించారు. పాగాలంకరణ జరుగుతున్నంత సేపు ఆలయంలో ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణ మారుమోగింది. రాత్రి 12 గంటల సమయంలో స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, జేసీ టీ.రాహుల్ కుమార్‌రెడ్డి, రాయలసీమ జోన్ డీఐజీ సీహెచ్.విజయరావు, ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్ర విమానం, చప్పరంపై స్వామివారి దర్శనం



శ్రీకాళహస్తిలో ఊరేగుతున్న స్వామి వారు

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారు జామున స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ ఈవో నాగేశ్వరరావు క్యూలైన్లను పర్యవేక్షించారు. కాగా ఉదయం స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం, చప్పరంపై పురవీధుల్లో విహరించారు. రాత్రి శ్రీకాళహస్తీశ్వరుడు నంది వాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహ వాహనంపై విహరిస్తూ భక్తకోటిని కటాక్షించారు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ఆలయంలో స్వామి, అమ్మవార్ల లింగోద్భవ దర్శనం(నిజరూప దర్శనం) ప్రారంభం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో దర్శనానికి బారులుతీరారు.

రామతీర్థంలో శివనామస్మరణ

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని వైష్ణవ పుణ్యక్షేత్రం రామతీర్థానికి శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు పోటెత్తారు. సాక్షాత్తు శ్రీరాముడు రామక్షేత్రంలో శివుని మంత్రాన్ని జపించారన్నది భక్తుల విశ్వాసం. రామకోనేరు గట్టు, కల్యాణ మండపం, నీలాచలగిరి పరిసర ప్రాంతాల్లో కాగడాలు వెలిగించి రాత్రంతా జాగారం చేశారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం ప్రాంతాల నుంచి మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రతిమను మధ్యలో ఉంచి చుట్టూ వృత్తంలా ఏర్పడి సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బోడికొండ పర్వతంపై శిఖర జ్యోతిని వెలిగించారు. ఎస్పీ దీపిక పాటిల్, దేవదాయ శాఖ కమిషనర్ రామ సత్యనారాయణ, తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు.



సాగర తీరంలో మహా కుంభాభిషేకం

శివ నామస్మరణతో విశాఖ సాగరతీరం హోరెత్తింది. కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో 39వ మహా కుంభాభిషేకం ఆర్కే బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కుంభాభిషేకాన్ని శ్రీశారదపీఠం పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి, శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతి, టి.సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు వీరభద్రస్వామి పూజ నిర్వహించారు. భక్తులకు రుద్రాక్షలు, పసుపుతాళ్లు పంపిణీ చేశారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర కేంద్ర మాజీ మంత్రి సుబ్బరామిరెడ్డి

కోటప్పకొండలో ప్రభల ఉత్సవం



కోటప్పకొండలో కొలువుదీరిన విద్యుత్ ప్రభలు

పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున రెండు గంటలకు బిందె తీర్థంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. కోటప్పకొండ ప్రత్యేకతను చాటే ప్రభల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 20 భారీ విద్యుత్ ప్రభలతో పాటు చిన్న చిన్న ప్రభలు ప్రభల నిధికి చేరాయి. ప్రభల వద్ద భక్తుల సందడితో కోలాహలం నెలకొంది. రాత్రి స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీత్రికోటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి, బి.కృష్ణమోహన్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నంబూరు శంకర రావు, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతురావు, వెంపాడ చిరంజీవి దర్శించుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్ స్వామి వారి సేవలో పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా యనమలకుదురులో ప్రభల సందడి



శ్రీశైలం పాతాళగంగ వద్ద భక్తుల పుణ్యస్నానాలు



ఇంద్రకీలాద్రిపైన మల్లేశ్వరాలయంలో స్వామివారి కళ్యాణం

విద్యుత్ కనెక్షన్ మూడు రోజుల్లోనే..

- గడువు రోజులను సగానికి సగం తగ్గించిన కేంద్రం
- విద్యుత్ వాహనాలకు ప్రత్యేక విద్యుత్ కనెక్షన్‌కు అవకాశం
- వినియోగదారుల హక్కులు రూల్స్, 2020కి సవరణ



సాక్షి, అమరావతి : కొత్త ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇకపై మరింత వేగంగా రానుంది. ఇప్పటి వరకూ అమల్లో ఉన్న నిబంధనల మేరకు ఉన్న గడువును కేంద్రం తగ్గించింది. సగానికి పైగా రోజులను కుదిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఇందు కోసం విద్యుత్ చట్టం, 2003లోని సెక్షన్ 176 ప్రకారం విద్యుత్ (వినియోగదారుల హక్కులు) రూల్స్, 2020లో సవరణలు చేసింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఈ కొత్త నిబంధన ప్రకారం.. మహా నగరాల్లో(మెట్రోపాలిటన్) నివసించే వారు మూడు రోజుల నుంచి గరిష్టంగా ఏడు రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్‌లు పొందొచ్చు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో 15 రోజుల నుంచి ఏడు రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 30 రోజుల నుంచి 15 రోజులకు గడువు తగ్గిస్తూ మార్పులు చేశారు. ఇక కొండ ప్రాంతాలున్న గ్రామీణ ప్రాంతాలు కొత్త కనెక్షన్లు గానీ, ఇప్పటికే ఉన్న కనెక్షన్లలో మార్పులుగానీ చేసుకోవడానికి కనీస వ్యవధి 30 రోజులుగా నిర్ణయించారు. తాజా నిబంధనల మేరకు ఎలక్ట్రిక్ వాహనాలకు(ఈవీ) ఇంటి వద్దే చార్జింగ్ పెట్టుకోవడానికి ప్రత్యేక విద్యుత్ కనెక్షన్ పొందొచ్చు. పీఎం సూర్య ఘర్ పథకంలో భాగంగా ఏడాదిలో కోటి గృహాలకు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేస్తామని, ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని కేంద్రం ఇటీవల ప్రకటించింది. దీనికి తోడ్పాటుగా భవనాలపై రూఫ్ టాప్ సోలార్ పీవీ సిస్టంల ఏర్పాటుకు డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీ కాల పరిమితినీ 30 నుంచి 15 రోజులకు తగ్గించారు.

నాణ్యమైన సేవలు.. వినియోగదారుల హక్కు

కనెక్షన్ కోసం దరఖాస్తు చేసిన వారికి విద్యుత్ సరఫరా చేయడం ప్రతి డిస్కం ప్రాథమిక విధిగా కొత్త నిబంధనలో స్పష్టం చేశారు. అలాగే డిస్కంల నుంచి నాణ్యమైన సేవలను పొందడం వినియోగదారుల హక్కుగా నిబంధనల్లో పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులొస్తే ఫిర్యాదు అందిన తేదీ నుంచి ఐదు రోజుల్లోపు అదనపు మీటర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని కేంద్రం ఇచ్చిన నిబంధనల్లో స్పష్టం చేశారు. కో–ఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, బహుళ అంతస్తుల భవనాలు, కాలనీల్లో నివసిస్తున్న వారు విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి వ్యక్తిగత విద్యుత్ సర్వీసులు పొందొచ్చు.. లేదా మొత్తం ప్రాంగణానికి సింగిల్ పాయింట్ కనెక్షన్ తీసుకోవచ్చు. అయితే మీటర్ లేకుండా కనెక్షన్ ఇవ్వకూడదని షరతు విధించారు. సాధ్యమైనంత వరకూ స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు పెట్టాలని, బిల్లులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ముందుగా కూడా చెల్లించొచ్చని పేర్కొన్నారు.

ముందే హీటెక్కిన సీమ

- మార్చి మొదటి వారంలోనే 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధికం
- కోస్తాంధ్రలోనూ ఉష్ణతాపం
- వచ్చే వారం నుంచి మరింత హీట్



సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది రాయలసీమలో వేసవి సెగలు ముందే మొదలయ్యాయి. ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండల తీవ్రత పెరుగుతోంది. మార్చి మొదటి వారం నుంచి మరింతగా విజృంభిస్తున్నాయి. ఏప్రిల్ నెలారంభంలో నమోదు కావాల్సిన పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలు ఇప్పటినుంచే రికార్డవుతున్నాయి. ప్రస్తుత ఉష్ణతాపాన్ని చూసి ముున్ముందు ఇంకెంత తీవ్రతను చవి చూడాల్సి వస్తుందోనన్న ఆందోళన ఆ ప్రాంత వాసుల్లో నెలకొంటోంది. సాధారణంగా ఏప్రిల్ ప్రారంభం నుంచి 40 డిగ్రీలు, అంతకుమించి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ.. ఈ ఏడాది అందుకు భిన్నంగా మార్చి ఆరంభంలోనే 41 డిగ్రీలకు పైగా చేరుకుంటున్నాయి. ఈ నెల 2న శనివారం అనంతపురంలో 41, కర్నూలు 39, నంద్యాల, కడపలో 38 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 3న అనంతపురంలో 39, కర్నూలులో 39, నంద్యాల, కడపలో 38, 4న అనంతపురంలో 40, కర్నూలులో 39, నంద్యాల, కడపల్లో 38 డిగ్రీలు, 5న 4న అనంతపురంలో 40, కర్నూలులో 39, నంద్యాల, కడపల్లో 38 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్నాళ్లుగా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకంటే రాయలసీమలోనే ఉష్ణతాపం అధికంగా కనిపిస్తోంది. అక్కడ సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధికంగా ఉంటోంది. రాష్ట్రంలో విశాఖపట్నం, కళింగపట్నం మినహా అన్ని ప్రాంతాల్లో 33 నుంచి 37 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దక్షిణ, ఉత్తర కోస్తాల్లో రాయలసీమ కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు రికార్డవుతుండటం ఆ ప్రాంత వాసులకు ఒకింత ఊరటనిస్తోంది.

సెగలకు ఇదీ కారణం

కోస్తాంధ్ర కంటే రాయలసీమలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవడానికి గాలిలో తేమ తక్కువగా ఉండటమే కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా గాలిలో తేమ తక్కువగా ఉంటే ఉష్ణతాపం పెరగడానికి దోహదపడుతుంది. ఈ తేమ 50 శాతం కన్నా తగ్గే కొద్దీ వేడి అధికమవుతుంది. కొద్ది రోజులుగా రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, నంద్యాలలో తేమ 19 నుంచి 26 శాతం మాత్రమే ఉంటోంది. అందువల్ల అక్కడ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే అధిక ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి.

వారంలో మరింత భగభగ

రానున్న వారం రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల సాధారణంకంటే 2–3 డిగ్రీలు అధికంగా నమోదవుతుండగా.. వారం పది రోజుల్లో అవి 4–5 డిగ్రీలకు ఎగబాకే అవకాశం ఉందని చెబుతున్నారు.

శ్రీబృహదీశ్వరాలయం ప్రారంభం



శ్రీబృహదీశ్వర ఆలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి కల్చరల్: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలోనున్న ధ్యానారామం వద్ద శ్రీవాణి ట్రస్టు నిధులతో టీటీడీ నిర్మించిన శ్రీబృహదీశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పాల్గొని అర్చక పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజాది క్రతువులు చేపట్టారు. తర్వాత మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సీఏవో శేషశైలేంద్ర, వేద వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధాగోవింద త్రిపాఠి పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి

డీఎస్పీకి నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు



టౌన్ సీఐ కాంతికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): తనను అవమానించిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు విజయ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయ్యన్నపాత్రుడు వద్ద ప్యాకేజీ తీసుకుని కులాల మధ్య చిచ్చు రేపుతున్న పుచ్చల విజయకుమార్, నేతల నాగేశ్వరరావు, కోడి శ్రీనువాసరావులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఆమె వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు మామిడి శ్రీను, ఆరుగుల్ల రాజుబాబు, అల్లంపల్లి ఈశ్వరరావు, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ముస్లిం కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ షేక్ ఉన్నీసాబేగం, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, జాన్, మార్లపూడి సత్తిబాబుతో కలిసి నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐ కాంతికుమార్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, నేతలు మామిడి శ్రీను, రాజుబాబు, ఈశ్వరరావు మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే అయ్యన్నపాత్రుడు దళితులకు ఎందుకు అగ్రస్థానం కల్పించలేదని ప్రశ్నించారు. ఒక దళిత మహిళను మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టిన ఘనత ఎమ్మెల్యే గణేష్‌ది అని చెప్పారు. ఓటమి భయంతో అయ్యన్నపాత్రుడు పేటీఎం బ్యాచ్‌తో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రథమ పౌరురాలినైన తనను కించపరిచే విధంగా, దళితుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుచ్చల విజయకుమార్ తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయ్యన్నపాత్రుడు సొంత నిధులతో ఎప్పుడైనా ఒక్క దేశ నాయకుడి విగ్రహమైన పెట్టారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గణేష్ 13 మంది దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తే, వాటివద్దకు రాత్రివేళ వెళ్లి తన ప్రతిష్టను దెబ్బతీసేలా తేదీలు మార్చి తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డమ్మీ చైర్‌పర్సన్ అని, పరిపాలన చేతకాదని నోటికి వచ్చినట్టు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అయ్యన్నపాత్రుడు కొడుకు విజయ్ ఎంత ఇచ్చాడంటూ విరుచుకుపడ్డారు. దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన టీడీపీ పేటీఎం బ్యాచ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

53 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి: కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించే ప్రక్రియలో భాగంగా 53 మంది వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజేషన్ చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. గురువారం 1,924 మంది ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో మొత్తంగా 1,977 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినట్టైంది. 2019 ఎన్నికల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న విషయం తెలిసిందే.

కొనసాగుతున్న పడిగాపులు

- కమలనాథుల కరుణ కోసం చంద్రబాబు – పవన్ పాట్లు
- నేడు పాట్నా పర్యటనకు అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: పొత్తు కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని రెండు రోజులుగా ఢిల్లీలో పడిగాపులు కాస్తున్నా కమలనాథులు కరుణించకపోవడంతో చంద్రబాబు – పవన్ ద్వయం మల్లగుల్లాలు పడుతోంది. ఎలాగైనా ఎన్డీఏలో చేరాలని, బీజేపీతో పొత్తు లేకుంటే తనకు దిక్కు లేదని భావిస్తున్న చంద్రబాబు గురువారం రాత్రి ఒక దఫా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినా స్పష్టత రాలేదు. దీంతో శుక్రవారం సాయంత్రం లోపు పొత్తు ప్రకటన వస్తుందని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. బీజేపీ సీట్లు ఎక్కువగానే అడుగుతున్నా పొత్తు దాదాపుగా ఖరారైనట్లేనంటూ అనుకూల మీడియాకు చంద్రబాబు లీకులిచ్చారు. అయితే రోజులు గడుస్తున్నా అలాంటిదేమీ లేకపోగా శనివారం ఉదయం అమిత్ షా పాట్నా పర్యటనకు వెళుతున్న నేపథ్యంలో చంద్రబాబు – పవన్ పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో చంద్రబాబు చేసేదేమీ లేక ఆయన రాక కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచే తీరిగ్గా టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ అసంతృప్త నేతలకు సర్ది చెప్పే పనిలో చంద్రబాబు నిమగ్నం కాగా పొత్తు కోసం ఇంతగా దేబిరించాలా? అని పార్టీ నేతలు మండిపడుతున్నారు. మరోవైపు గతంలో ప్రధాని మోదీని ఇష్టానుసారం దూషించిన నేపథ్యంలో చంద్రబాబు క్షమాపణ చెప్పాకే ఎన్డీఏలోకి అనుమతిస్తామని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

'ఏఐ' బడి

- రాష్ట్రంలో తొలిసారిగా చీపురుపల్లి జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏఐ ల్యాబ్ ఏర్పాటు
- రూ.15 లక్షలతో 9 అత్యాధునిక కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు

చీపురుపల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) శకం ఆరంభమైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలోని కార్పొరేట్ స్కూళ్లలో సైతం ఎక్కడా లేని విధంగా విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇంటెల్ ఇండియా సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అధునాతన ఏఐ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది రాష్ట్రంలోనే తొలి ఏఐ ల్యాబ్ కావడం విశేషం. ఈ ల్యాబ్ పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయనుంది. రానున్న రోజుల్లో మరిన్ని అధునాతన ల్యాబ్‌ల ఏర్పాటుకు మార్గదర్శి కానుంది. సమాజానికి ఉపయోగపడే ఆధునిక ఆవిష్కరణలకు దోహదపడనుంది.

'ఏఐ ఫర్ యూత్' పేరుతో నాలుగు సెషన్లు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లలో 'ఏఐ ఫర్ యూత్' అనే పేరుతో నాలుగు సెషన్లలో 8, 9 తరగతుల విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. మొదటి సెషన్‌లో ఇన్‌స్పైర్, రెండో సెషన్‌లో ఎక్వయర్, మూడో సెషన్‌లో ఎక్స్‌పీరియన్స్, నాలుగో సెషన్‌లో ఎంపవర్ అనే అంశాలపై శిక్షణ ఇస్తారు. ఈ నాలుగు సెషన్లు పూర్తయిన తర్వాత సమాజంలో ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేయాల్సి ఉంటుంది.

రూ.15 లక్షలతో ల్యాబ్ ఏర్పాటు

రాష్ట్రంలో తొలిసారిగా రూ.15 లక్షలతో చీపురుపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో తొమ్మిది అత్యాధునిక కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, ఏసీలు ఉన్నాయి. దీనికోసం బాలుర ఉన్నత పాఠశాలలో ఒక గదిని కేటాయించారు.

రాజ్యసభకు సుధామూర్తి

నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



సాక్షి, న్యూఢిల్లీ/బనశంకరి: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారాయణమూర్తి సతీమణి, ప్రముఖ సంఘ సేవకురాలు, రచయిత్రి డాక్టర్ సుధా నారాయణమూర్తి(73) రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమెను పార్లమెంట్ ఎగువ సభకు నామినేట్ చేశారు. సామాజిక, విద్యా రంగాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పెద్దల సభకు పంపిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే రాజ్యసభకు నామినేట్ చేయడం తనకు డబుల్ సర్‌ప్రైజ్ అని సుధామూర్తి పేర్కొన్నారు. తాను ఏనాడూ పదవులు ఆశించలేదని చెప్పారు. రాష్ట్రపతి తనను పెద్దల సభకు నామినేట్ చేయడానికి గల కారణం తెలియదని అన్నారు. ఉన్నత చట్టసభకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఇది తనకు కొత్త బాధ్యత అని వ్యాఖ్యానించారు. రాజ్యసభ సభ్యురాలిగా తన వంతు సేవలు అందిస్తానని వివరించారు. ప్రధాని మోదీకి సుధామూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో పర్యటిస్తున్న సుధామూర్తి ఫోన్‌లో మీడియాతో మాట్లాడారు.

ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సుధామూర్తిని రాష్ట్రపతిద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా ఆనందంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అనాథ ఆశ్రమాలు ఏర్పాటు చేయడంతోపాటు వివిధ రంగాల్లో ఎన్నెన్నో సేవలు అందించిన సుధామూర్తి చట్టసభలోకి అడుగు పెడుతుండడం నారీశక్తికి నిదర్శనమని మోదీ ఉద్ఘాటించారు. ఆమెకు అభినందనలు తెలియజేశారు.

టెల్కోలో తొలి మహిళా ఇంజనీర్

డాక్టర్ సుధామూర్తి 1950 ఆగస్టు 19న కర్ణాటకలోని హావేరి జిల్లా శిగ్గావిలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు డాక్టర్ ఆర్‌హెచ్ కులకర్ణి, విమలా కులకర్ణి. సుధామూర్తి హుబ్లీలోని బీవీబీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీఈ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచి కంప్యూటర్స్‌లో ఎంఈ చేశారు. టాటా ఇంజనీరింగ్ లోకోమోటివ్ కంపెనీ(టెల్కో)లో ఉద్యోగంలో చేరారు. దేశంలోనే అతి పెద్దవాహన తయారీ కంపెనీలో మొదటి మహిళా ఇంజనీర్‌గా గుర్తింపు పొందారు. 1970 ఫిబ్రవరి 10న నారాయణ మూర్తితో వివాహం జరిగింది. 1981లో స్థాపించిన ఇన్ఫోసిస్ కంపెనీకి సుధామూర్తి సహ వ్యవస్థాపకురాలు. సంస్థ ప్రారంభించే సమయంలో రూ.10వేలు తన భర్తకు ఇచ్చి ప్రోత్సహించారు.

సేవా కార్యక్రమాలు.. పురస్కారాలు

1996లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను సుధామూర్తి ప్రారంభించారు. కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో పలు పుస్తకాలు రాశారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వరద బాధితుల కోసం 2,300 ఇళ్లు నిర్మించారు. పాఠశాలల్లో 70 వేల గ్రంథాలయాలు నిర్మించారు. భారత ప్రభుత్వం నుంచి 2006లో పద్మశ్రీ,, 2023లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి చింతామణి అత్తిమబ్బే అవార్డు స్వీకరించారు. సాహిత్యంలో ఆమె చేసిన సేవకుగానూ ఆర్కే నారాయణ సాహిత్య పురస్కారం, శ్రీరాజా-లక్ష్మీ ఫౌండేషన్ అవార్డు అందుకున్నారు. భర్త నారాయణమూర్తి (2014)తో సమానంగా 2023లో గ్లోబల్ ఇండియన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు ద్వారా తాను అందుకున్న మొత్తాన్ని టోరంటో విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చారు. నాన్‌ఫిక్షన్ విభాగంలో క్రాస్‌వర్డ్ బుక్ అ వార్డు, ఐఐటీ-కాన్పూర్ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. నారాయణమూర్తి, సుధామూర్తి దంపతులకు అక్షతామూర్తి, రోహన్‌మూర్తి సంతానం. అక్షతామూర్తి భర్త రిషి సునాక్ బ్రిటన్ ప్రధాన మంత్రి. వీరిది ప్రేమ వివాహం.

◆ రాజ్య సుధ

- ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

బెంగళూరు గొంతెండుతోంది

ఎటుచూసినా నీటి ఎద్దడే నగరంలో వట్టిపోయిన బోర్లు

వేసవి రాకముందే సమస్య • నీటి వాడకంపై ఆంక్షలు • ఉల్లంఘిస్తే రూ.5,000 జరిమానా

"అవడానికి మాదో లగ్జరీ అపార్ట్‌మెంట్. కానీ ఏం లాభం? నెల రోజులుగా చుక్క నీటికీ దిక్కు లేక అల్లాడుతున్నాం! 24 గంటలూ రావాల్సిన నల్లా నీళ్లు ఏ రాత్రి వేళో వస్తున్నాయి. అవీ మురికిమయం! స్నానపానాలకే కాదు, చివరికి టాయ్‌లెట్ అవసరాలకు కూడా నీరు లేదు. సరిగా నీళ్లు కూడా పోయక ఏ ఫ్లాట్‌లో చూసినా టాయ్‌లెట్లు భరించలేనంతగా కంపు కొడుతున్నాయి. దాంతో రెసిడెంట్లు మూకుమ్మడిగా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. అలా వెళ్లలేనివాళ్లం విధిలేక పక్కనే ఉన్న ఫోరం సౌత్ మాల్‌లోకి వెళ్లి టాయ్‌లెట్ అవసరాలు తీర్చుకుంటున్నాం!" - రెడిట్‌లో ఓ బెంగళూరు వాసి పెట్టిన పోస్టిది! అలాంటిదేమీ లేదంటూ సదరు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఖండించినా ఈ పోస్టు ప్రస్తుతం తెగ వైరలవుతోంది. దీనికి బెంగళూరు టెకీల నుంచి విపరీతమైన స్పందన వెల్లువెత్తుతోంది. తమ నీటి కష్టాలకు అంతు లేదంటూ వర్ణిస్తూ వారు పెడుతున్న పోస్టులతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



దేశ ఐటీ రాజధాని బెంగళూరు గొంతెండిపోతోంది. తీవ్ర నీటి కొరతతో అల్లాడుతోంది. గుక్కెడు తాగునీటి కోసం జనం అలో లక్ష్మణా అంటూ అలమటిస్తున్నారు. నగరవ్యాప్తంగా బోర్లన్నీ చుక్క నీరైనా లేకుండా ఎండిపోయాయి. నగరంలో ఏటా వేసవిలో నీటి కొరత మామూలే అయినా ఈసారి మాత్రం సమస్య చాలా దారుణంగా ఉంది. ఇంకా వేసవి మొదలైనా కాకముందే నీటి కొరత తారస్థాయికి చేరింది. కోట్లు పెట్టి లగ్జరీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుక్కున్న వాళ్లు కూడా కనీసం స్నానానికైనా నీళ్లు లేక లబోదిబోమంటున్నారు. సమర్థమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవీ చేయలేక ప్రభుత్వ యంత్రాంగం కూడా ప్రస్తుతానికి చేష్టలుడిగింది. రాష్ట్రవ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొని ఉందంటూ ప్రకటించింది! నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇప్పటికే తాలూకా స్థాయిలో కంట్రోల్ రూములు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది. బెంగళూరులో నీటి సమస్య నివారణకు ఎంతదూరమైనా వెళ్తామంటూ ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ చేసిన ప్రకటనలు ఇప్పటికైతే కార్యరూపం దాల్చలేదు. పరిస్థితి పూర్తిగా చేయి దాటకుండా చూసేందుకు నగరంలో నీటి వాడకంపై రాష్ట్ర జల బోర్డు కఠిన ఆంక్షలు విధించింది. కార్లు కడిగేందుకు, మొక్కలకు, మెయింటెన్స్, నిర్మాణ పనులకు తాగునీటి వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ఉల్లంఘిస్తే రూ.5,000 జరిమానా తప్పదని హెచ్చరించింది. బెంగళూరులోనే గాక కర్ణాటకవ్యాప్తంగా నీటి ఎద్దడి ఆందోళనకర స్థాయిలోనే ఉంది. గత సీజన్లో వర్షాభావమే ఈ దుస్థితికి కారణమన్న ప్రభుత్వ ప్రకటనపై జనం మండిపడుతున్నారు. ఇంతటి సమస్య తప్పదని ముందే తెలిసి కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లేవీ చేయలేదంటూ దుయ్యబడుతున్నారు. ''నిజానికి మూడు నెలలుగా నీటి సమస్య వెంటాడుతోంది. నెల నుంచి పరిస్థితి మరీ విషమించింది'' అంటూ వాపోతున్నారు.

ట్యాంకర్ల రేట్లు చుక్కల్లోకి...

➤ బెంగళూరులో ఏకంగా 60 శాతం జనం నీటి కోసం వాటర్ ట్యాంక్‌ల మీదే ఆధారపడ్డారు! అదను చూసి ప్రైవేట్ ట్యాంకర్లు రేట్లు ఎడాపెడా పెంచేశాయి.
➤ మామూలు రోజుల్లోనే 6,000 లీటర్ల ట్యాంకర్‌కు రూ.600, 8,000 లీటర్లకు రూ.800, 12 వేల లీటర్ల ట్యాంకర్లైతే రూ.1,000 చార్జి చేస్తారు.
➤ ఈ రేట్లకు జీఎస్టీ అదనం. పైగా దూరం 5 కి.మీ. దాటితే మరో రూ.200 దాకా పెరుగుతుంది.
➤ ఇప్పుడు ప్రైవేట్ ట్యాంకర్లు రెట్టింపు, అంతకుమించి వసూలు చేస్తున్నాయంటూ జనం గగ్గోలు పెడుతున్నారు.
➤ దాంతో ట్యాంకర్ల రేట్లకు పరిమితి విధిస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఎక్కడా పెద్దగా అమలు కావడం లేదు.
➤ ఇవేం ధరలంటూ గట్టిగా నిలదీస్తే ట్యాంకర్‌వాలాలు ఆ కాలనీల ముఖం కూడా చూడటం లేదు.
➤ మున్సిపాలిటీ నల్లాల వద్ద క్యూ లైన్లు కిలోమీటర్లు దాటేస్తున్నాయి. అక్కడా ఒక్క బిందెకు మించి ఇవ్వడం లేదు!
➤ ఆర్వో ప్లాంట్ల ముందు కూడా ఒక్కరికి ఒక్క క్యానే అంటూ బోర్డులు దర్శనమిస్తున్నాయి!
➤ చాలా ప్లాంట్లు 'నో వాటర్' అంటూ బోర్డులు పెట్టి బ్లాకులో అడ్డగోలు రేట్లకు అమ్ముకుంటున్నాయి.
➤ నీటి ఎద్దడి దెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలు ఆన్‌లైన్ బాట పడుతున్నాయి. ఆన్‌లైన్ క్లాసులతో పని కానిస్తున్నాయి.

ఎందుకింత సమస్య...

➤ 2023లో కర్ణాటక వ్యాప్తంగా నెలకొన్న వర్షా భావ పరిస్థితులు ప్రస్తుత నీటి సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి.
➤ రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూగర్భ జలాలు అడుగంటాయి. కావేరీ బేసిన్లోని రిజర్వాయర్లన్నీ దాదాపుగా వట్టిపోయాయి.
➤ కర్ణాటకలోని 16 పెద్ద రిజర్వాయర్లలో 2023లో ఇదే సమయానికి సగం వరకున్న నీటిమట్టం ఈసారి 29 శాతానికి పడిపోయింది.
➤ బెంగళూరులో ఎక్కడ చూసినా బోర్లే దర్శనమిస్తుంటాయి. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడం నగరంలో నీటి ఎద్దడికి ప్రధాన కారణం.
➤ రియల్టీ బూమ్ నేపథ్యంలో రెండు దశాబ్దాలుగా నగరంలోని చెరువులు, నీటి ఆవాసాలన్నీ కాలనీలు, అపార్ట్‌మెంట్లుగా మారిపోయాయి. ఆ దెబ్బకు స్థానిక నీటి వనరులు పూర్తిగా కనుమరుగయ్యాయి.

సిలిండర్ ధర రూ.100 తగ్గింపు

నారీశక్తికి లబ్ధి చేకూరుతుందన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 14.2 కేజీల వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. తగ్గిన ధర వెంటనే అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. ధర తగ్గింపుతో ఢిల్లీలో 14.2 కేజీల గృహవినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.803కు దిగి వచ్చింది. స్థానిక పన్నుల్లో వ్యత్యాసాలను బట్టి రాష్ట్రాల్లో ధరలో స్వల్ప మార్పులు ఉండొచ్చు. దేశీయ ఇంధన ధరలకు ప్రామాణికంగా భావించే అంతర్జాతీయ చమురు, గ్యాస్ ధరలు స్వల్పంగా కిందకు దిగొచ్చిన కారణంగానే ఎల్పీజీ ధర తగ్గించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. రికార్డుస్థాయిలో గత 23 నెలలుగా పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ' మహిళా దినోత్సవం సందర్భంగా మా ప్రభుత్వం ఎల్పీజీపై రూ.100 తగ్గించింది. దేశవ్యాప్తంగా కోట్లాది గృహాలకు ముఖ్యంగా నారీశక్తికి ఈ నిర్ణయం లబ్ధి చేకూరుతుంది' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. గత ఆరునెలల వ్యవధిలో వంటగ్యాస్ ధర తగ్గించడం ఇది రెండోసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది ఆగస్టులో సిలిండర్‌పై రూ.200 ధర తగ్గించారు. దీంతో అప్పటిదాకా తొమ్మిది నెలలుగా గరిష్టస్థాయి వద్ద ఉన్న సిలిండర్ ధర రూ.1,103 నుంచి రూ.903కు దిగివచ్చింది. శుక్రవారం నాటి తగ్గింపుతో వినియోగదారులకు ఇంకాస్త ఉపశమనం లభించింది.

ఉజ్వల లబ్ధిదారులకు రూ.503కే : దేశవ్యాప్తంగా అందరూ సబ్సిడీయేతర ధరకే వంటగ్యాస్‌ను కొనుగోలుచేస్తున్నారు. అయితే '' ప్రధాన్‌మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత కనెక్షన్ పొందిన గ్రామీణ ప్రాంత పేదలకు మాత్రమే ఒక్కో సిలిండర్‌పై రాయితీ రూ.300 వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. తాజా తగ్గింపుతో వారు రూ.503కే సిలిండర్ పొందొచ్చు'' అని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న గ్యాస్ ధరలు ఎన్నికల్లో ప్రధానాంశంగా మారాయి. 2021 జూలై- 2023 ఆగస్ట్ మధ్య సిలిండర్ ధర ఏకంగా రూ.294 పెరిగింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ వినియోగదారులు 33 కోట్లకుపైగా ఉన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులు దాదాపు 10 కోట్ల మంది ఉంటారు. ధర తగ్గింపుతో దేశంలోని రిటైల్ చమురు రంగ సంస్థలకు రూ.వేల కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా.


ఢిల్లీ ఎస్సై అత్యుత్సాహం

న్యూఢిల్లీ: శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల వేళ ఉత్తర ఢిల్లీలోని కిక్కిరిసిన రహదారిపై నమాజ్ చేస్తున్న ముస్లింలపై ఒక పోలీస్ అధికారి తన ప్రతాపం చూపించాడు. రోడ్డు దిగ్బంధం చేయొద్దని తిడుతూ వీరావేశంతో కొట్టడం మొదలెట్టాడు. తన్నుతూ అక్కడి వారిని పక్కకు నెట్టడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మసీదు జనంతో నిండిపోవడంతో రోడ్డుపై నమాజ్ చేయాల్సి వచ్చిందని కొందరు ఆ సబ్‌ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తోమర్‌తో వాగ్వాదానికి దిగారు. ఢిల్లీలోని ఇందర్‌లోక్ మెట్రో స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై నమాజ్ చేయొద్దని ఒక పోలీసు నెమ్మదిగా వారిస్తుండగా, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో సబ్‌ఇన్‌స్పెక్టర్ కొట్టడాన్ని ముస్లింలు తీవ్రంగా తప్పుబట్టారు. ఎస్సైను సస్పెండ్‌చేయాలటూ స్థానిక ముస్లింలు రాస్తారోకో చేపట్టారు. పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగాయి. ఆ ఎస్సైను సస్పెండ్ చేస్తూ ఢిల్లీ నార్త్ డెప్యూటీ కమిషనర్ ఎంకే మీనా ఆదేశాలిచ్చారు.

ట్రంప్ ప్రపంచానికే ముప్పు

అమెరికా అధ్యక్షుడు బైడెన్ మండిపాటు

వాషింగ్టన్: తన కంటే ముందు దేశాధ్యక్షుడిగా పని చేసిన ఒక నాయకుడు అమెరికాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించాడని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆరోపించారు. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా దుమ్మెత్తి పోశారు. ఏ అధ్యక్షుడైనా అమెరికా ప్రజలను రక్షించడాన్ని కనీస బాధ్యతగా భావిస్తాడని, ఈ విషయంలో ఆ మాజీ అధ్యక్షుడు పదవిలో ఉన్నప్పుడు ఈ విషయంలో దారుణంగా విఫలమయ్యాడని, అతడిని క్షమించలేమని అన్నారు. బైడెన్ గురువారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గంటపాటు మాట్లాడిన బైడెన్.. ట్రంప్ పేరును 13 సార్లు పరోక్షంగా ప్రస్తావించారు. పలు అంశాల్లో ట్రంప్ వైఖరిని తప్పుపట్టారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ముందు ట్రంప్



మోకరిల్లాడని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. 'నాటో' దేశాలను ఏమైనా చేసుకోండి అంటూ పుతిన్‌కు సూచించాడని ఆరోపించారు. పుతిన్ చర్యలను అడ్డుకోకపోతే ప్రపంచ దేశాలకు నష్టం తప్పదని హెచ్చరించారు. పుతిన్ ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ఉక్రెయిన్‌కు అన్ని రకాలుగా సాయం అందించాల్సి ఉందని పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో సాధారణ పాలస్తీనియన్లు మరణించడం చూసి తాను తీవ్రంగా చలించిపోయానని బైడెన్ చెప్పారు.

గంజాయి తీసుకుంటే నేరం కాదు

డెమొక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ మరోసారి అమెరికా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మళ్లీ నెగ్గడానికి యువ ఓటర్ల మనసులు గెలుచుకొనే పనికి శ్రీకారం చుట్టారు. గంజాయి తీసుకుంటే, గంజాయి కలిగి ఉంటే నేరంగా పరిగణించవద్దని తేల్చిచెప్పారు. గంజాయి విషయంలో అమల్లో ఉన్న నిబంధనలను సమీక్షించాలని తన మంత్రివర్గాన్ని ఆదేశించానని చెప్పారు. సాధారణంగా స్టేట్ ఆఫ్ ద యూనియన్ అడ్రస్‌లో తమ విదేశాంగ విధానంతోపాటు దేశీయంగా కీలక అంశాలను అమెరికా అధినేతలు ప్రస్తావిస్తుంటారు. కానీ, గంజాయి గురించి మాట్లాడిన మొట్టమొదటి అధ్యక్షుడు మాత్రం బైడెన్ కావడం విశేషం.



మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్యకర్తలు అందజేసిన కేక్‌ను కట్ చేస్తున్న రాహుల్ గాంధీ

'స్టార్టప్ ఇండియా' లోపభూయిష్టం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

గోధ్రా(గుజరాత్): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'స్టార్టప్ ఇండియా' విధానం సరిగ్గా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ విధానం ఫలితంగా దేశంలో ఒక్కటంటే ఒక్క స్టార్టప్ కూడా లేదన్నారు. ఉన్నవి కూడా విదేశీ సంస్థల నియంత్రణలోనే నడుస్తున్నాయన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర శుక్రవారం గుజరాత్‌లోని గోధ్రాకు చేరుకుంది. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు రూ.5 వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా, 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, కార్మికులను మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జోడో యాత్ర గురువారం రాజస్తాన్ నుంచి దహోద్ వద్ద గుజరాత్‌లో ప్రవేశించింది. రాత్రి దాహోద్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం ఆయన ఝాలోద్‌పట్టణ సమీపంలోని కుంబోయి దామ్‌లో గిరిజనులకు ఆరాధ్యుడైన గోవింద్ గురుకు నివాళులర్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ మహిళా కార్యకర్తలు అందజేసిన భారీ కేక్‌ను తన ఎస్‌యూవీ పైనుంచే రాహుల్ కట్ చేశారు. గోధ్రాకు వస్తూ శివాలయంలో ఆయన పూజలు చేశారు. గోధ్రా నుంచి సాయంత్రం పావగఢ్‌కు చేరుకుని మా కొడియార్ ఆలయంలో పూజలు చేశారు. పంచ్‌మహల్ జిల్లా జంబుఘోడా గ్రామంలో రాత్రి బస చేశారు.

బీజేపీకి 333 పైమాటే

● టౌమ్స్ నౌ సర్వే వెల్లడి ● ఎన్డీయే కూటమికి 378 సీట్లు
● ఇండియా కూటమికి 120, ఇతరులకు 45 స్థానాలు
● కాంగ్రెస్‌కు 28 నుంచి 48 సీట్లకు మించకపోవచ్చు

న్యూఢిల్లీ: ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ ఘనవిజయం ఖాయమని టైమ్స్ నౌ చానల్-ఈటీజీ సర్వే శుక్రవారం పేర్కొంది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను ఆ పార్టీ ఒంటరిగా ఏకంగా 333 నుంచి 363 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుంటుందని అంచనా వేసింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి 378 స్థానాలదాకా సాధించవచ్చని వివరించింది. విపక్ష ఇండియా కూటమికి కేవలం 120, ఇతరులకు 45 స్థానాలు రావచ్చని పేర్కొంది. ఇండియా కూటమిలోని ప్రధాన పక్షమైన కాంగ్రెస్‌కు 28 నుంచి గరిష్ఠంగా 48 సీట్లొస్తాయని వివరించింది. తమిళనాట డీఎంకేకు 24 నుంచి 28 సీట్లు, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 10 నుంచి 11 సీట్లు వస్తాయని వెల్లడించింది. 42 లోక్‌సభ స్థానాలున్న పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ సారథ్యంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈసారి 17 నుంచి 21 స్థానాలతో సరిపెట్టుకుంటుందని పేర్కొంది. అక్కడ బీజేపీకి 20 నుంచి 24 సీట్లు రావచ్చని పేర్కొంది. ఏడు సీట్లున్న ఢిల్లీలో ఆప్ 5 నుంచి మొత్తం 7 స్థానాలూ కొల్లగొట్టవచ్చని సర్వే వెల్లడించడం విశేషం.

యూపీలో బీజేపీ క్లీన్‌స్వీప్

అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ క్లీన్‌స్వీప్ ఖాయమని సర్వే పేర్కొంది. రాష్ట్రంలో 80 స్థానాలకు ఎన్డీఏ కూటమికి 72 నుంచి 78 వస్తాయని, కాంగ్రెస్, సమాజ్‌వాదీలతో కూడిన 'ఇండియా' కూటమి 2 నుంచి 6 సీట్లకు పరిమితమవుతుందని తెలిపింది. ఇక బీఎస్పీ కేవలం 1 స్థానంతో సరిపెట్టుకోవాల్సి రావచ్చని అభిప్రాయపడింది. గుజరాత్‌లోనైతే మొత్తం 26 సీట్లనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని పేర్కొంది. బిహార్‌లో 42 సీట్లకు గాను బీజేపీ, జేడీ(యూ)తో కూడిన ఎన్డీఏ కూటమికి 31 నుంచి ఏకంగా 36 స్థానాలు రావచ్చని సర్వే అభిప్రాయపడింది. కాంగ్రెస్, ఆర్జేడీ తదితరులతో కూడిన ఇండియా కూటమి 2 నుంచి 4 సీట్లకు పరిమితమవుతుందని పేర్కొంది. ఇక 48 సీట్లున్న మహారాష్ట్రలో బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్)లతో కూడిన ఎన్డీఏ కూటమికి 34 నుంచి 38, కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్)లతో కూడిన ఇండియా కూటమికి 9 నుంచి 13 స్థానాలు రావచ్చని వివరించింది. కర్ణాటకలో ఎన్డీఏకు 22 నుంచి 24, కాంగ్రెస్‌కు కేవలం 4 నుంచి 6 సీట్లు రావచ్చని పేర్కొంది.

ఎన్డీయేకు 400 సీట్లు.. ఇది ప్రజల గ్యారంటీ

● ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
● డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు నేషనల్ క్రియేటర్స్ అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ: భారతదేశ ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రపంచానికి చాటాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశ విశిష్టతను ప్రస్ఫుటంగా తెలియజేసే సమాచారాన్ని రూపొందించాలని సూచించారు. 'క్రియేట్ ఆన్ ఇండియా' ఉద్యమంలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రపంచం తెలుసుకోవడం కోసం భారతదేశంపై అద్భుతమైన కథనాలు తయారు చేయాలని పేర్కొన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో భారత్ మండపంలో విజేతలకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'అబ్ కీ బార్ 400 పార్' అని జనం బిగ్గరగా నినాదాలు చేయగా, ప్రధానమంత్రి స్పందించారు. ఈసారి కూడా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల నాటి ఫలితాలే పునరావృతం అవుతాయని తేల్చిచెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400 సీట్లు గెలుచుకోవడం తథ్యమని పునరుద్ఘాటించారు. ఇది మోదీ గ్యారంటీ కాదని, 140 కోట్ల మంది ప్రజలు ఇస్తున్న గ్యారంటీ అని స్పష్టం చేశారు. కంటెంట్ సృష్టికర్తలు ఇండియాకు డిజిటల్ అంబాసిడర్లు, 'వోకల్ ఫర్ లోకల్'కు బ్రాండ్ అంబాసిడర్లు అని మోదీ అభివర్ణించారు.

షాజహాన్ షేక్ ఇంట్లో సీబీఐ సోదాలు

కోల్‌కతా: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులపై దాడి కేసులో బహిష్కృత టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఇల్లు, ఆఫీసుల్లో సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు జరిపారు. దాడికి సంబంధించిన ఆధారాల కోసం ఉత్తర 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖాలిలోని షాజహాన్ షేక్ నివాసం సమీప ప్రాంతాలను కూడా పరిశీలించారు. రేషన్ పంపిణీ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా జనవరి 5వ తేదీన షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలకు వెళ్లిన 14 మంది అధికారుల బృందంపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో సీబీకి చెందిన ఆరుగురు, సెంట్రల్ ఫోరెన్సిక్ నిపుణులు ఆరుగురు, ఈడీ అధికారులు ఇద్దరు గాయపడ్డారు. ఘటనతో సంబంధముందన్న ఆరోపణలపై టీఎంసీ నుంచి షాజహాన్ షేక్ సస్పెండయ్యాడు. హైకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో గురువారం షాజహాన్ షేక్‌ను అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు, సందేశ్‌ఖాలిలోని అతడి నివాసం, కార్యాలయాలకు సీల్ వేశారు.

అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ తమ పార్టీకి సంబంధించిన రూ.210 కోట్ల నిధులను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రిబ్యునల్ కొట్టివేసింది. కిందటి సంవత్సరాలకు సంబంధించి కాంగ్రెస్ సమర్పించిన ఐటీ రిటర్నుల్లో లోపాలు ఉన్నాయంటూ ఐటీ శాఖ ఆ పార్టీకి రూ.210 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఈ జరిమానా మొత్తాన్ని చెల్లించాలంటూ కాంగ్రెస్ ఖాతాలున్న బ్యాంకులను ఐటీ శాఖ ఆదేశించింది. వేర్వేరు బ్యాంకుల్లోని తమ ఖాతాల నుంచి తమకు తెలియకుండా రూ.65 కోట్లను ఐటీ శాఖ విత్‌డ్రా చేసుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. రూ.205 కోట్లను స్తంభింపజేసిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో తమ బ్యాంకు ఖాతాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది.పిటిషన్‌ను కొట్టివేస్తూ ట్రిబ్యునల్ శుక్రవారం తీర్పు వెలువరించింది.

నైజీరియాలో 287 మంది విద్యార్థుల కిడ్నాప్

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో సాయుధ దుండగులు 287 మంది విద్యార్థులను అపహరించుకుపోయారు. కడునా రాష్ట్రం కురిగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఉదయం దుండగులు చుట్టుముట్టారు. అప్పుడప్పుడే స్కూలుకు చేరుకుంటున్న విద్యార్థులను వారు బలవంతంగా తమ వెంట సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. మొత్తం 287 మంది విద్యార్థులు కనిపించడం లేదని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు. ఈ ఘటనకు కారణమంటూ ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించుకోలేదని అధికారులు చెప్పారు. సాయుధ ముఠాలు విద్యార్థులను కిడ్నాప్ చేయడం, పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం నైజీరియాలో 2014 తర్వాత పెరిగిపోయింది. 2014లో బోర్నో రాష్ట్రంలోని చిబోక్ గ్రామంలోని స్కూలు నుంచి 200 మందికి పైగా బాలికలను ఇస్లామిక్ తీవ్రవాదులు ఎత్తుకుపోవడం అంతర్జాతీయంగా కలకలం రేపడం తెలిసిందే.

క్రియాశీల రాజకీయాలకు థెరెసా మే గుడ్‌బై

లండన్: బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి థెరెసా మే(67) క్రియాశీల రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని శుక్రవారం ప్రకటించారు. అయితే, ప్రస్తుత ప్రధాని రిషి సునాక్‌కు తన మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2016-2019 కాలంలో బ్రిటన్ ప్రధానిగా ఉన్న థెరెసా మే హౌస్ ఆఫ్ కామన్స్‌లో 27 ఏళ్లపాటు ఎంపీగా కొనసాగారు. అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీగా 1997 నుంచి ఏడు పర్యాయాలు ఆమె ఎన్నికయ్యారు. మార్గరెట్ థాచర్ తర్వాత బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండో మహిళ థెరెసా మే 'న్యూ ఐరన్ లేడీ'గా పేరు తెచ్చుకున్నారు. 2016 జూన్‌లో రెఫరెండం నేపథ్యంలో కుదిరిన బ్రెగ్జిట్ ఒప్పందం పార్లమెంట్ తిరస్కరించడంతో ఆమె ప్రధాని పదవి నుంచి వైదొలిగారు.

ఐదోసారీ పెళ్లికి సిద్ధమైన మర్డోక్

కాలిఫోర్నియా: మీడియా రంగ దిగ్గజం రూపర్ట్ మర్డోక్‌కు 92 ఏళ్ల వయస్సులో మళ్లీ పెళ్లి కుదిరింది. రష్యాకు చెందిన మాజీ మాలిక్యులర్ బయాలజిస్ట్ ఎలెనా ఝుకోవా(67)ను త్వరలో ఆయన పెళ్లి చేసుకోనున్నారు. జూన్‌లో వీరిద్దరు ఒక్కటవుతారని, ఇప్పటికే ఆహ్వాన పత్రాలు కూడా పంపారని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఆస్ట్రేలియాలో జన్మించిన మర్డోక్‌కు గతేడాది అన్ లెస్లీతో ఎంగేజ్‌మెంట్ అయింది. అనంతరం ఇద్దరూ విడిపోయారు. అప్పటి నుంచి మర్డోక్ ఎలెనాతో డేటింగ్ చేస్తున్నారు. మర్డోక్‌కు ఇది ఆరో ఎంగేజ్‌మెంట్ కాగా, అయిదో పెళ్లి.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం । 9 । మార్చి । 2024


కాడుమల్లేశ్వరస్వామి దర్శనానికి భక్తుల క్యూ

న్యూస్‌రీల్

అడవికి నిప్పు

• 50 ఎకరాలు దగ్ధం

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడులో ఉన్న హుండువినహళ్లి గ్రామానికి సమీపంలో ఉన్న సామాజిక అటవీ ప్రాంతంలో ఆకస్మికంగా మంటలు చెలరేగి 50 ఎకరాల అటవీ ప్రాంతం కాలిపోయింది. మంటలను గుర్తించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. 150 ఎకరాల అటవీ ప్రాంతం ఉండగా దాదాపు 50 ఎకరాలు ఆహుతయ్యాయి. అనేక వన్యప్రాణులు కూడా మృతి చెంది ఉంటాయి.

పోలీసు శాఖలో మహిళా సిబ్బందిని పెంచుతాం



యశవంతపుర: పోలీసుశాఖలో 25శాతం మహిళా అధికారులు, సిబ్బంది ఉండాలనే లక్ష్యంతో వచ్చే రోజుల్లో మహిళ సిబ్బంది నియమాకాలను నిర్వహిస్తామని బెంగళూరు నగర పోలీసు కమిషనర్ బీ దయానంద తెలిపారు. ప్రపంచ మహిళ దినోత్సవంలో భాగంగా మైసూరు రోడ్డులోని నగర రిజర్వు కేంద్ర మైదానంలో విశేషంగా మహిళా అధికారులు, సిబ్బంది నిర్వహించిన కవాతుకు గౌరవవందనం స్వీకరించిన అనంతరం మాట్లాడారు. పోలీసు శాఖలో 8 శాతం మంది మాత్రమే మహిళా అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఈ వీరి సంఖ్యను 25శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు హోంమంత్రి కూడా సమ్మతించారన్నారు. బెంగళూరు ట్రాఫిక్ విభాగంలో మహిళా సిబ్బంది పాత్ర అమోఘమని కొనియాడారు.

వాహన రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు

యశవంతపుర: కొత్తగా రిజిస్టర్ కానున్న వాహనాలపై 3 శాతం అధికంగా సెస్‌ను విధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.25 లక్షలకు అధికంగా ఉన్న విద్యుత్ వాహనాలపై విధించే లైఫ్‌ట్యాక్స్‌ను పెంచనుంది. రాష్ట్రంలో ఇకపై రవాణా, వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులు పెరుగనున్నాయి. కర్ణాటక మోటారు వాహనాల పన్నుల సవరణ చట్టం 2024 మార్చి 6న గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఆమోదించారు.

చెరువులో తల్లీ కుమారుడి మృతదేహాలు


గీత, యశ్వంత్ మృతదేహాలు

శ్రీనివాసపురం: అనుమానాస్పద స్థితిలో తల్లీకుమారుడు చెరువులో శవాలై తేలారు. ఘటన శుక్రవారం తాలూకాలోని కోడిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన తల్లీ కొడుకులు గీత(26), యశ్వంత్(6)లు కోడిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో వారిద్దరూ చెరువు వద్దకు వెళ్లి అనంతరం నీటిలో శవాలై తేలారు.గౌనిపల్లి పోలీసులు వచ్చి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. వీరు కాలు జారి నీటిలో పడి మృతి చెందారా? లేక కుమారుడితో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడిందా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

లోకాయుక్త వలలో ఏఈ, లైన్‌మెన్


హరీష్


గుండప్ప

మైసూరు : వాణిజ్య భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లంచం తీసుకుంటూ చాముండేశ్వరి విద్యుత్ సరఫరా కార్పొరేషన్ (సెస్క్) కువెంపు నగర ఉప విభాగం సరస్వతీపురం ఏఈ జీ.జీ.హరీష్ లోకాయుక్త అధికారులకు పట్టుబడ్డాడు. అతనికి సహకరించిన లైన్‌మెన్ గుండప్పను అరెస్ట్ చేశారు. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అభిషేక్ అనే వ్యక్తి వాణిజ్య కట్టడానికి 2కేవీ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశాడు. కనెక్షన్ మంజూరు చేయాలంటే రూ.10వేలు ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు లోకాయుక్తను ఆశ్రయించాడు. పథకం ప్రకారం నగదు ఇస్తుండగా అధికారులు దాడి చేసి ఏఈతోపాటు లైన్‌మెన్‌ను అరెస్ట్ చేశారు.

శంభో.. శివశంభో


శివలింగానికి విదేశీయురాలి పూజలు


బెంగళూరు జేపీ నగర్‌లో కాశీవిశ్వనాథ స్వామికి పుష్పార్చన


యశవంతపుర గాయత్రి ఆలయంలో శివలింగాలకు పూజలు

• శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
• భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

బనశంకరి: శంకరుడు లింగ రూపం దాల్చిన మహాశివరాత్రి పర్వదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ధర్మస్థల, మురుడేశ్వర, కోటిలింగాలు, మలైమహదేశ్వర, కాశీవిశ్వనాథేశ్వర, నంజుండేశ్వర, బెంగళూరు కాడుమల్లేశ్వర, గవిగంగాధరేశ్వర, హలసూరు సోమనాథేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయాల్లో వేకువ జామునుంచే విశేష పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు జరిగాయి. పరమశివుడిని దర్శించుకుని బిల్వపత్రంతో అభిషేకం నిర్వహించారు. ఆలయాల వద్ద శివరాత్రి జాగరణ నిమిత్తం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, నృత్య నాటకాలు, యక్షగానం చేపట్టారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


బెంగళూరు మురుగేశపాళ్యలో శివుడి విగ్రహం వద్ద భక్తుల సందడి

రుణభారం.. రైతన్నలకు గడ్డుకాలం

• రాష్ట్రంలో 10 నెలల్లో 692 మంది ఆత్మహత్య
• హావేరి జిల్లాలో అత్యధికంగా 86 మంది బలవన్మరణం
• ఉసురు తీస్తున్న కరవు కాటకాలు, అప్పులు



బనశంకరి: నిరంతరం చమటోడ్చి దేశ ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతలకు అన్నీ కష్టాలే. విత్తనం వేసినప్పటినుంచి పంట చేతికందేవరకు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాడు. కరువు కాటకాలు.. మరో వైపు గిట్టుబాటు లేని ధరలు, పంటలకు సోకే చీడపీడలు, అప్పుల భారంతో రైతులు చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో 10 నెలల వ్యవధిలో 692 మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టారు. ఈ విషయం రెవెన్యూశాఖ వివరాలతో బహిర్గతమైంది. బెంగళూరు నగరం మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. హావేరి, బెళగావి, చిక్కమగళూరు జిల్లాల్లో రైతుల ఆత్మఘోష మిన్నంటుతోంది. ఒక్క హావేరి జిల్లాలో 86 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రోజుకు సరాసరి 4 మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో రాష్ట్రంలో 223 తాలూకాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేక విత్తనాలు వేసిన అన్ని పంటలు ఎండిపోయాయి. రైతులు వ్యవసాయానికి చేసిన రుణాలు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

రూ.17,534 కోట్లు రుణాలు..

రైతులు వ్యవసాయ కార్యకలాపాలకోసం సొసైటీలు, ప్రైవేటు వ్యక్తులు, వాణిజ్యబ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. 2024 జనవరి 31 వరకు రాష్ట్రంలో 22.59 లక్షలమంది రైతులు సొసైటీలనుంచి రూ.17,534 కోట్లు రుణాలు చేశారు. 2023 డిసెంబరు 31 వరకు 8.5 లక్షలమంది రైతులు రూ.17,424 కోట్లు జాతీయ బ్యాంకులనుంచి రుణాలు తీసుకున్నారు. కేవలం 238 మంది రైతులు మాత్రమే సొసైటీలు నుంచి తీసుకున్న రూ.3.07కోట్లు రుణాలు మాత్రమే చెల్లించారని రెవిన్యూశాఖ అధికారులు తెలిపారు. అంతేగాక కొందరు రైతులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు చేయడంతో వీరు రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

వ్యవసాయ రుణాలు, కరువుతో ఆత్మహత్య..

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యకు వ్యవసాయ రుణాలు, కరువు ప్రధాన కారణమని రెవెన్యూశాఖ అధికారులు గుర్తించారు. రుణాలు చేసి విత్తనాలు చేసి పంటలు రాకపోవడంతో నష్టాలు తలెత్తి దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

రైతుల ఆత్మహత్యల వివరాలు	
ఏడాది	ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతలు
2020-21	855 మంది
2021-22	917
2022-23	310
2023-24	692

ఆత్మహత్యల నియంత్రణకు చర్యలు

అప్పుల బాధతో మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందిస్తుంది. మృతుడి భార్య నెలకు రూ.2 వేల పింఛన్ అందిస్తున్నాం. రైతుల ఆత్మహత్య నియంత్రణకు వ్యవసాయశాఖ అనేక పథకాలు అమల్లోకి తీసుకువచ్చింది.

డాక్టర్ జీటీ పుత్ర, వ్యవసాయశాఖ డైరెక్టర్

10 నెలల్లో...

పది నెలల్లో హావేరి జిల్లాలో 86మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు, బెళగావి 75, చిక్కమగళూరు 64, మండ్య 14, బాగల్‌కోటి 11, మైసూరు 30, కలబురిగి 16, తుమకూరు 12, బీదర్ 12, యాదగిరి 16, హాసన 17, విజయనగర 18, విజయపుర 25, ధారవాడ 29, శివమొగ్గలో 32 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

సరిలేరు మాకెవ్వరు


రైలుకు పచ్చజెండా ఊపుతున్న మహిళా అధికారులు

• రైలు విధి నిర్వహణలో అందరూ మహిళలే !


రాణి ఎక్స్‌ప్రెస్‌లో లోకో పైలెట్

మైసూరు: పురుషులతో దీటుగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ సరిలేరు మాకెవ్వరూ అంటూ నిరూపిస్తున్నారు మహిళలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మైసూరు నైరుతి రైల్వే మైసూరు విభాగం మైసూరు-బెంగళూరు మధ్య నడిచే రాణి ఎక్స్‌ప్రెస్ రైలులో తొలిసారిగా అందరూ మహిళలతోనే రైలు నడిపించారు. మహిళా లోకో పైలెట్ శ్రీషా, సహాయ లోకో పైలెట్ సోనా, గార్డులు, టీసీలు అందరూ మహిళలే రైలును నడిపించారు. అంతకు ముందు వారికి రైల్వే మేనేజర్ ప్రియా దర్శిని సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం జెండా ఊపడంతో రైలు ముందుకు కదిలింది.


భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ శుక్రవారం ఇస్రో ప్రయోగ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి శాస్త్రవేత్తలు ఉపరాష్ట్రపతికి వివరిస్తున్న దృశ్యం. చిత్రంలో గవర్నర్ థావర్ చంద్ ఉన్నారు

బాంబు పేలుడుకు బళ్లారిలో కుట్ర?

సాక్షి బళ్లారి: ఇటీవల రామేశ్వర కెఫేలో జరిగిన బాంబు పేలుడుకు సంబంధించి బళ్లారిలో కుట్ర జరిపి బెంగళూరులో పేలుడు జరిపారనే అనుమానం రావడంతో ఆ దిశగా సంబంధిత అధికారులు బళ్లారిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల నుంచి ఎన్‌ఐఏ బృందాలు బళ్లారికి వచ్చి సెంట్రల్ జైలులో కూడా విచారణ చేసినట్లు సమాచారం. అనుమానాస్పద ఉగ్రవాదిగా గుర్తింపు పొందిన ఇంట్లో సోదాలు జరిపినప్పుడు దొరికిన రసాయనిక పదార్థాలు, బెంగళూరులో పేలుడు జరిగిన ప్రాంతంలో దొరికిన రసాయన పదార్థాలు ఒకటేనని గుర్తించిన అధికారులు ఆ దిశగా బళ్లారిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. బెంగళూరులో పేలుడు జరిగిన తర్వాత నిందితుడు బళ్లారికి వచ్చినట్లు అనుమానం రావడంతో పోలీసులు కూడా ఆ దిశగా తనిఖీలు చేయడం కలకలం రేపుతోంది. ఎన్‌ఐఏ అధికారులు గురువారం రాత్రి వరకు తనిఖీలు చేసి శుక్రవారం ఉదయం కూడా పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. బెంగళూరులో పేలుడు ఘటనకు బళ్లారిలోనే కుట్ర చేశారని వార్తలు రావడంతో నగరంలో చర్చనీయాంశంగా మారింది. బాంబర్ కు సాయం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన ఎన్‌ఐఏ అధికారులు

అదుపులో ఐదుమంది వ్యక్తులు..

బనశంకరి: రామేశ్వరం కెఫేలో బాంబు పేలుడుకు కారణమైన నిందితుడికి బెంగళూరు నగర చెందిన వ్యక్తులు సహాయం చేసినట్లు ఎన్‌ఐఏ అధికారులు గుర్తించారు. నిందితుడు బెళ్లందూరు వద్ద ఓ వ్యక్తిని కలిసినట్లు అందిన పక్కా సమాచారంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. ఇతను అందించిన సమాచారం ఆధారంగా ఐదుమందికి పైగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. వీరంతా బాంబర్‌కు స్థల సమాచారం అందించి అతడితో సంప్రదింపులు జరిపారు. బాంబు పేలుడు అనంతరం నిందితుడు బెంగళూరు నుంచి బళ్లారికి వెళ్లి అక్కడ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలకు నిలయమైన ఉత్తరకన్నడ జిల్లా భట్కళకు వెళ్లినట్లు సమాచారం అందింది. పోలీసులు దీని ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. బళ్లారిలో గత ఏడాది అరెస్ట్ అయ్యి పరప్పన అగ్రహార జైలులో ఉన్న అనుమానిత ఉగ్రవాది మినాజ్ అలియాస్ సులేమాన్‌ను ఎన్‌ఐఏ దర్యాప్తుబందం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిహాదీ సంస్థలు, ఖలీఫత్, ఐసీస్ సంస్థలతో సంబంధలు కలిగిన ఆరోపణలపై సులేమాన్ పరప్పన అగ్రహార జైలుకు పంపారు. బాడీవారెంట్ తీసుకుని తీవ్ర విచారణ చేపట్టారు.


పేలుడు జరిగిన రామేశ్వరం కెఫే వద్ద పోలీసు అధికారులు, స్థానికులు (ఫైల్)

రామేశ్వరం కెఫే పునః ప్రారంభం

బనశంకరి: బెంగళూరు కుందనహళ్లిలోని రామేశ్వరం కెఫే శుక్రవారం పునః ప్రారంభమైంది. ఈనెల 1న కెఫేలో గుర్తు తెలియని వ్యక్తి టైమర్‌తో బాంబు పేల్చినప్పటి నుంచి కెఫే మూతపడిన విషయం తెలిసిందే. ఘటనలో మహిళతో పాటు 9 మంది గాయపడ్డారు. క్షతగాత్రులందరూ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇళ్లకు వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా కెఫేను పునః ప్రారంభిస్తామని యాజమాన్యం గతంలోనే ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం నిర్వాహకులు పోలీసు భద్రత మధ్య ప్రత్యేక పూజలు చేపట్టి కెఫేను పునఃప్రారంభించారు. కెఫే వద్ద అమర్చిన పోలీస్ బారికేడ్లు తొలగించారు. ముందుజాగ్రత్తగా కెఫే ప్రవేశద్వారం వద్ద రెండు మెటల్‌డిటెక్టర్లు అమర్చారు. శనివారం నుంచి కెఫేకు వచ్చే వినియోగదారులను హ్యాండ్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేసి లోపలకు అనుమతిస్తారు.



రామేశ్వరం కెఫే వద్ద జన సందడి

లోక్‌సభకు 14 మంది కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు ఖరారు?

దొడ్డబళ్లాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుండి పోటీలో దింపేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఎట్టకేలకు మొదటి విడతగా 14 మంది పేర్లను ఫైనల్ చేసినట్టు తెలిసింది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె ఈసారి పోటీ చేయరాదని నిర్ణయించుకున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే ఖర్గెను ఎలాగైనా పోటీ చేయించేందుకు డీకే శివకుమార్ గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. తన రాజ్యసభ అధికార అవధి ఇంకా నాలుగేళ్లు ఉన్నందున ఎన్నికల నేపథ్యంలో పార్టీపరంగా ప్రచారం చేయడానికి సమయం చాలదని ఎన్నికల్లో పోటీ చేయరాదని నిర్ణయించుకున్నట్టు ఖర్గె చెబుతున్నారు. అదేవిధంగా సోనియా గాంధీ కూడా ఈసారి ఎన్నికల్లో పోటీ నుండి తప్పుకుంటున్నట్టు తెలిసింది. ఖర్గె నామినేషన్ వేసి పోటీ చేస్తే చాలని, తామే ప్రచారం చేసి గెలిపిస్తామని చెప్పి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఖర్గె మనసు మార్చడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

కొంతమంది సిట్టింగ్ ఎంపీలకు టికెట్లు దక్కకపోవచ్చు : అశోక్

దొడ్డబళ్లాపురం: ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కొందరు బీజేపీ ఎంపీలకు టిక్కెట్లు దక్కకపోవచ్చని ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ సూచన ప్రాయంగా వెల్లడించారు. శుక్రవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన రెండు రోజులపాటు ఢిల్లీలో సమావేశం జరిగిందని, రాష్ట్ర కోర్ కమిటీ పంపించిన జాబితాపై సుదీర్ఘంగా చర్చ జరిగిందన్నారు. వయసు, అనారోగ్యం కారణంగా కొందరు ఎంపీలకు టిక్కెట్లు దక్కకపోవచ్చన్నారు. ఈసారి కొత్త వారికి అవకాశాలు ఇచ్చే చాన్స్ ఎక్కువగా ఉందని, అభ్యర్థుల జాబితా చాలా వరకూ ఒక కొలిక్కి వచ్చిందన్నారు.

డ్రైవర్ లెస్ మెట్రో ట్రయల్స్ షురూ

యశవంతపుర: కొత్తమార్గంలో మెట్రో సంచారం ప్రారంభం కానుండగా సిబ్బంది గురువారం నుంచి సిగ్నలింగ్ పరీక్షలు చేశారు. బీఎంఆర్‌సీఎల్ ప్రతిష్టగా తీసుకున్న డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రయోగాత్మకంగా గురువారం సాయంత్రం నుంచి గ్రీన్ మార్గాలలో ప్రారంభమైంది. ఆర్‌వీ రోడ్డు నుంచి బొమ్మసంద్ర మార్గంలో డ్రైవర్ రహిత రైలు సంచారించింది. 18.82 కిలోమీటర్లు ఉన్న గ్రీన్ మార్గంలో 16 మెట్రో స్టేషన్లు ఉన్నాయి. అన్నీ చోట్ల రైలును నిలపనున్నారు. గురువారం సాయంత్రం 6.55 హెబ్బగోడి డిపో ఐజీఎల్-1 నుంచి సంచారం ప్రారంభమైంది. మొదటి విడత అతివేగంగా ప్రారంభమై 25 కిలోమీటర్లు స్పీడ్ వరకు ట్రయిన్ రన్ అవుతుంది. దీంతో 7.14 నిముషాలకు బొమ్మసంద్ర స్టేషన్‌కు చేరుకుంది. మూడు రోజుల పాటు బీఎంఆర్‌సీఎల్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. 37 పరీక్షలను నిర్వహిస్తారని మెట్రో అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు అనంతరం ప్రయాణికులకు డ్రైవర్ రహిత మెట్రో రైలును అందుబాటులోకి తేనున్నారు.


తాగునీరనుకొని పురుగుల మందు తాగి మృతి

దొడ్డబళ్లాపురం: తాగునీరు అనుకుని పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన చెన్నపట్టణ తాలూకా మైలనాయకనహొసహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. చెన్నపట్టణ నివాసి నవీన్(35) తరచూ తన భార్య స్వగ్రామం మైలనాయకనహొసహళ్లికి వెళ్లివచ్చేవాడు. ఈక్రమంలో గురువారం మామగారింటికి వెళ్లిన నవీన్ తోటకు వెళ్లాడు.అక్కడ బాటిల్‌లో ఉన్న పురుగుల మందును తాగునీరుగా భావించి తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి ఆస్పత్రికి తరలించారు.అయితే చికిత్స పొందుతూ నవీన్ మృతిచెందాడు. ఎంకే దొడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు

మైసూరు : భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భర్తకు నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ మైసూరు 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. మైసూరు నగరంలో ఇమ్రాన్, ఫాతిమా దంపతులు నివాసం ఉండేవారు. అదనపు కట్నం కోసం ఫాతిమాను భర్త వేధించేవాడు. దీంతో ఆమె 2012లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు ఇమ్రాన్‌పై కట్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈకేసు విచారణకు రాగా నిందితుడి నేరం నిరూపితమైంది. దీంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

విద్యాచౌడేశ్వరి మఠం బాల మంజునాథ స్వామీజీ అరెస్ట్


బాల మంజునాథ స్వామీజీ

తుమకూరు : లైంగిక దాడుల ఆరోపణలపై తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా హులియారుదుర్గ సమీపంలో ఉన్న హంగరనహళ్లి శ్రీవిద్యా చౌడేశ్వరి మహా సంస్థాన మఠానికి చెందిన బాల మంజునాథ స్వామీజీని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. చర్మ వ్యాధినుంచి విముక్తి కల్పించే నెపంతో ప్రైవేటు భాగాలను వీడియో తీసి సేవకుడు అభిషేక్‌తో పాటు ఆరు మంది బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తు అభిలాష్ అనే వ్యక్తి ఈ నెల 6వ తేదిన హులియారుదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అభిషేక్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. బాలికపై స్వామీజీ లైంగిక దాడి చేసినట్లు విచారణలో తేలడంతో గురువారం అర్ధరాత్రి అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా

పౌరకార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం కుంబార గుండయ్య, గుడ్డద ఈశ్వర ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, పూజలతో పాటు జిల్లా శాలివాహన కుంబార సంఘం నేతలు సత్యనారాయణ స్వామి, నరసయ్య, బ్రహ్మయ్య తదితరుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం పౌర కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. నగరంలో స్వచ్ఛత కాపాడటంలో పౌరకార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని, వారి సేవలను గుర్తించి సన్మానించడంతో పాటు దుస్తులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్పొరేటర్ కల్పన వెంకట్రామిరెడ్డి, చైతన్య కళాశాల ఎండీ రాధాకృష్ణ, కుంబార సంఘం నాయకులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ




పట్టాలను అందించిన ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్

కంప్లి: ప్రైవేటు వ్యక్తుల మాటలు వింటున్న అధికారులు వారికే కొమ్ము కాస్తున్నారని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హగరిబొమ్మనహళ్లిలో పురసభ పరంగా ఏర్పాటు చేసిన ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో కొంతమంది అధికారులు పేదల ఆస్తులు కబళించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి దుర్మార్గులను 24 గంటల్లో సస్పెండ్ చేయిస్తానని హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరుగుతుంటే వారికి రక్షణ కల్పించాల్సిన అధికారులు తొత్తులుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అలాంటి వారికి నిర్దాక్షిణ్యంగా బుద్ధి చెప్పాలన్నారు.

ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీలపై నిషేధం

శివాజీనగర: రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. 2021 జులై 14న బీజేపీ హయాంలో అప్పటి సీఎం బీఎస్ యడియూరప్ప కర్ణాటక విద్యుత్ చార్జింగ్ బైక్ ట్యాక్సీ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీలు మహిళా ప్రయాణికులు ప్రయాణించేందుకు అనువుగా లేవని, రైడర్లు కొన్ని అసభ్యకరంగా వ్యవహరించినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. కొన్ని కేసులు కూడా నమోదయ్యాయి. కోర్టుల్లో కూడా అర్జీలు దాఖలయ్యాయి. మరో వైపు ప్రైవేటు సంస్థలు యాప్ ఆధారితంగా బైక్ ట్యాక్సీ సేవలు ప్రవేశపెట్టి కర్ణాటక మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలో ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీ విధానంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వటానికి బీఎంటీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీల స్కీమ్‌ను ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం ఈనెల 6న ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టుకు తెలియజేసింది. కాగా ఎలక్ట్రానిక్ బైక్ ట్యాక్సీలతో తమకు గిరాకీ తగ్గి నష్టపోతున్నాయని అప్పట్లో ఆటో, నాలుగు చక్రాల ట్యాక్సీదారులు గతంలో ఆందోళన నిర్వహించారు.

ఓంకారేశ్వరుడికి పూజలు



స్వామివారిని అలంకరించిన దృశ్యం

బొమ్మనహళ్లి: ఆనేకల్ తాలూకా పంచవటి యోగాశ్రమంలో హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఓంకారేశ్వర మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కోలాటం, లలితా సహస్ర నామం పారాయణం నిర్వహించారు.ఈసందర్భంగా సేవాకర్తలు భగిని, వనితక్క, ఆనంద్, చంద్రశేఖర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహా శివరాత్రిని పురస్కరించుకుని బెంగళూరులోని అతి పురాతనమైన గవిపురం గంగాధరేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతుల నృత్యం అలరించింది.

మార్మోగిన శివనామ స్మరణ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు



కోలారు: అంతరగంగ కాశీ విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు



రాయచూరులో అలంకరణలో చంద్రమౌళేశ్వరుడు



మాలూరు: ప్రత్యేక అలంకరణలో శంకరనారాయణస్వామి



శ్రీనివాసపురం: ప్రత్యేక అలంకరణలో ప్రసన్న సోమేశ్వరస్వామి



బళ్లారి: అమరేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి విశేష అలంకరణ దృశ్యం

సాక్షి,బళ్లారి: పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు, సాక్షాత్తు శివుడు లింగాకారంలో అవతరించిన రోజుగా చెప్పబడుతున్న శివరాత్రి రోజున భక్తులు శివనామస్మరణతో గడిపారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని కోట మల్లేశ్వర ఆలయం, నగరేశ్వర ఆలయం, నీలకంఠేశ్వర ఆలయం, కాశీ విశ్వేశ్వర ఆలయం, సంగమేశ్వర ఆలయం, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, నగర శివారల్లోని కప్పగల్ రోడ్డులోని అమరేశ్వర స్వామి ఆలయంతో పాటు బాలాజీ నగర్‌లో నూతనంగా వెలసిన శివాలయంలోని స్పటిక లింగానికి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరి శివుడిని దర్శించుకున్నారు. శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలతో శివుడికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. శివాలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించడంతో నూతన కాంతులతో శివాలయాలు దేదీప్యమానంగా కనిపించాయి. శివభక్తులు ఓంనమఃశివాయ అనే నామస్మరణతో జాగరణ చేస్తూ భక్తిని చాటుకున్నారు. కొందరు ఉపవాసంతో శివాలయాల్లో పూజలు చేసి జాగరణ చేశారు. ప్రతి ఒక్కశివాలయాల్లో ఉపవాసం ఉన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు కూడా ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యం కల్పించారు. అలాగే ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సాక్షాత్తు శివుడు లింగాకారంలో అవతరించారని పురాణాలు ఘోషిస్తున్న హంపీలోని విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో చేరి పూజలు చేశారు. బళ్లారి జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో ఓంనమఃశివాయ అనే శివనామస్మరణతో మార్మోగిపోయాయి. శివమాల ధరించిన భక్తులు శివాలయాల్లో ప్రత్యేక భజనలు, పూజలు చేసి శివభక్తిని చాటుకున్నారు. శివాలయాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

జిల్లాలో సర్వం శివమయం

రాయచూరు రూరల్: జిల్లాలో శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణతో మారుమోగాయి. పట్టణంలోని మహాబళేశ్వర చౌక్‌లో చంద్రమౌళేశ్వర ఆలయం వద్ద రాత్రి 12 గంటల నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. నగరేశ్వర, వీరభద్రేశ్వర దేవస్థానం, ఐబీ రోడ్డులోని నందీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో భక్తులు పూజలు జరిపారు. వివిధ శివాలయాల్లో శివస్తోత్రం, కుంభాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శివాలయాలతో పాటు రామ మందిరం, హనుమాన్ మందిరం, రాజమాత ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలన్ని అలంకరించారు.

శివాలయాల్లో భక్తుల సందడి

కోలారు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకం తదితరాలు జరిగాయి. నగరంలోని ప్రసిద్ధ సోమేశ్వరాలయంలో ఉదయం 6 గంటలకే సోమేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. ఆలయంలోని నంది విగ్రహం ముందు మహిళలు నిమ్మకాయలతో దీపాలను వెలిగించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. పురాణ ప్రసిద్ధ అంతరగంగ కాశీవిశ్వనాథ స్వామి ఆలయం, జలకంఠేశ్వరస్వామి ఆలయం, దొడ్డపేటలోని నంజుడేశ్వరస్వామి ఆలయం, కాళమ్మ గుడి వీధిలోని కాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయంతో పాటు ముళబాగిలు తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఆవని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అంతరగంగ కాశీ విశ్వనాథస్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి తరలి వెళ్లారు. వక్కలేరి సమీపంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సోమేశ్వరస్వామి ఆలయంలోని నంది విగ్రహం ముందు మహిళా భక్తులు నిమ్మకాయలతో దీపాలను వెలిగించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

కోటిలింగాల క్షేత్రం భక్తులతో కిటకిట

కేజీఎఫ్: మహాశివరాత్రి పర్వదినాన తాలూకాలోని కోటిలింగేశ్వర ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. క్షేత్రంలోని 108 అడుగుల శివ లింగాన్ని దర్శనం చేసుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం ఆరు గంటలకే భక్తులు ఆలయంలో దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంజునాథ రథోత్సవం, బృహత్ శివలింగానికి పాలతో అభిషేకం, హోమం, హవనం, నిర్వహించారు. ప్రత్యేక పూలతో అలంకరించారు. రాత్రి జాగరణ సందర్భంగా భజన, హరికథ, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి తెలిపింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కేహెచ్ మునియప్ప, ఎమ్మెల్యే రూపా శశిధర్ కోటిలింగ క్షేత్రానికి చేరుకుని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు

మాలూరు: పట్టణంలోని దొడ్డపేటలో శంకరనారాయణస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అభిషేకం, హోమం, హవనం, వేద మంత్ర పారాయణం తదితర పూజలను చేశారు. తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి ఆచరణ

శ్రీనివాసపురం: శివరాత్రి పండుగను శుక్రవారం ముళబాగిలు నగరంతో పాటు తాలూకాలోని వివిధ శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నగరంలోని ప్రసన్న సోమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గణేశ్‌పాళ్యలోని శివాలయం, శివకేశవ నగర్‌లోని ఉద్భవశివలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి శివుడి దర్శనం చేసుకున్నారు. పురాణ ప్రసిద్ధ ఆవణి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి వేళలో పలు ఆలయాల్లో జాగరణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



బళ్లారి: శివాలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



కోలారులో సోమేశ్వరాలయం ముందు బారులు తీరిన భక్తులు



కేజీఎఫ్: 108 అడుగుల శివలింగాన్ని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు



రాయచూరులో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



కేజీఎఫ్: కోటిలింగాల క్షేత్రంలో భక్తుల సందడి

నీరు లేదు మహాప్రభో!

- రోడ్డుపై మాజీ డిప్యూటీ మేయర్ రీల్స్ చేసి నిరసన



వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: వేసవి ప్రారంభంలోనే ఉద్యాన నగరిలో ఎప్పుడూ లేనంతగా తాగునీటి సమస్య ఏర్పడింది. శుక్రవారం మహిళా దినోత్సవం, శివరాత్రి వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో బొమ్మనహళ్లి పరిధిలోని ప్రజలకు కనీసం తాగడానికి కూడా నీరు లేదని మాజీ డిప్యూటీ మేయర్ రామ్మోహన్ రాజు శుక్రవారం మహిళలతో కలిసి వినూత్న నిరసన చేపట్టారు. తమ వార్డు పరిధిలో నీరు లేక మహిళలు ట్యాంకర్ కోసం వేచి ఉన్నట్లు... రామ్మోహన్ రాజు తెల్లటి పంచె కట్టుకుని కళ్లకు నల్లటి అద్దాలు పెట్టుకుని అక్కడికి వచ్చి నీరు మొత్తం తమిళనాడుకు వెళ్లిపోయిందని రీల్స్ చేసి సందడి చేశారు. ఇదే సమయంలో మహిళలు సైతం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆ అవ్వది కొండంత సంకల్పం



కొండపైకి కాలినడకన వెళ్తున్న 102 సంవత్సరాల వయసున్న పార్వతమ్మ

మైసూరు : వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని, నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావాలనే సంకల్పం ఓ వృద్ధురాలిని కొండెక్కించింది. సుమారు 102 సంవత్సరాల వయసున్న తుమకూరు జిల్లా తిపటూరుకు చెందిన పార్వతమ్మ అనే వృద్ధురాలు ఊతకర్ర సాయంతో చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలె మహదేశ్వర కొండపైకి పాదయాత్ర చేపట్టింది. 18కిలోమీటర్ల నడిచి కొండపైకి చేరుకొని స్వామివారిని దర్శించుకుంది. కొందరు వ్యక్తులు ఆ అవ్వ సంకల్పాన్ని తెలుసుకొని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.



శివలింగాలకు పూజలు చేస్తున్న దృశ్యం

శివోహం ..!

- రాచనగరి శైవక్షేత్రాల్లో విశేష పూజలు



త్రినేశ్వరుడికి బంగారు ముఖం అలంకరణ

మైసూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మైసూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని మైసూరు ప్యాలెస్ ఆవరణంలోని త్రినేశ్వర స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అంతకు ముందు స్వామి వారికి స్వర్ణ ముఖం అలంకరించి క్షీరాభిషేకం చేశారు. ఇక నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలు, స్వామి వారికి అలంకరణ చేశారు.

కోలారు వార్తలు...

పోటీపై హైకమాండ్‌దే తుది నిర్ణయం



మాట్లాడుతున్న కేహెచ్ మునియప్ప

కోలారు: లోక్‌సభ ఎన్నికల్లో కోలారు నుంచి తాను పోటీ చేయడంపై పార్టీ అధిష్టానం తీర్మానానికి కట్టుబడి ఉంటానని రాష్ట్ర మంత్రి కెహెచ్ మునియప్ప తెలిపారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయించినా అభ్యర్థి విజయం కోసం అందరం కలిసికట్టుగా ఉండి పని చేస్తామన్నారు. పార్టీ అభ్యర్థి టికెట్ విషయంపై కోలారు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన కేహెచ్ మునియప్ప ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనన్నారు. టికెట్ ఇచ్చే అధికారం తమకు లేదని, అది పార్టీ అధిష్టానం చేతిలో ఉంటుందన్నారు. కేంద్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఘనంగా మునియప్ప పుట్టినరోజు వేడుక

కేహెచ్ మునియప్ప 76వ పుట్టిన రోజు వేడుకను ఆయన అభిమానులు శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజును పురస్కరించుకుని మునియప్ప చర్చి, మసీదు, ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎస్ఎన్ఆర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంచారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన అభిమానులు ఉదయం కేక్‌ను కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే జరిమానా

శివాజీనగర: వర్షాల కొరతతో రాష్ట్రంలో కరువు పరిస్థితి నెలకొంది. బెంగళూరులో కూడా నీటి సమస్య తలెత్తింది. దీంతో బెంగళూరు నీటి సరఫరా, శానిటరీ బోర్డు పలు చర్యలు చేపట్టింది. బెంగళూరు నగరంలో తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించటాన్ని నిషేధించింది. వాహనాల శుభ్రతకు, భవన నిర్మాణాలకు, తోటలకు, మనోరంజక కార్యక్రమాలకు తాగునీటిని వినియోగిస్తే రూ.5 వేలు జరిమానా విధిస్తామని బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఉల్లంఘన పునరావృతమైతే జరిమానా మొత్తంలో రూ.5 వేలతో పాటు అదనంగా రూ.500 ప్రతి రోజు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఎవరైనా నియమాలు ఉల్లంఘించినట్లు కనిపిస్తే మండలి కాల్ సెంటర్ 1916కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది.

మేం బీజేపీని వీడబోం

- సోమశేఖర్, శివరాం తీరు బాగోలేదు
- ఎమ్మెల్యే భైరతి బసవరాజు వ్యాఖ్యలు



మాట్లాడుతున్న భైరతి బసవరాజు

సాక్షి,బళ్లారి: ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ఎస్.టీ సోమశేఖర్, శివరామ హెబ్బార్ నడుచుకున్న తీరు బాగా లేదని, వారిద్దరు పరిస్థితులకు తగ్గట్టుగా నడుచుకున్నారనడం సరికాదని, తాను కూడా వారిద్దరితో మాట్లాడానని ఎమ్మెల్యే భైరతి బసవరాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం దావణగెరెలో విలేకరులతో మాట్లాడారు. అయితే తాను కాని, ఎమ్మెల్యే మునిరత్నం కాని ఎట్టి పరిస్థితుల్లోను బీజేపీని వీడే ప్రశ్నే లేదన్నారు. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. అధికారం వస్తుంది, పోతుంది, విలువలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాము బీజేపీ సిద్ధాంతాలను మెచ్చి పార్టీలోకి వచ్చామన్నారు. మళ్లీ పార్టీని ఎందుకు వీడుతామని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎక్కడికి వెళతారో కాలమే సమాధానం చెబుతుందన్నారు. ప్రస్తుతం తమ ముందున్న ఏకైక లక్ష్యం 28 స్థానాల్లో గెలుపొందాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నామన్నారు. ఎంపీ ఎన్నికల అనంతరం గ్యారెంటీలు ఎక్కడ ఉంటాయో వారికే తెలియదన్నారు. ఈ పరిస్థితుల్లో కాలమే సమాధానం చెబుతుందని కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. నాలుగేళ్ల తర్వాత తమ పార్టీ సొంతంగా అధికారంలోకి వస్తుందని, అంతవరకు ఎలాంటి రాజకీయాలు మారినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నారు.

గ్యారెంటీల ప్రదర్శనకు శ్రీకారం



పథకాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కోలారు: నగరంలోని బస్టాండు వద్ద రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాల ప్రదర్శనను ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పంచ గ్యారెంటీ పథకాలైన గృహలక్ష్మి, శక్తి, యువనిధి, గృహజ్యోతి, అన్నభాగ్య పథకాల సమాచార ప్రదర్శనను ఈనెల 10వ తేదీ వరకు కొనసాగిస్తారన్నారు. ప్రజలు గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అనిల్ కుమార్, సమాచార శాఖ అధికారి బీవీ చేతన్ కుమార్, పీ.కౌసల్య, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, కేఎస్ఆర్టీసీ కోలారు డివిజనల్ కంట్రోలర్ బసవరాజు, డిపో మేనేజర్ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, బైక్ ఢీ..ఇద్దరి దుర్మరణం



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

కోలారు: టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన తాలూకాలోని చిక్కకుంతూరు వద్ద గురువారం జరిగింది. మిట్టగానహళ్లికి చెందిన సందీప్, సుమన్ ప్రమాదంలో మరణించిన యువకులు. గ్రామానికి వెళుతుండగా టిప్పర్ ఢీకొని వీరిద్దరు మరణించారు. కాగా టేకల్ ఫిర్కాలో జల్లిక్రషర్లు ఎక్కువై టిప్పర్లు అధికంగా తిరుగుతుండడమే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టిప్పర్లు ఇష్టారాజ్యంగా తిరుగుతుండటంతో నిత్యం ప్రమాదాలు అధికం అవుతున్నాయని హెచ్చరించారు. టిప్పర్ల సంచారానికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల వద్దకు వచ్చిన ఎమ్మెల్యే కేవై నంజేగౌడ వారిని శాంతపరిచే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలకు అంత్యక్రియలు జరిపారు. ఘటనా స్థలంలో తహసీల్దార్ కె రమేష్, మాస్తి సీఐ రామప్ప గుత్తేదార్, ఇన్‌స్పెక్టర్ వసంత్‌లు ఉన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న వస్తు ప్రదర్శన



తుమకూరు: తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠంలో ఆరాధ్యదైవం శ్రీ సిద్దలింగేశ్వర జాతర మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కృషి, పారిశ్రామిక, వస్తు ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక ప్రభుత్వ ఆధ్వర్యంలో సబ్సిడీ పథకంలో ఇచ్చే యంత్రాల వివరాలకు సంబంధించి స్టాళ్లలో సమాచారం ఏర్పాటు చేశారు. లింగైక్య శ్రీ శివకుమారస్వామి నాడు ప్రారంభించిన వస్తు ప్రదర్శన కొన్నేళ్లుగా ప్రతి ఏడాది కొనసాగిస్తున్నారు.

మైషుగర్ ఫ్యాక్టరీనే పునరుద్ధరించాలి

దొడ్డబళ్లాపురం: మండ్యలో నూతనంగా మైషుగర్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎంపీ సుమలత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్‌లో ఒక పోస్టు చేసారు. కొత్తగా షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి బదులు ఉన్న మైషుగర్ ఫ్యాక్టరీనే పునరుద్ధరించి బలపరచాలని కోరారు. కొత్త ఫ్యాక్టరీ నిర్మించి అదే ఆవరణలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రభుత్వం నిర్ణయాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. అవసరమైతే మై షుగర్ ఫ్యాక్టరీ ఆస్తి విక్రయిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఐటీ హబ్ మైషుగర్ ఆవరణలో ఏర్పాటు చేయడానికి తాను అనుమతించనని తేల్చి చెప్పారు. ఇప్పటి వరకూ మై షుగర్ ఫ్యాక్టరీకి వచ్చిన నిధులు ఏమయ్యాయో చెప్పడం లేదని, ప్రభుత్వం నిర్ణయాలు పలు అనుమానాలు కలిగిస్తున్నాయన్నారు.

మంత్రికి శివరాత్రి శుభాకాంక్షలు



మంత్రిని సత్కరిస్తున్న కర్ణాటక రెడ్డి జన సంఘం సభ్యులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర ఉత్తర తాలూకాకు చెందిన కర్ణాటక రెడ్డి జన సంఘం సభ్యులు శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, కర్ణాటక రెడ్డి జన సంఘం సీనియర్ నాయకుడు రామలింగా రెడ్డిని కోరమంగలలో ఉన్న మంత్రి కార్యాలయంలో కలిసి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరమ రెడ్డి సముదాయ సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై గంట పాటు చర్చించారు. సంఘం సభ్యులు కృష్ణారెడ్డి, (కిట్టి) మహేష్ రెడ్డి,చంద్రారెడ్డి, చంద్రప్ప పాల్గొన్నారు.

మైనార్టీలకు మరో చేయూత

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మైనార్టీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వరాలు కురిపిస్తోందని ప్రతిపక్షాలు ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నాయి. ఈ విమర్శలకు బలాన్నిచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మైనార్టీల కోసం బంపర్ ఆఫర్ ప్రకటించింది. కేఎస్ఎఫ్‌సీ ద్వారా మైనార్టీ వ్యాపారవేత్తలకు ఆరు శాతం వడ్డీకి రూ.10 కోట్ల వరకూ రుణాలు ఇవ్వడానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ రుణాలు తీసుకుని మైనార్టీ వ్యాపారవేత్తలు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకుని ఆర్థికంగా ఎదగవచ్చు.

భర్తపై కోపంతో పిల్లలకు వేధింపులు

యశవంతపుర: భర్తపై కోపంతో పిల్లలను వేధిస్తున్న భార్యపై జేజే నగర పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు... ఆయిషాబీబీ, ఇమ్రాన్ ఖాన్‌లు భార్యభర్తలు. 2013లో వివాహం చేసుకున్న ఇమ్రాన్‌ఖాన్‌కు ఇద్దరు పిల్లలున్నారు. 2022లో కుటుంబ కలహాలతో దూరంగా జీవిస్తూ కోర్టులో కేసులేసుకున్నారు. పిల్లలిద్దరు ఆయిషా వద్ద ఉండగా ఇమ్రాన్ అప్పుడప్పుడు కలిసి వెళ్లేవాడు. ఇటీవల నుంచి ఆయిషా తన స్నేహితులు సలీం, జబీర్‌ఖాన్‌తో కలిసి పిల్లలను వేధిస్తున్నట్లు ఇమ్రాన్ ఖాన్ జేజే నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన తన ఇద్దరు పిల్లలను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దేశ ఆర్థిక ప్రగతిలో మహిళల పాత్రకీలకం



సంస్థ ఉద్యోగులతో కేక్‌కట్ చేస్తున్న అచ్యుత్‌గౌడ తదితరులు

బనశంకరి: దేశ ఆర్థిక ప్రగతిలో మహిళలు పాత్ర అపారమని పిడిలిటస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అచ్యుత్‌గౌడ తెలిపారు. బనశంకరి రెండోస్టేజ్‌లోని బ్రిగేడ్ సాఫ్ట్‌వేర్ పార్కులో పిడిలిటస్ కార్ప్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రపంచ మహిళా దినోత్సవాన్ని అచ్యుత్‌గౌడ ప్రారంభించి మాట్లాడారు. ఐటీ రంగంలో మహిళలు పాత్ర గణనీయమైనదని తెలిపారు. ఈ సందర్భంగా పిడిలిటస్ కార్ప్స్ సంస్థ మహిళా ఉద్యోగుల మధ్య కేక్ కత్తరించి మహిళా దినోత్సవం ఆచరించారు.

హర హర మహాదేవ

హరహర మహాదేవ..శంభో శంకరా అంటూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా శివనామ స్మరణ ధ్వనించింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శివార్చన అభిషేకాలు, ఉపవాస దీక్షలు, రాత్రంతా జాగారంతో మహా పవిత్రమైన శివరాత్రిని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.

- శివరాత్రి పర్వదినాన మార్మోగిన శివనామ స్మరణ
- ఆలయాల్లో కమనీయంగా పూజలు, అభిషేకాలు



బొమ్మనహళ్లిలో కాశీ విశ్వేశ్వరుడికి అలంకరణ

బొమ్మనహళ్లి: మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని బొమ్మనహళ్లి పరిధిలోని శివాలయాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఇక్కడి మంగమ్మపాళ్యలోని శ్రీకాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు, అలంకరణ చేశారు. వెండి ముఖాన్ని అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

తుమకూరు: తుమకూరు నగరంలోని కుణిగల్ రోడ్డు అమరజ్యోతి నగరలోని శ్రీ సాయిబాబా దేవాలయం ఆవరణంలో ఉన్న శివలింగానికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. తెల్లవారుజాము నుంచే క్యూకట్టారు.

గౌరి వల్లభేశ్వర దేవాలయంలో ...

గౌరిబిదనూరు: నగరంలో అతి పురాతనమైన గౌరీ వల్లభేశ్వరుని దేవాలయంలో శివరాత్రి ప్రయుక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గౌరీ వల్లభేశ్వరునికి క్షీరాభిషేకం చేశారు. శివరాత్రి జాగరణ సందర్భంగా వివిధ పూజలు నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుంటారని ప్రధాన అర్చకులు నాగేంద్ర శర్మ, చంద్రశేఖర శర్మ తెలిపారు.

బసవన్న దేవాలయంలో...

తుమకూరు: తుమకూరు నగరంలోని కుణిగల్ రోడ్డులో ఉన్న మారుతి బనశంకరి, బసవణ్ణ దేవాలయం ఆవరణంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవన్నకు ప్రత్యేక పూజలు, ఆలయం పైభాగంలో ఉన్న శివుడికి పూజలు చేశారు.

నగరంలో శివలింగాల ఊరేగింపు...

తుమకూరు: తుమకూరు నగరంలోని శ్రీ బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల్లో శివలింగాలను ఊరేగించారు. అదే విధంగా నగరంలోని బీహెచ్ రోడ్డు భద్రమ్మ సర్కిల్‌లో వెలసిన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శివలింగాలకు పాలాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

హులిమావులో రుద్రహోమం

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇక్కడి ఆరికెరె వార్డులోని హులిమావులో వెలసిన చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సోమేశ్వర స్వామివారి సన్నిధిలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో రుద్రహోమం, వివిధ ధార్మిక పూజలు చేశారు. బీజీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రకాశనాథ స్వామీజీ, ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి తదితరులు హోమ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ మురళి మాజీ కార్పొరేటర్ పురుషోత్తం, బీజేపీ సీనియర్ నాయకుడు మురళీధర్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆదిచుంచనగిరి మఠంలో...

మండ్య: మండ్య నగరంలో పాత ఎంసీ రోడ్డులో ఉన్న శ్రీ ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠంలో మహా శివరాత్రి సందర్భంగా వేదబ్రహ్మ రాఘవేంద్ర ఉదయం రుద్రహోమం, అభిషేకం, శివస్తోత్రం నిర్వహించారు. మఠాధ్యక్షుడు పురుషోత్తమానంద స్వామీజీ సన్నిధిలో పూజలు జరిగాయి.

మండ్య జిల్లాలో..:

మండ్య: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మండ్య నగరంలోని అర్కేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.

చింతామణిలో..:

చింతామణి: శివరాత్రిని పురస్కరించుకొని తాలూకాలోని వివిధ శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కైవార గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పట్టణంలోని పురాతన నాగనాధేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు.



కైవారంలో శివున్ని దర్శించుకొంటున్న భక్తులు



తుమకూరులో శివలింగాల ఊరేగింపు



మండ్యలో శివుడికి పూజలు



తుమకూరులో శివలింగానికి క్షీరాభిషేకం



బొమ్మనహళ్లి హులిమావులో రుద్రహోమం



మండ్యలో శివాలయంలో పూజలు



పూల అలంకరణలో గౌరి వల్లభేశ్వరుడు


ఆశ్రమంలో శివరాత్రి పూజలు

బనశంకరి: మహా శివరాత్రిని శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. జేపీ.నగర మూడోఫేజ్‌లోని ఆశ్రమంలో వెలసిన మరకత శివలింగానికి శుక్రవారం వేకువజామున ఆలయ అర్చకులు, ఆశ్రమ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తిగీతాలు, విద్యార్థుల భరతనాట్యం, భూకైలాస్ నాటకం భక్తులను రంజింపజేసింది.



మరకత శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆదియోగి విగ్రహం వద్ద భక్తుల రద్దీ



చిక్కబళ్లాపురం: నగరంలోని అన్ని శివాలయాలలో శివరాత్రి సందర్భంగా విశేష పూజలు చేశారు. నగరంలోని మరళసిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా నగర సమీపంలోని ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన బృహత్ ఆదియోగి విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం నుంచి బెంగళూరు, తుమకూరు, చిక్కబళ్లాపురం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇక నంది గ్రామంలోని భోగ నందీశ్వరాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. నగరంలోని వక్కలిగ కళ్యాణ మంటపంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వారు ఐదు అడుగుల శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేసారు.

పెంపు బకాయిలు చెల్లిస్తాం

శివాజీనగర: ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఇస్తున్న విధంగానే 2020 జనవరి 1 నుండి 2023 ఫిబ్రవరి 28 వరకు రిటైర్డ్, సంస్థ నుండి బయటికి వెళ్లిన అందరి ఉద్యోగులకు కూడా 15 శాతం జీతం పెంపు, బకాయి సొమ్మును ఇవ్వటానికి రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ఆమోదించారు. రవాణా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేఎస్ఆర్‌టీసీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల కార్మిక సంఘాల జాయింట్ కార్యచరణ కమిటీతో రామలింగారెడ్డి గురువారం సమావేశమయ్యారు. సుమారు 10 వేల మంది మాజీ ఉద్యోగులకు కూడా 15 శాతం జీతం పెంపు పెండింగ్‌ను చెల్లించనున్నట్లు హామీ ఇస్తూ, ఆదేశాలు జారీ చేయాలని సంస్థ ఎండీకి మంత్రి సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్య

యశవంతపుర: డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బ్యాటరాయనపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. రంగనాథ కాలనీకి చెందిన తేజు (20) బీకామ్ చదువుతోంది. గురువారం రాత్రి 7:30 గంటలకు ఇంటిలో ఎవరూ లేని సమయంలో యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియటం లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

కట్టడంపై నుంచి పడి..

కట్టడం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన తలఘట్టపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. జేపీ నగర 7వ స్టేజ్ రాఘవనగరలో కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నారు. పని చేస్తుండగా రెండో మేడపై నుంచి జారి పడి కార్మికుడు మృతి చెందారు. కార్మికుడి వివరాలు తెలియటంలేదు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

రోడ్డు దాటుతూ వృద్ధురాలు...

మొబైల్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటుతుండగా వృద్ధురాలిని స్కూటర్ ఢీకొంది. ప్రమాదంలో తిగళర పాళ్యకు చెందిన శాంతమ్మ (65) మృతి చెందారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో తిగళర పాళ్యలోని సోల్లపురమ్మ దేవస్థానం వద్ద శాంతమ్మ మొబైల్లో మాట్లాడుతూ రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చి స్కూటర్ ఢీకొంది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మైసూరులో పోలీసుల కవాతు

మైసూరు: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మైసూరు నగరంలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. డీసీపీ ముత్తురాజు నేతృత్వంలో పోలీసులు ప్రధాన వీధుల గుండా మార్చ్ పాస్ట్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు భారీ కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు ధైర్యంగా ఉండటానికి కవాతు నిర్వహించారు.

ఘనంగా అంగాళ పరమేశ్వరి కరగ





అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరణ, పాలకుండలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బొమ్మనహళ్లి: బెంగళూరు దక్షిణ నియోజకవర్గం గొట్టిగెరెలో కొలువైన అంగాళపరమేశ్వరి దేవి 21వ కరగ మహోత్సవం, మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పాలకుండలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

హోసూరు వార్తలు..

కాపర్ వైరు చోరీ

క్రిష్ణగిరి: రాయకోట సమీపంలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు, ఆయిల్‌ను దోచుకెళ్లారు. రాయకోట సమీపంలోని ఏరిచిన్నగానంపట్టి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో చోరీ జరిగినట్లు స్థానికులు విద్యుత్ శాఖాధికార్లకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు సంబంధిత శాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా 150 కిలోల కాపర్ వైరు, 174 లీటర్ల ఆయిల్‌ను దోచుకెళ్లినట్లు, దీని విలువ సుమారు రూ. 1.46 లక్షలకు పైగా ఉంటుందని రాయకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెట్టుబడుల ఆశ చూపి టోకరా

హోసూరు: స్టాక్ మార్కెట్లో తాము చెప్పిన కంపెనీలపై పెట్టుబడులు పెడితే అధిక లాభం అందజేస్తామని చెప్పి క్రిష్ణగిరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు నిలువునా మోసం చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు...క్రిష్ణగిరి సమీపంలోని కందికుప్పం ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ (36) వాట్సాప్‌కు గతనెల 21న ఒక మెసేజ్ వచ్చింది. అనంతరం వారిని సంప్రదించిన చంద్రశేఖర్ వారు సూచించిన ఖాతాలకు రూ. 14.60 లక్షల నగదు జమచేశాడు. అనంతరం ఆ నంబర్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరదలిపై బావ ప్రేమ,

- మనస్తాపంతో భార్య ఆత్మహత్య

క్రిష్ణగిరి: తన భర్త.. మరదలిపై ప్రేమను పెంచుకోవడాన్ని సహించలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బారూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి జిల్లా పాపారపట్టి సమీపంలోని కొట్టావూర్ గ్రామానికి చెందిన కుమరన్. ధర్మపురి జిల్లా ఎర్రపట్టి గ్రామానికి చెందిన సంధ్యతో మూడేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఏడాదిన్నర పాప ఉంది. ఈ నేపథ్యంలో పాపను చూసేందుకు సంధ్య చెల్లి కౌసల్య తరచూ వచ్చి వెళ్లేది. ఈ క్రమంలో బావ, మరదలి మధ్య ప్రేమ చిగురించింది. పలుమార్లు హెచ్చరించిన వారిలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన సంధ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

హోసూరు: సెల్‌ఫోన్ దొంగను హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... హోసూరు కార్పొరేషన్ పరిధిలోని దుర్గానగర్‌కు చెందిన శ్రీనాథ్ (32) రెండు రోజుల క్రితం అతడి మిత్రుడితో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి రూ. 20 వేల విలువ చేసే రెండు సెల్‌ఫోన్‌లు దొంగలించుకెళ్లాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపగా తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని శంకరాపురం గ్రామానికి చెందిన కార్మికుడు సత్య (23) సెల్‌ఫోన్‌లను దొంగలించుకెళ్లినట్లు తెలిసింది. నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేసి సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఎస్ఎల్సీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు

దొడ్డబళ్లాపురం: 2023–2024 విద్యా సంవత్సరంలో మార్చి–25 నుండి ఏప్రిల్ 26 వరకూ జరగనున్న ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖకు చెందిన డీడీ, బీఈఓలకు ఈమేరకు ఆదేశాలు అందాయి. పరీక్షలు జరగడానికి ముందే కెమెరాల పనితనాన్ని అధికారులు స్వయంగా పరిశీలించాల్సి ఉంది. ప్రశ్నపత్రాలు ఇవ్వడం, పరీక్షలు ముగిసాక జవాబు పత్రాలు తీసుకోవడం, వాటిని తరలించడం ప్రతిదీ కెమెరాల కనుసన్నల్లోనే జరగాలి. పరీక్షలు ముగిసాక ఫుటేజీలను బీఈఓ కార్యాలయంలో అందజేయాలి. ఆయా తాలూకాలలో జరిగే అన్ని పరీక్షా కేంద్రాల దృశ్యాల లింక్‌ను డీడీ, బీఈఓలకు పంపించాల్సి ఉంటుంది.

కేంద్రం రాష్ట్రాన్ని ఆదుకోవడం లేదు

- మంత్రి మధు బంగారప్ప

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కరువుతో అల్లాడిపోతున్న రైతులను, ప్రజలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రయత్నం చేస్తోందని, అయితే కేంద్రం మాత్రం ఏ మాత్రం సహాయం చేయడం లేదని మంత్రి మధు బంగారప్ప ఆరోపించారు. బెంగళూరులో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రం నుండి రూ.4.30 లక్షల కోట్ల ఆదాయం తీసుకునే కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపిస్తోందన్నారు. ప్రజలకు తాగునీరు అందించేలా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం నిధులు ఇచ్చి దాహం తీరుస్తోందన్నారు. రైతుల అకౌంట్లలోకి మొదటి విడతగా రూ.2 వేలు జమ చేసామని, కానీ కేంద్రం ఏమీ చేయలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న 26 మంది ఎంపీలు ఏమి చేస్తున్నారని విమర్శించారు.

ఇన్‌స్టా మోసగాడు అరెస్ట్

యశవంతపుర: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న ప్రజల్లో చైతన్యం రావడం లేదు. తాజాగా ఇన్‌స్టాలో పరిచయమైన ఓ వ్యక్తి ఓ మహిళను నిలువునా వంచనకు గురిచేసిన ఘటన నగరంలోని వీవీపురం పరిధిలో జరిగింది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...వీవీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ మహిళ (39)ను ఇన్‌స్టాలో ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. పరిచయం శ్రుతిమించడంతో ఇద్దరు ఏకాంతంగా ఉన్న సమయంలో ఫోటోలు తీసుకున్నారు. అనంతరం ఆ ఫోటోలను చూపించి సదరు నిందితుడు బెదిరించడం మొదలుపెట్టాడు. డబ్బులు డిమాండ్ చేశాడు. ఇలా ఆమె నుంచి రూ. 8 లక్షల నగదుతో పాటు 240 గ్రాముల బంగారు నగలు తీసుకున్నాడు. బెదిరింపులు మానకపోవడంతో బాధిత యువతి వీవీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా ఉంచి నిందితుడు అన్బుగలన్‌ను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



ఎస్.ముధుగానపల్లిలో రథాన్ని లాగుతున్న భక్తులు



శివ నంజుండేశ్వరస్వామి కొండపైకి ఎక్కుతున్న భక్తులు



మదగొండపల్లిలో హరికేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు

హోసూరు, కెలమంగలం: మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచే ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు. హోసూరు తేరుపేటలోని ప్రసిద్ధి పొందిన శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూ కట్టారు. ఈ సందర్భంగా భక్తులకు మహాతపస్వి సేవా సంస్థ ద్వారా అష్టైశ్వర్య అష్టోత్తర స్తోత్రాల బుక్కులను పంచిపెట్టారు. హోసూరు సమీపంలోని ఎస్. ముదుగానపల్లి గ్రామంలో వెలసిన అమృతవల్లి సమేత మల్లికార్జున స్వామి ఆలయ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమృతవల్లి మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి రథంపై అధిష్టించి ఊరేగించారు. ముదుగానపల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగి మొక్కులు తీర్చుకొన్నారు.

కెలమంగలంలో :

డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బేవనత్తం వద్ద దట్టమైన అడవిలో కొండపై కొలువైన శివనంజుండేశ్వరస్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమెగింది. ఈ జాతరకు డెంకణీకోట, తళి, అంచెట్టి, హోసూరు, బాగలూరు, సూళగిరి తదితర ప్రాంతాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం ఆనేకల్, బెంగళూరు తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు జాతరలో పాల్గొని శివనామస్మరణ చేస్తూ కొండెక్కి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు, చల్లని పానీయాలను భక్తులకు అందజేశారు. మదగొండపల్లిలో వెలసిన శ్రీ హరికేశవస్వామి ఆలయంలో ఈ ఏడాది మొట్టమొదటిసారిగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి రథంపై భక్తులచే పురవీధుల్లో రథాన్ని లాగారు. హోసూరు, డెంకణీకోట, తళి, అంచెట్టి, బాగలూరు, బేరికె, సూళగిరి తదితర ప్రాంతాలలోని శివాలయాలలో విశేష పూజలు జరిపించారు.

జల్లికట్టు ఎద్దుకు అంత్యక్రియలు



ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: ఏడేళ్లుగా క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా జరిగే జల్లికట్టు పోటీలలో పాల్గొని పలు బహుమతులందుకొన్న ఎద్దు అనారోగ్యానికి గురై మృతి చెందడంతో యాజమాని ఘనంగా అంత్యక్రియలు చేపట్టారు. వివరాలు... హోసూరు సమీపంలోని కుముదేపల్లి ప్రాంతానికి చెందిన రైతు ప్రకాష్ (36) జల్లికట్టు ఎద్దును పోషిస్తూ వచ్చాడు. క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా జరిగే జల్లికట్టులో ఈ ఎద్దు పలు బహుమతులను అందుకొంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సూళగిరి సమీపంలో జరిగిన జల్లికట్టులో పాల్గొని బహుమతితో ఇంటికొచ్చింది. ఈ సమయంలో అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో యాజమాని పశువైద్యులను రప్పించి చికిత్స చేయించాడు. ఫలితం లేకపోవడంతో మృతి చెందింది. ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించాడు.

విద్యార్థుల చేరికపై చైతన్య కార్యక్రమం



చైతన్య ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

హోసూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేరి్పించడంపై శుక్రవారం చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు తేరుపేటలోని చూడవాడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రాథమిక విద్యాశాఖాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని చైతన్య ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ... బడివయస్సు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాన్ దురై, కార్పొరేటర్ క్రిష్ణవేణి నాగరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాబు.. బిల్లీ..
లక్ష కోట్లు!



▶ మొదటి పేజీ తరువాయి

ఆ కంపెనీకి 45 ఏళ్ల పాటు లీజుకిచ్చేసి... వాటి నిర్వహణ ఛార్జీలను కూడా ప్రభుత్వమే ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారంటే ఏమనుకోవాలి? క్రీడల ద్వారా, వాటి అడ్వర్టయిజ్‌మెంట్లు, స్పాన్సర్‌షిప్‌ల ద్వారా వచ్చే డబ్బులన్నీ ఐఎంజీ అకాడెమీస్‌కే చెందేలా భారీ దోపిడీకి పథకం వెయ్యగలిగారంటే ఆయన విజనరీయే కదా? ఇప్పటి విలువల ప్రకారం చూస్తే ఈ స్కామ్ విలువ లక్ష కోట్లపైనే.

స్పై కెమెరాకు పట్టుబడిన బిల్లీ...

ఈ రాష్ట్ర ప్రజల అదృష్టం బాగుంది కాబట్టే 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి గెలిచారు. బాబు ఓడిపోయారు. వైఎస్సార్ ప్రభుత్వం ఐఎంజీ కేటాయింపుల్ని సమీక్షించినపుడు మొత్తం బోగస్ కంపెనీలేనని తేలటంతో ఒప్పందాన్ని రద్దు చేసి, భూమిని వెనక్కి తీసుకుంది. కానీ బాబు గారి ముఠా ఊరుకోలేదు. తమకు కోర్టుల్లో బలం ఉంది కనక... న్యాయస్థానంలో సవాల్ చేశారు. 2009 ఎన్నికల ముందు... ఈ కేసులో తీర్పు వెలువడవచ్చని బిల్లీరావు భావించారు. ఆ సమయంలో ఆయన సన్నిహితుడొకరు ఆయన్ను కలిసి.. తమ సంభాషణను స్పై కెమెరాతో రికార్డు చేశారు. వ్యవస్థ నిర్ఘాంతపోయే నిజాల్ని అప్పట్లో బిల్లీరావు వెల్లడించారు. వాటిని 'సాక్షి' ప్రచురించింది కూడా. అప్పట్లో అది సంచలనం కావటంతో... తీర్పు వాయిదా పడింది. న్యాయమూర్తులు మారటంతో సుదీర్ఘకాలం కొనసాగింది. తాజాగా గురువారంనాడు బిల్లీరావు తమకే కేటాయించిన భూముల్ని తమకు ఇవ్వాలంటూ వేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. అంతేకాదు... అది మొత్తం వ్యవస్థ నివ్వెరపోయే కుంభకోణమని తేల్చింది. చంద్రబాబు దోపిడీని బయటపెట్టింది. దీనిపై వైఎస్సార్ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించగా... అప్పట్లో ఇన్‌ఛార్జిగా ఉన్న సీబీఐ అధికారి లక్ష్మీనారాయణ... తమకు తగిన సిబ్బంది లేరన్న సాకుతో దాన్ని చేపట్టలేదు. తాజాగా గురువారంనాడు హైకోర్టు ఈ వ్యవహారంపై వ్యాఖ్యానిస్తూ... దీనిపై సీబీఐ విచారణ ఎందుకు జరిపించలేదో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేదంటే తామే ఆదేశిస్తామని కూడా స్పష్టంచేసింది. ఈ అంశంపై సమాధానమివ్వాలంటూ అక్కడి ప్రభుత్వానికి వారం రోజుల గడువునిచ్చింది. నిజానికి అప్పట్లోనే సీబీఐ దర్యాప్తు జరిపి ఉంటే.. ఈ పాటికే బాబు దోపిడీ బయటపడి, చంద్రబాబు జైల్లో ఊచలు లెక్కబెడుతుండే వారని స్పష్టంగా చెప్పొచ్చు.

బాబు... నా జేబులో ఉంటారన్న బిల్లీ

తాజా పరిణామాల నేపథ్యంలో... అప్పట్లో బిల్లీరావు స్పై కెమెరాల సాక్షిగా ఏమన్నారు... బాబు ఎంత ఎంత పెద్ద దోపిడీకి స్కెచ్ వేశారు? వ్యవస్థలో ఎంతమందిని వాడేశారు? వంటి వివరాలు మరొక్కసారి చూద్దాం. ''ఇదిగో తీర్పు ...ఇదే మనకు అనుకూలంగా రాబోతున్న కోర్టు తీర్పు కాపీ. ఈ తీర్పును నేనే రాశాను. నేను ఏది రాస్తే అదే తీర్పుగా వస్తుంది. ఈ విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. --- కు ఎంత డబ్బులు ఇవ్వాలో చంద్రబాబే చెప్పారు. అసలు ఆయనకు ఉన్న జ్ఞాపక శక్తి అలాంటిది. ఆయనే అన్నీ చూస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలేపి అడిగినా ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలను ఆయన చెప్పేస్తారు. నేను ఏం చెబితే చంద్రబాబు అది చేస్తారు''. వాస్తవానికి నాటి వీడియోలో న్యాయ వ్యవస్థలోని పలువురి పేర్లను బిల్లీ వాడేశారు. 'సాక్షి' వాటిని ప్రచురించలేదు. ఆ వీడియో కాపీని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపింది కూడా.

క్రీడా వ్యవస్థను చెరబట్టేందుకు పన్నాగం

కేవలం కాగితాలకే పరిమితమైన ఐఎంజీ భారత్ కంపెనీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ క్రీడా వ్యవస్థను ధారాదత్తం చేసేందుకు చంద్రబాబు కుతంత్రం పన్నారు. 2004 ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం గెలిచినా, వైఎస్సార్ ప్రభుత్వం నాటి ఒప్పందాన్ని రద్దు చేయకపోయినా... రాష్ట్రంలో క్రీడా వ్యవస్థ మొత్తం ఓ మాఫియా గుప్పిట్లోకి వెళ్లిపోయేది. సామాన్యులెవ్వరూ క్రీడల్లోకి ప్రవేశించే ఆలోచన కూడా చేయలేకపోయేవారు. ఎందుకంటే ఐఎంజీ భారత్ కంపెనీతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం అలాంటిది. కేవలం హైదరాబాద్ గచ్చిబౌలిలోని 850 ఎకరాలను కేటాయించడమే కాదు. 16 స్టేడియంలు సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ క్రీడా వ్యవస్థను తన బినామీ బిల్లీ రావుకు 45 ఏళ్లపాటు లీజు పేరిట కట్టబెట్టేశారు. ఆ సమయంలో ఆ స్టేడియంలు, వాటి ఆస్తుల నిర్వహణ అంతా ఐఎంజీ భారత్ పెత్తనం కిందకే వస్తాయి. కానీ ఏటా నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. బీమా ప్రీమియాన్నీ చెల్లిస్తుంది. స్టేడియాల నిర్వహణ కోసం ఆ కంపెనీకి ఉచిత నీరు, ఉచిత విద్యుత్, వినోద పన్ను రాయితీ, విదేశీ సుంకం రాయితీలు అన్ని వెసులుబాట్లు కల్పిస్తుంది. టీవీ ప్రసార హక్కుల ఆదాయం ఆ కంపెనీకే దక్కుతుంది. అంతేకాదు.. మరో ప్రమాదకరమైన నిబంధననూ చేర్చారు. స్టేడియంలు, వాటి ఆస్తులను ఐఎంజీ భారత్ తన విచక్షణ మేరకు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసుకోవచ్చనే క్లాజును చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తే ఆ క్లాజు కింద ఆ స్టేడియంలను ఐఎంజీ భారత్ తన సొంతం చేసుకునే హక్కు కల్పించడమన్న మాట. అంటే రాష్ట్రంలో 45 ఏళ్ల పాటు క్రీడా వ్యవస్థ అంతా ఐఎంజీ భారత్ కంపెనీ ముసుగులో చంద్రబాబు గుత్తాధిపత్యం కింద ఉంటుంది. ఏదో ఒక సాకు చూపించి స్టేడియంలు, వాటి ఆస్తులను కూడా ఆ కంపెనీ తాను నిర్ణయించిన నామమాత్రపు ధర కింద కొనుగోలు చేసేసుకోవచ్చు. అంటే ప్రస్తుతం చంద్రబాబు భాషలో చెప్పాలంటే... రాష్ట్రంలో క్రీడా వ్యవస్థను చంద్రబాబు కుర్చీ మాదిరి మడతపెట్టేస్తారన్నది సుస్పష్టం. కాగా న్యాయ వ్యవస్థ తన నిబద్ధతను, విశ్వసనీయతను మరోసారి చాటిచెప్పింది. చంద్రబాబు, ఐఎంజీ భారత్ కంపెనీ కుతంత్రాలను తిప్పికొట్టింది. ఐఎంజీ భారత్‌కు అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం హైదరాబాద్‌లో 850 ఎకరాలను కేటాయించడాన్ని రద్దు చేస్తూ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. ఆ భూకేటాయింపులు సరైన నిర్ణయమేనని తీర్పునిచ్చింది. దాంతో చంద్రబాబు భూబాగోతం బెడిసికొట్టింది. ఇపుడు సీబీఐ దర్యాప్తునకు కూడా ఆదేశిస్తే... చంద్రబాబు ఊచలు లెక్కబెట్టడం ఖాయమనేది న్యాయవర్గాల మాట.

చంద్రబాబు 'ఐఎంజీ భారత్' అక్రమాలపై
సీబీఐ విచారణ జరిపించాలి

- బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి
- హైకోర్టు తీర్పుతో 850 ఎకరాల ప్రభుత్వ ఆస్తిని కాపాడినట్లయింది

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఐఎంజీ భారత్ అనే సంస్థకు ధారాదత్తం చేసిన 850 ఎకరాలను హైకోర్టు తీర్పుతో కాపాడుకున్నట్టైందని, తీర్పును స్వాగతిస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుపై శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... విలువైన భూములను ఐఎంజీ భారత్‌కు ధారాదత్తం చేసిన ఈ కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సీబీఐతో గాని తగిన ఇతర సంస్థతో గానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఐఎంజీ భారత్ అనే సంస్థ ఏర్పాటైన నాలుగు రోజుల్లోనే హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన 450 ఎకరాలతో పాటు ఏకంగా 850 ఎకరాలను అప్పగించడం దారుణమన్నారు. భారీ మెయింటెనెన్స్ ఫీజు చెల్లించి హైదరాబాద్‌లోని 11 స్టేడియాలను, జూబ్లీహిల్స్‌లోని ఐదెకరాల భూమిని కూడా అప్పగించాలని చంద్రబాబు ప్రతిపాదించడం సరికాదని చెప్పారు. అప్పట్లో ఎకరాకు రూ.13 లక్షలు విలువ చేసే భూమిని రూ.25వేల నుంచి రూ. 50వేలు ధర నిర్ణయించి ఐఎంజీకు8 400 ఎకరాలు రిజిస్టర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని కూడా కోర్టు ప్రశ్నించిందని తెలిపారు.

బాబు అప్పుల వల్లే ఈ తిప్పలు

- టీడీపీ హయాంలో సీఆర్డీఏ అప్పులు రూ.5,106 కోట్లు
- 2016–18 మధ్య బ్యాంకులు, హడ్కో నుంచి సేకరణ
- 508 ఎకరాలు తనఖా పెట్టి రుణం పొందిన వైనం

రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన గ్రాఫిక్స్, గిమ్మిక్కులు అన్నీఇన్నీ కాదు. ప్రధానంగా అమరావతిలో మాస్టర్ ప్లాన్ అభివృద్ధి, రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణం పేరుతో 2016-18 మధ్య రెండేళ్ల కాలంలో రూ.5,106 కోట్ల అప్పులు చేసింది. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం 508 ఎకరాలను తాకట్టు పెట్టేసింది. బాబు చేసిన అప్పుల్లో 2019 నుంచి ఇప్పటివరకు అసలు, వడ్డీ కలిపి 2,707.11 కోట్లను వైఎస్ జగన్ సర్కారు తీర్చింది.

సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారంలో ఉండి సామాన్య ప్రజలకు చేసిందేమీ లేకపోయినా బాబు ద్వారా లబ్ధి పొందిన ఎల్లో మీడియా మాత్రం వైఎస్ జగన్ సర్కారుపై విషం కక్కుతోంది. బాబు చేసిన పాపాలు ఆంధ్రప్రదేశ్‌కు శాపాలుగా చుట్టుకున్నా వాస్తవాలను కప్పిపుచ్చాయి. ఇప్పుడు ఆ తప్పులను సరిచేస్తున్న ప్రభుత్వంపై నిందలు వేస్తూ అదే ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారానికి తెరతీసింది. ఏపీ సీఆర్డీఏ పరిధిలోని సచివాలయం తాకట్టు అంటూ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. వాస్తవానికి సీఆర్డీఏ పరిధిలోని దాదాపు 508 ఎకరాలను తాకట్టు పెట్టి చంద్రబాబు బ్యాంకులు, హడ్కో నుంచి భారీగా అప్పులు చేశారు. కేవలం 2016–18 మధ్యనే అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5,106.59 కోట్లను రుణాలుగా సేకరించింది. నారా వారి స్కాముల్లో రాజధాని కూడా ఒకటి కాగా.. అందులోనూ సీఆర్డీఏ భూముల తాకట్టు వ్యవహారం మరొకటి.

అమరావతి అభివృద్ధి పేరిట..

టీడీపీ ప్రభుత్వంలో 2016 డిసెంబర్ 6న హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) నుంచి రూ.1,151.59 కోట్లు సీఆర్డీఏ ద్వారా రుణమిచ్చింది. దీనికిగాను 454.51 ఎకరాలను తనఖా పెట్టారు. 2018 మే 21న బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంకుల కన్సార్టియంకు 54.179 ఎకరాలను తనఖా పెట్టడంతో పాటు ప్రభుత్వ గ్యారంటీ లెటర్ ఇచ్చి రూ.1,955 కోట్లు తీసుకున్నారు. ఇదే ఏడాది ఆగస్టు 16న అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ గ్యారంటీతో 'అమరావతి బాండ్స్'ను విడుదల చేసి రూ.2 వేల కోట్లు సేకరించారు. ఇలా మొత్తం రూ.5,106.59 రుణాలకు గాను ప్రభుత్వ గ్యారంటీతో పాటు 508 ఎకరాలు తనఖా పెట్టారు. సీఆర్డీఏ తరఫున అప్పులు చేసిన చంద్రబాబు ఆ నిధులను దారి మళ్లించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తూ.. చంద్రబాబు చేసిన అప్పులను అసలు, వడ్డీతో కలిపి ఇప్పటి దాకా రూ.2,707.11 కోట్లను ఆయా సంస్థలకు చెల్లించింది. ప్రస్తుత ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి దాకా సీఆర్డీఏ తరఫున రుణాలు తీసుకున్నది లేదు.

2016-18 మధ్య సీఆర్డీఏ తీసుకున్న రుణాలు (రూ.కోట్లలో)

సంస్థ	రుణం
హడ్కో	1,151.59
బ్యాంకుల కన్సార్టియం	1,955.00
అమరావతి బాండ్స్	2,000.00

అంతర్జాతీయ గజదొంగ

చంద్రబాబుపై సజ్జల ధ్వజం

- తలాతోక లేని ఐఎంజీ భారత్‌కు హైదరాబాద్‌లో 850 ఎకరాలా?
- 21 ఏళ్ల క్రితమే రూ.లక్ష కోట్ల దోపిడీకి బాబు స్కెచ్
- వైఎస్సార్ ఔదార్యం చూపకుంటే నాడే జైలు పాలు
- తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో బాబు దోపిడీ రుజువైంది
- అమరావతిలోనూ అదే తరహా దోపిడీకి పథకం
- అప్పట్లో ప్రభుత్వ భూములు.. తర్వాత రైతుల భూములు స్వాహా
- స్టార్టప్ ఏరియా పేరుతో ప్రైవేట్ సంస్థకు 1,700 ఎకరాలు పందేరం
- రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ఇక్కడా రూ.లక్ష కోట్లు కాజేసే ఎత్తుగడ
- ఇదే రీతిలో స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అత్యంత శాస్త్రీయంగా దోపిడీ చేయగలిగిన అంతర్జాతీయ గజదొంగ అన్నది మరోసారి నిరూపితమైందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఐఎంజీ భారత్ భూ కుంభకోణంపై తెలంగాణ హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాలే అందుకు నిదర్శనమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సరిగ్గా 21 ఏళ్ల క్రితం తలా తోక లేని ఐఎంజీ భారత్ కంపెనీకి నాలుగు రోజుల్లోనే 850 ఎకరాలు కట్టబెట్టి రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్ వేసిన ఘనాపాటి చంద్రబాబు అని పేర్కొన్నారు. విభజన తర్వాత అదే తరహాలో అమరావతి స్టార్టప్ ఏరియా కుంభకోణానికి తెరతీసి రూ.లక్ష కోట్ల దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారని గుర్తు చేశారు. ఐఎంజీ భారత్ కుంభకోణంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టడానికి స్కెచ్ వేస్తే స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో రైతుల భూములను కాజేసేందుకు పథకం వేశారన్నారు. స్కిల్ స్కామ్‌లో రూ.371 కోట్లు అడ్డంగా దోచేశారన్నారు. మరోసారి దోచుకునేందుకే అధికారం కోసం అర్రులు చాస్తున్నారని దుయ్యబట్టారు.

ఇంటర్నేషనల్ స్కామ్‌స్టర్..

- ఐఎంజీ స్పోర్ట్స్ అనే అంతర్జాతీయ సంస్థతో సంబంధం లేకుండా ఐఎంజీ భారత్ అనే బోగస్ సంస్థను 2003 ఆగస్టు 5న ఏర్పాటు చేశారు. క్రీడల అభివృద్ధికి ఆ సంస్థ చేసిన ప్రతిపాదనపై ఎలాంటి విచారణ చేయకుండానే 2003 ఆగస్టు 6న ఆగమేఘాలపై ఆమోదించారు. ఆగస్టు 9న ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. కోరుకున్న స్టేడియంలను ఆ సంస్థకు అప్పగించాలని, స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణం, స్టేడియాల నిర్వహణకు ఏడాదికి రూ.2.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అయితే ప్రభుత్వం భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. మూడేళ్లపాటు విద్యుత్, నీరు, సీవేజ్, డ్రైనేజ్ బిల్లులను వంద శాతం తిరిగి చెల్లిస్తామని, ఆ తర్వాత తగ్గిస్తామని ఒప్పందం చేసుకున్నారు.
- 2003 నవంబర్ 14న చంద్రబాబు ప్రభుత్వం రద్దయింది. ఆ తర్వాత చంద్రబాబు నేతృత్వంలో ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగింది. ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలో గచ్చిబౌలి వద్ద 400 ఎకరాలను ఎకరం రూ.50 వేల చొప్పున కారు చౌకగా ఐఎంజీ భారత్‌కు కట్టబెడుతూ సేల్ డీడ్ చేశారు. ఈ భూమికి అప్పట్లోనే మార్కెట్ విలువ ఎకరా రూ.2.50 కోట్లపైగానే ఉంది. అప్పటికే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నిర్మాణానికి ఈ భూమికి సమీపంలోనే అంకురార్పణ జరిగింది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వస్తుందని తెలిసిన చంద్రబాబు దానికి పక్కనే మామిడిపల్లి వద్ద మరో 400 ఎకరాలను ఐఎంజీ భారత్‌కు కట్టబెట్టారు. జూబ్లీ హిల్స్‌లో ఐఎంజీ భారత్ కార్యాలయం ఏర్పాటుకు 5 వేల చదరపు గజాల భూమిని కేటాయించారు.
- 2004లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాకపోయి ఉంటే చంద్రబాబు ఐఎంజీ భారత్‌తో కలిసి ఆ భూములను కాజేసేవారు. ఇప్పుడు ఆ భూముల విలువ రూ.లక్ష కోట్లు ఉంది. వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక ఆ కుంభకోణంపై విచారణ జరిపి భూముల కేటాయింపును రద్దు చేశారు. వైఎస్సార్ ఔదార్యం చూపకపోయి ఉంటే ఈ కుంభకోణంలో చంద్రబాబు అప్పుడే జైలుకు వెళ్లేవారు.
- ఈ కుంభకోణంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు తలా తోకా లేని సంస్థకు 4 రోజుల్లోనే 850 ఎకరాల భూమిని కేటాయించడంపై విస్మయం వ్యక్తం చేసింది. దీనిపై సీబీఐ దర్యాప్తుకు తాము ఆదేశించాలా? లేక మీరే కోరతారో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రైతుల భూములతో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్

- విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాజధాని భూసమీకరణ పేరుతో 33 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కుని అభివృద్ధి చేసిన వాణిజ్య, నివాస స్థలాలు ఇస్తానంటూ నమ్మబలికారు.
- రైతుల నుంచి లాక్కున్న 33 వేల ఎకరాల్లో 1,700 ఎకరాలను రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు అంటూ సింగపూర్ ప్రభుత్వం పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. ఆ ప్రాజెక్టులో గత ప్రభుత్వం పెట్టుబడి పెట్టడంతోపాటు రూ.5,500 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని ఒప్పందంలో పేర్కొంది. స్టార్టప్ ఏరియా చుట్టూ సచివాలయం, అసెంబ్లీ, సీఎం కార్యాలయం, రాజ్‌భవన్ ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ప్లాట్లకు డిమాండ్ సృష్టించి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.లక్ష కోట్లు దోపిడీకి స్కెచ్ వేశారు. ఆ ప్రాంతంలోనే నాటి మంత్రి నారాయణ, చంద్రబాబు బినామీలు భూములు కొన్నారు. రైతులకు అభివృద్ధి చేసిన వాణిజ్య, నివాస స్థలాలు ఇవ్వడంపై దృష్టి పెట్టకుండా వారి భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.లక్ష కోట్ల దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు.
- సీమన్స్‌తో సంబంధం లేని బోగస్ సంస్థతో స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందం ద్వారా షెల్ కంపెనీలతో రూ.371 కోట్లను చంద్రబాబు కాజేశారు. ఈ కుంభకోణంలో ఆధారాలతో చంద్రబాబు పట్టుబడటంతో సీఐడీ ఆయన్ను అరెస్టు చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టింది. ఆ అక్రమాలకు ఆధారాలు లభ్యమవడంతో కోర్టు ఆయన్ను జైలుకు పంపింది. ఫైబర్ నెట్ స్కామ్ కూడా ఇలాంటిదే.
- కరుడు గట్టిన గజదొంగలకు దొంగతనం చేయడంలో ప్రత్యేక శైలి ఉంటుంది. దాని ఆధారంగానే నిందితులను పోలీసులు పక్కాగా గుర్తిస్తారు. చంద్రబాబు కూడా అంతే. తలా తోకా లేని సంస్థలను తెరపైకి తెచ్చి ఐఎంజీ భారత్, అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్ లాంటి కుంభకోణాలకు పాల్పడ్డారు.

దింపుడు కళ్లెం ఆశతో

అధికారంపై దింపుడు కళ్లం ఆశతోనే చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారు. ఇప్పటికే జనసేనతో పొత్తు పెట్టుకున్నారు. కాంగ్రెస్‌ను చేతిలో పెట్టుకుని షర్మిలమ్మకు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇప్పించారు. అయినా సరే తాను అధికారంలోకి రాలేననే భయంతో బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో ఆ పార్టీ పెద్దల కాళ్లావేళ్లాపడుతున్నారు. ఇది చంద్రబాబు బలహీనతను, ప్రజల్లో సీఎం జగన్‌కు ఉన్న బలాన్ని చాటిచెబుతోంది. చంద్రబాబు ఎన్ని జెండాలతో జత కట్టినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యం. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం.

డబ్బా కాదు బాస్..

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై కుటిల రాతలెందుకు రామోజీ?

సాక్షి, అమరావతి: దేశంలో ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వం గ్రామ గ్రామాన, వాడవాడలా వైద్య శిబిరాలు నిర్వహించి, పేదల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు ఉన్నాయా? అంత మంది వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలను పరీక్షించి, మందులు ఉచితంగా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయా? అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. ప్రజారోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి 'జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)' కార్యక్రమం ఒక ప్రబల నిదర్శనం. ఆరోగ్య శ్రీ పథకం, 108, 104, తల్లీపిల్లల ఎక్స్‌ప్రెస్, ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునీకరణ, వేల కోట్లతో నూతన వైద్య కళాశాలల ఏర్పాటు, వైద్య రంగంలో ఖాళీలన్నవి లేకుండా



ఎప్పటికప్పుడు వైద్యులు, వైద్య సిబ్బంది నియామకం.. ఇవన్నీ ప్రజారోగ్యం పట్ల వైఎస్ జగన్ ప్రభుత్వ నిబద్ధతకు తార్కాణాలు. గ్రామగ్రామాన, వాడవాడలా జేఏఎస్ శిబిరాల్లో లక్షలాది మందికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారిని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఇంత మంది శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందితే రామోజీకి కనిపించవు. అంతా ఖాళీగా ఉన్నట్టు భ్రమిస్తూ ఉంటారు.

ఉమ్మడి రాష్ట్రానికి, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కలిపి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా ఒక్క వైద్య శిబిరం నిర్వహించారా? ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాల కట్టించారా? ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క విభాగాన్నైనా ఆధునీకరించాచా? ఆయన హయాంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎంత దయనీయ స్థితికి వెళ్లిందో ప్రతి ఒక్కరికీ కళ్లకు కట్టింది. ప్రభుత్వ ఆస్పత్రి అంటే పాములు, ఎలుకల నిలయాలుగా పేరుపడ్డాయి. ఇంత దారుణ వ్యవస్థ రాజ్యమేలిన రోజుల్లో కళ్లు మూసుకున్న రామోజీ.. నేడు ప్రజలంతా ఆరోగ్యాన్ని తిరిగి పుంజుకుంటుంటే చూడలేకపోతున్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్సలు అందిస్తుండటం ఆదర్శనీయమని దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తుంటే.. పచ్చ బాసు రామోజీకి మెదడు మొద్దుబారింది. పచ్చ రోగం ముదిరిపోయి కడుపు మంట కథనాలు అచ్చేస్తున్నారు. అదే క్రమంలో జేఏఎస్ శిబిరాలపైనా పడ్డారు. 'ఎందుకీ శిబిరాలు!' అంటూ ఈనాడులో ఓ కుటిల కథనం అచ్చేశారు.

ప్రజలపై భారం లేకుండా చేయడం సొంత డబ్బానా?

ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధి కలిగిన సీఎం జగన్ 58 నెలల పాలనలో అనేక సంస్కరణలు చేపట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ప్రజలకు బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు గుర్తించి, సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్య సేవలు అందిస్తున్నారు. జేఏఎస్ తొలి విడతలో భాగంగా గత ఏడాది 1.45 కోట్ల ఇళ్లలో ఉన్న వారి ఆరోగ్య పరిరక్షణకు 6.45 కోట్ల వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 వేలకు పైగా వైద్య శిబిరాల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 60.28 లక్షల మంది వైద్య సేవలు అందుకున్నారు. కంటి చూపు సంబంధిత సమస్యలతో బాధ



పడుతున్న 80,115 మందికి కేటరాక్ట్ సర్జరీలు చేయించారు. ఇరత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 86,713 మందిని మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు డాక్టర్లు పంపించారు. వీరందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఆరోగ్యశ్రీ కింద కేటరాక్ట్ సర్జరీలు, అవసరమైన చికిత్సలు చేయించింది. ఆస్పత్రులకు వెళ్లి రావడానికి ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందించింది. 5.73 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసింది. తొలి విడతలో 2.51 లక్షల మంది హైపర్‌టెన్షన్, 1.54 లక్షల మంది షుగర్ కేసులను కొత్తగా గుర్తించి, బాధితులకు ఫాలోఅప్ వైద్యం అందిస్తోంది.

- ఈ ఏడాది జనవరి నెలలో రెండో విడత జేఏఎస్‌ను ప్రారంభించి ఇప్పటివరకు 27.33 లక్షల మందికి సురక్ష శిబిరాల్లో వైద్య సేవలు అందించింది. 12,837 మందిని ఆస్పత్రులకు రెఫర్ చేయగా 4,609 మందికి ఇప్పటికే చికిత్సలు అందించారు. 2,313 మందికి కేటరాక్ట్ అవసరమని వైద్యులు సూచించగా ఇప్పటివరకు 1,740 మందికి సర్జరీలు చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజలు వైద్యుల కన్సల్టేషన్, పరీక్షలు, మందులు, చికిత్సలు, చివరికి దారి ఖర్చులకు కూడా ఒక్క రూపాయి చేతి నుంచి ఖర్చు పెట్టలేదు. పైపెచ్చు తాముంటున్న గ్రామం, వార్డులకే వైద్యులు వెళ్లి ప్రజలకు సేవలు అందించారు. ఇదంతా గమనిస్తే ఇంగితం ఉన్న ఎవ్వరికైనా ప్రజలకు ఎంతో మేలు జరిగిందనే వాస్తవం కనిపిస్తుంది. ఒక్క రామోజీకి తప్ప.

వైఎస్ విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి

- అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వేలతో నగర రూపురేఖలు మార్చారు
- క్రెడాయ్ ప్రాపర్టీ షోలో తెలంగాణ మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విజన్, విధానాల వల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమైందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాక ముందు హైదరాబాద్‌లో స్థిరాస్తి మార్కెట్ పూర్తిగా క్షీణ దశలో ఉండేదని, ఆయన సీఎం పదవి చేపట్టాక దూరదృష్టితో నగరాభివృద్ధి కోసం చేపట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి విప్లవాత్మక ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని గుర్తుచేశారు. దీంతో అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉందని చెప్పారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ 13వ ప్రాపర్టీ షో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములేనన్నారు. బిల్డర్లు ఎంత వ్యాపారం చేస్తే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బిల్డర్లను వ్యాపారస్తులుగా చూసే విధానాలకు స్వస్తిచెప్పి పరిశ్రమ అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామని పొంగులేటి హామీ ఇచ్చారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 9-3-2024



సుధామూర్తి

సాటి మనుషుల కోసం పని చేయడం
సామాజిక సేవ ద్వారా పరిస్థితులను మెరుగుపరచడం
యువతకు స్ఫూర్తిగా నిలవడం..
రచయితగా ఎదగడం
ఇన్ఫోసిస్ దిగ్గజంగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందడం
సుధామూర్తిని నేడు రాజ్యసభకు చేర్చాయి.
ఉమెన్స్ డే రోజు ఆమెను రాష్ట్రపతి ముర్ము
రాజ్యసభకు నామినేట్ చేశారు.
సుధామూర్తి జీవన విశేషాలు.

రాజ్య సుధ

తొలి పాఠాలు

సుధామూర్తి బాల్యం హుబ్లీలో గడిచింది. తండ్రి కులకర్ణి డాక్టర్. ఆయన రోజూ టీ సేవించేవాడు. ఒకరోజు పాలు రాలేదు. తండ్రి టీ తాగక వేరే ఏ పనీ మొదలుపెట్టలేక కూచుని ఉన్నాడు. 'ఏంటి నాన్నా?' అని అడిగింది సుధామూర్తి. 'ఉదయాన్నే టీకి నేను అలవాటు పడ్డానమ్మా. ఇవాళ టీ తాగక తలనొప్పి వచ్చింది. నువ్వు మాత్రం దేనికీ అతిగా అలవాటు పడకు.. కాఫీ, టీలకైనా సరే' అన్నాడు. సుధామూర్తి ఆ పాఠాన్ని గుర్తు పెట్టుకుంది. ఇవాళ ఆమెకు డెబ్బై నాలుగు ఏళ్లు. నేటికీ ఉదయాన్నే లేచి టీగానీ కాఫీ గాని తాగి ఎరగదు. సుధామూర్తి హుబ్లీకి 50 కిలోమీటర్ల దూరంలో ఉండే షిగావ్‌లో పుట్టింది. అక్కడ ఆమె అమ్మమ్మ, తాతయ్య ఉండేవారు. తాతయ్య స్కూల్ టీచర్. ఆయన తనకంటే వయసులో ఎంత చిన్నవారినైనా 'మీరు' అని బహువచనం వాడేవారు. 'నీ కంటే చిన్న కదా తాతయ్య' అని సుధామూర్తి అంటే 'లోపలి ఆత్మ పెద్దదే కదమ్మా' అనేవారు. ఎదుటివారిని గౌరవించడం అలా నేర్చుకుందామె. తాతయ్య ఆమెకు మూడు జీవన పాఠాలు నేర్పారు. 1.సింపుల్‌గా జీవించు 2.జ్ఞానాన్ని సముపార్జిస్తూనే ఉండు 3. పుస్తకాలు చదువు. ఇవి సుధామూర్తి నేటికీ పాటిస్తూనే ఉంది. అమ్మమ్మ 'ఆకలితో ఉన్నవారిని గమనించు' అని చెప్పింది. వాళ్ల ఇంటికి రోజూ ఒక భిక్షకుడు వస్తే ఇంట్లో మంచి బియ్యం నిండుకుని ముతకబియ్యం ఉన్నా అమ్మమ్మ మంచి బియ్యమే భిక్షకుడికి వేసేది. 'ముతక బియ్యం మనం తినొచ్చులే' అనేది. ఇదీ సుధామూర్తికి తొలి పాఠమే.

ఇక అమ్మ విమల నేర్పిన పాఠం- 'ఎంతో అవసరమైతే తప్ప డబ్బు ఖర్చు పెట్టకు' అని. అంతే కాదు నీకు బాల్యంలో మంచి అలవాట్లు ఉంటే అవే కాపాడతాయి అని కూడా ఆమె అనేది. ఉదయాన్నే లేచి కాగితం మీద 10 సార్లు 'దేవుడికి నమస్కారం' అని రాయించేదామె. నేటికీ సుధా మూర్తి ఆ అలవాటును మానలేదు. ఇక స్కూల్ టీచరు రాఘవేంద్రయ్య... 'నీకు లెక్కలు భలే వస్తున్నాయి. లెక్కల్ని వదలకు. పైకొస్తావ్' అన్నాడు. ఆమె ఆనాటి నుంచి లెక్కల్నే రెక్కలుగా చేసుకుంది.

ఇల్లాలే శక్తి

నారాయణ మూర్తితో వివాహం అయ్యాక ఇన్ఫోసిస్ సంస్థను ఆయన స్థాపించాలనుకున్నప్పుడు 10 వేల రూపాయలు పెట్టుబడి తనే ఇచ్చింది సుధామూర్తి. అయితే ఆమెను ఇన్ఫోసిస్‌కు బయటి వ్యక్తిగానే ఉండటం మంచిదని సూచించాడు నారాయణమూర్తి. ఆమె కొంచెం బాధపడింది. ఎప్పటికైనా ఇన్ఫోసిస్ సంస్థలో చేరతాననే భావించింది. అదే సమయంలో చాలా కాలం పాటు పిల్లల కోసం గృహిణిగా ఉండిపోయింది. 'సంవత్సరంలో 200 రోజులు ప్రయాణాల్లో ఉండేవాడు నారాయణమూర్తి. ఆ రోజుల్లో ఫోన్ లేదు. కారు లేదు. పిల్లలకు ఆరోగ్యం బాగలేకపోతే ఒక్కదాన్నే వెళ్లాలి. సంస్థ ఆర్థిక కష్టాలు.. ఇంటి కష్టాలు.. అన్నీ తట్టుకుని నారాయణమూర్తికి వెన్నుదన్ను అందించాను. ఆ తర్వాత ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు చైర్మన్ అయ్యాను. ఆ ఫౌండేషన్‌తో వేలాది మంది జీవితాల్లో వెలుగు తెచ్చే వీలు నాకు కలిగింది. ఈ సంతృప్తి ఇన్ఫోసిస్ డైరెక్టర్‌గా పని చేసి ఉంటే నాకు దక్కేది కాదు' అంటుందామె.

కుతూహలమే గురువు

చిన్నప్పుడు సుధామూర్తికి ప్రతిదీ కుతూహలమే. వీధుల్లో కొట్లాటలు అవుతుంటే అక్కడకు పరిగెత్తి వెళ్లి నిలబడేది. వినోదం కోసం కాదు. కారణం ఏమై ఉంటుందా అని. చిన్న ఊళ్లో ప్రతి ఇల్లూ అందరికీ పరిచయమే. అందరి జీవితాలనూ ఆమె పరిశీలిస్తూ ఉండేది. ఇక పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగితే ఆమె తప్పని సరిగా ఒక స్టీలు క్యారేజీ తీసుకుని బయలుదేరేది. విందులో ఏ పదార్థాలు బాగున్నాయో ఏ పదార్థాలు బాగలేవో మొత్తం రుచి చూసి వస్తూ వస్తూ బాగున్న వాటిని క్యారేజీలో అడిగి తెచ్చుకునేది. కాలేజీ రోజుల వరకూ కూడా పెళ్ళిళ్లకు క్యారేజీ తీసుకోకుండా సుధామూర్తి వెళ్లేది కాదు. 'ఎందుకో నాకు గిన్నెల క్యారేజీ అంటే నేటికీ ఇష్టం' అంటుందామె.

మసాలా దోసె పార్టీ

లెక్కలు బాగా నేర్చుకున్న సుధా హుబ్లీలోని బి.వి.బి. కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో చేరింది. ఇక ఆ రోజు నుంచి ఊళ్లోని పెద్ద మనుషులంతా ఆమె తండ్రి దగ్గరకు వచ్చి వాపోవడమే. 'అమ్మాయిని ఇంజనీరింగ్ చదివిస్తున్నావ్. పెళ్లెవరు చేసుకుంటారు' అని బెంగపడటమే. తండ్రి కూడా ఒక దశలో తప్పు చేశానా అనుకున్నాడు. కాని సుధామూర్తి మొదటి సంవత్సరానికి ఫస్ట్ క్లాస్‌లో పాసైంది. తండ్రికి సంతోషం కలిగింది. 'ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్నావ్ కదా... పద మసాలా దోసె పార్టీ చేసుకుందాం' అని తీసుకెళ్లాడు. ప్రతి సంవత్సరం ఆమె ఫస్ట్‌క్లాస్ తెచ్చుకోవడం.. తండ్రి తీసుకెళ్లి మసాలా దోసె తినిపించడం. ఆ తండ్రీ కూతుళ్ల జీవితంలో పార్టీ చేసుకోవడం అంటే అదే. అది కూడా సంవత్సరానికి ఒకసారి మాత్రమే. 'కాని ఆ పార్టీ ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. అపురూపం అనిపించేది' అంటుందామె.

చరిత్ర మార్చిన కార్డు ముక్క

1974లో టాటా వారి 'టెల్కో' సంస్థలో ఇంజనీరింగ్ ఉద్యోగాలు పడ్డాయి. పేపర్‌లో ఆ యాడ్ చూసింది సుధామూర్తి. అర్హతలు అన్నీ ఆమెకు ఉన్నాయి. కాని యాడ్ కింద 'స్త్రీలు అప్లై చేయాల్సిన పని లేదు' అని ఉంది. అప్పుడు సుధామూర్తికి ఆగ్రహం వచ్చింది. రోషం కలిగింది. జె.ఆర్.డి.టాటాకు ఒక కార్డు గీకి పడేసింది. 'దేశంలో ఉన్న ఇంతమంది స్త్రీలకు పని చేసే హక్కు లేకపోతే వారు ఎలా అభివృద్ధిలోకి వస్తారు?' అని ప్రశ్న. ఆ కార్డు జె.ఆర్.డి. టాటాకు చేరింది. ఆ వెంటనే ఆమెకు ఇంటర్వ్యూకు పిలుపు, ఆపై ఉద్యోగం వచ్చాయి. పూణెలో సుధామూర్తి తొలి ఉద్యోగం చేసింది. ఆమె రాసిన లేఖను టాటా సంస్థ నేటికీ భద్రపరిచి ఉంచింది. 1974లో టెల్కోలో సుధామూర్తి ఒక్కతే మహిళా ఉద్యోగి. దాదాపు 50 ఏళ్ల తర్వాత సుధామూర్తి పూణెలో ఆ సంస్థను సందర్శిస్తే (ఇప్పుడు టాటా మోటార్స్) 900 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. 'నేను అక్కడ నిలబడి మా తండ్రిని తలుచుకుని ఉద్వేగంతో కన్నీరు కార్చాను. ఎవరు భయపెట్టినా నన్ను ఆయన చదివించాడు. నా వల్ల ఇవాళ ఇంతమంది మహిళలు ఉద్యోగాల్లో ఉన్నారు అని' అందామె.

జీవితం అంతులేని పోరాటం

'జీవితం అంటే అంతులేని పోరాటం. ఎవరికీ ఏ వయసులో ఉన్నా కన్సెషన్ ఉండదు. పోరాటం చేయాలి. ఓడిపోయినా పోరాట అనుభవం మిగులుతుంది. జీవితంలో ఎన్నో సంఘటనలు ఎదురవుతాయి. క్షమిస్తే మంచిది. మర్చిపోతే ఇంకా మేలు. కాని ముందుకు సాగడమే అన్నింటికన్నా ఉత్తమమైనది. చిన్న చిన్న ఆనందాలు జీవితాన్ని మెరిపిస్తాయి. ప్యాషన్‌తో పని చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. ఒక మనిషిని పైకి తెచ్చేది డబ్బు కాదు ప్యాషన్. నమ్మిన పనిని విలువలతో ఆచరిస్తే ఎవరైనా పైకి రావాల్సిందే' అంటుందామె.

రాజ్యసభ సభ్యురాలు

'ఇది ఊహించలేదు. రాష్ట్రపతి నన్ను రాజ్యసభకు నామినేట్ చేశారు. దీని గురించి నేను కూచుని ఆలోచించాలి. అర్థం చేసుకోవాలి. ఏం చేయగలనో అంతా చేయాలి. ఇప్పుడు నేను భారత ప్రభుత్వ 'సేవకురాలిని' అని కొత్త బాధ్యతకు సిద్ధమవుతోంది సుధామూర్తి. ●

ఆత్మబలం

'చీకటిని చూసి విచారించవద్దు. అదిగో చిరుదీపం' అంటుంది ఆశావాదం.
'ఏమీ లేదని బాధ పడవద్దు. నేనే నీ ఆయుధం, బలం' అంటుంది ఆత్మవిశ్వాసం.
ఆశావాదం వెల్లివిరిసే చోట ఆత్మవిశ్వాసం ఉంటుంది.
జయంతి బురడ, రాణిమా దాస్, మలీషా ఖర్వాలకు ఘనమైన కుటుంబ నేపథ్యం లేదు.
'జీరో' నుంచి ప్రయాణం ప్రారంభించిన వీరు తమను తాము తీర్చిదిద్దుకుంటూ 'హీరో'లుగా పేరు తెచ్చుకున్నారు.
ఫోర్బ్స్ ఇండియా టాప్ సెల్ఫ్-మేడ్ ఉమెన్ 2024 (డబ్ల్యూ-పవర్ లిస్ట్)లో చోటు సాధించారు...

శ్రామికలోక శక్తిమంతులు

గిరిజన గొంతుక



జయంతి బురుడ

గిరిజన మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసు రావడానికి జర్నలిస్ట్ కావాలనుకుంది అడవి బిడ్డ జయంతి బురుడ. అయితే ఇంట్లో మాత్రం 'చదివింది చాలు' అనే మాట ఎప్పుడూ వినిపించేది. దీంతో ఇంటిని విడిచిపెట్టి స్నేహితుల సహాయంతో ఒడిషా సెంట్రల్ యూనివర్శిటీలో జర్నలిజంలో డిగ్రీ చేసింది. ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లాలోని సెర్పల్లి ఆమె స్వగ్రామం.

2015లో భువనేశ్వర్‌లోని కళింగ టీవీ న్యూస్ చానల్ రిపోర్టర్‌గా చేరిన జయంతి బురుడ జర్నలిస్ట్‌గా పెద్ద పేరు తెచ్చుకుంది. తన రిపోర్టింగ్ టూర్‌లలో గిరిజనులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, మౌలిక సదుపాయాల లేమిపై దృష్టి పెట్టడమే కాదు వాటి పరిష్కారానికి కూడా కృషి చేసింది. ఆడపిల్లల చదువు, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2018లో 'బడా దీదీ యూనియన్' అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టింది. 'బడా దీదీ యూనియన్' ద్వారా గిరిజన మహిళల కోసం ఎన్నో అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించింది.

తమను వేధిస్తున్న సమస్యలపై గిరిజన మహిళలు ధైర్యంగా గొంతు విప్పలేకపోవడాన్ని జయంతి గ్రహించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, ధైర్యంగా గొంతు విప్పడానికి 2022లో 'జంగిల్ రాణి' పేరుతో వేదిక ప్రారంభించింది. 'మన కథ- మన కోసం' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇది.

మల్కన్‌గిరిలోని ఏడు బ్లాక్‌లకు చెందిన యాభై మంది గిరిజన మహిళలు ఈ ప్లాట్‌ఫామ్‌ను నిర్వహిస్తున్నారు. స్క్రిప్టులు రాయడం, వీడియోలు చిత్రీకరించడం, ఎడిటింగ్....మొదలైవాటిని వీరికి నేర్పించింది బురుడ.

సంస్కృతి నుంచి తాము ఎదుర్కొంటున్న సమస్యల వరకు చేతిలోని సెల్‌ఫోన్‌తో వీడియో స్టోరీలు చేస్తున్నారు గిరిజన మహిళలు. ఈ స్టోరీలను 'జంగిల్ రాణి' ఫేస్‌బుక్ పేజీలో అప్‌లోడ్ చేస్తారు. గిరిజన సమాజానికి, అడవులు, జీవనవైవిధ్యానికి ఉన్న సంబంధానికి అద్దం పట్టే సహజ కథనాలు ఇవి.

ఎంతోమంది సాధారణ మహిళలలో అసాధారణ ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో ఎంతో కృషి చేసింది జయంతి బురుడ.

ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్



మలీషా ఖర్వా

'ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్'గా పేరు సంపాదించిన మలీషా ఖర్వా ఫోర్బ్స్ ఇండియా ఉమెన్-పవర్ 2024 జాబితాలో చోటు సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిలిచింది. హాలీవుడ్ యాక్టర్ రాబర్ట్ హాఫ్‌మన్‌తో కలిసి నటించిన తరువాత మలీషా జీవితం మారిపోయింది. ముంబైలోని ధారవి మురికివాడలో ఒక గుడిసెలో నివసిస్తున్న మలీషా రాబర్ట్ హాఫ్‌మన్ దృష్టిలో పడింది.

ఆ అమ్మాయిలోని వెలుగేదో రాబర్ట్‌ను ఆకట్టుకుంది. 'ఈ మట్టిలో మాణిక్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి' అనుకున్నాడు. మోడల్, డ్యాన్సర్ కావాలన్న మలీషా కలను సాకారం చేసేందుకు తన వంతు సాయం అందించాడు. మలీషాకు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో 4,50,000 మంది ఫాలోవర్‌లు, 88,700 మంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. పీకాక్ మ్యాగజైన్ కవర్ పేజీపై మెరిసిన మలీషా లగ్జరీ ఇండియన్ కాస్మొటిక్స్ బ్రాండ్ ఫారెస్ట్ ఎసెన్షియల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. పదహారు సంవత్సరాల మలీషా ఖర్వా మోడల్, కంటెట్ క్రియేటర్‌గా మంచి పేరు తెచ్చుకుంది.

'కల నిజం చేసుకోవడానికి పేదరికం ఎంతమాత్రం అడ్డు కాదు' అని నిరూపించిన మలీషా ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

అంగన్‌వాడీ అక్క




రాణిమా దాస్

దేశంలోని 23 లక్షల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌ల ప్రతినిధిగా రాణిమా దాస్‌ను ఫోర్బ్స్ ఇండియా 'ఉమెన్ పవర్ లిస్ట్ 2024'లో చోటు కోసం ఆల్ ఇండియా అంగన్ వాడీ వర్కర్ ఫెడరేషన్ నామినేట్ చేసింది. అస్సాంలో పరభోవా గ్రామానికి చెందిన రాణిమా దాస్ ఎవరికి ఏ సమస్య వచ్చినా 'నేను ఉన్నాను' అంటూ ముందుకు వచ్చేది. సమస్యల పరిష్కారంతో పాటు మహిళలకు ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు ఇవ్వడంలో మంచి పేరు తెచ్చుకుంది. అంకితభావం, నిబద్ధతతో వ్యవహరించే రాణిమాను 'అక్కా' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకుంటారు. గత పదిహేడేళ్లుగా పిల్లలను బడిలో చేర్పించడం, గర్భిణి స్త్రీలకు సూచనలు...మొదలైన ఎన్నో విషయాల్లో కృషి చేస్తోంది రాణిమా దాస్. సలహాలు, సహాయం విషయంలో ముందు ఉన్నట్లే పోరాట విషయంలో ముందుంటుంది. అస్సాం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అయిన రాణిమా దాస్ అంగన్‌వాడీ వర్కర్‌ల వేతన పెంపుదల కోసం పోరాటం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. 'ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎప్పుడూ పోరాడతాం' అంటున్న రాణిమా దాస్‌కు పోరాటం కొత్త కాదు.

సమాజాన్ని అద్దంలో చూపించాను

'దేర్ ఐ వజ్, మీడియా మ్యూజింగ్స్' పేరుతో తన జర్నలిస్ట్ జీవితాన్ని పాఠకుల ముందు ఆవిష్కరించారు అరుణా రవికుమార్. ముప్పై ఎనిమిదేళ్ల కిందట 'అరుణా అశోకవర్ధన్' పేరుతో తొలిసారి బైలైన్ చూసుకోవడం నుంచి నేటి వరకు సాగిన అక్షరయానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.



''నేను మీడియా రంగంలోకి రావడమే ఒక ఆశ్చర్యం. నా చదువు ఇంగ్లిష్ మీడియంలో, గ్రాడ్యుయేషన్ సైన్స్‌లో సాగింది. అమ్మ రచయిత కావడంతో తెలుగు సాహిత్యం మీద అభిరుచి మెండుగా ఉండేది. నా లక్ష్యం సివిల్స్. ప్రిలిమ్స్ క్లియర్ అయింది. మెయిన్స్ పరీక్షల నాటికి తాతగారు పోవడంతో రాయలేకపోయాను. ఆ తర్వాత అనుకోకుండా ఓ ఇంగ్లిష్ పత్రికలో జర్నలిస్టుగా చేరాను. నా తొలి రిపోర్టింగ్ జస్టిస్ చల్లా కొండయ్య కమిషన్ రిపోర్ట్ మీద. బై లైన్‌తో వచ్చింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్లు, ప్రపంచ విజేతనైన భావన. అలా మొదలైన నా జర్నీ ఎలక్ట్రానిక్ మీడియాకు మారింది. తెలుగులో ప్రైవేట్ టీవీ రంగంలో రిపోర్టర్ బాధ్యతలు నిర్వర్తించిన తొలి మహిళను. పెళ్లి చేసుకున్న తర్వాత విజయవాడకు బదిలీ కావడం కూడా చాలా కీలకమైన అనుభవాన్నిచ్చింది. అది 1988, మార్చి నెల పదవ తేదీ. విజయవాడ వెళ్లిన తొలి రోజు, దేవినేని మురళి హత్య. సూపర్ మార్కెట్‌లో ఉన్నాను. ఓ కుర్రాడు పరుగున లోపలికి వచ్చి షట్టర్ వేసేశాడు. భయం కలిగినప్పటికీ నిబ్బరంగా ఉండిపోయాను. ఓ అరగంట తర్వాత షట్టర్ తీశారు. రోడ్డు మీదకు వస్తే... అంతకు ముందు ఏమీ జరగనట్లు తుపాను తర్వాత ప్రశాంతతలా ఉంది వాతావరణం. జర్నలిస్టుగా కొత్త ప్రపంచాన్ని చూశాను. చీరాలలో చేనేతకారుల ఆకలి చావులను రిపోర్ట్ చేయగలిగాను. సమాజంలో వేళ్లూనికొని ఉన్న ఆవేదనలు, ఆందోళనలకు అద్దం పట్టాను. ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు సాంబశివుడి ఇంటర్వ్యూ చేశాను. ఎలిమినేటి మాధవరెడ్డి గారి హత్యకు కొద్దిగా ముందు ఆయనతోపాటు వారి వాహనంలోనే ప్రయాణించాను. అప్పటికే రెక్కీ నిర్వహించి హత్యకు ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆ తర్వాత నాకు తెలిసింది. బళ్లారిలో ఎన్నికలను కవర్ చేశాను. భ్రూణహత్యల మీద పరిశోధనాత్మక కథనాలకు యూనిసెఫ్ అవార్డు వచ్చింది. స్టూడియో లో ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల ఇంటర్వ్యూలు ఎన్ని చేసినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలనా కథనాలు ఎక్కువ సంతోషాన్నిస్తాయి. ఫ్లోరోసిస్ బాధితుల కథనాలకు స్పందనగా ప్రభుత్వాలు నీటి సౌకర్యాన్ని కల్పించడం రిపోర్టర్‌గా నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన సందర్భం. లంబాడా తండాల్లో ఆడపిల్లలను పుట్టగానే చంపేయడం, కుటుంబాన్ని పోషించడానికి ఓ మహిళ మూడుసార్లు సరోగసీ ద్వారా బిడ్డను కని అనారోగ్యం పాలు కావడం వంటి కథనాలెన్నింటికో నేను అక్షరసాక్షిని కావడం ద్వారా నాకు ఈ రంగం ఎంతో సంతృప్తినిచ్చింది. మా వారి బదిలీల రీత్యా, పిల్లలు పుట్టినప్పుడు, వాళ్ల చదువులు కీలక దశల్లో ఉన్నప్పుడు కెరీర్‌లో విరామాలు తీసుకుంటూ నా వృత్తిని కొనసాగిస్తున్నాను. మల్టీ లెవెల్ మార్కెటింగ్ మీద 'మరాడర్స్ ఆఫ్ హోప్' నా తొలి రచన. 'దేర్ ఐ వజ్, మీడియా మ్యూజింగ్స్' నా రెండవ రచన. ఇండిపెండెంట్ జర్నలిస్టుగా హైదరాబాద్‌లో ప్రశాంతంగా జీవిస్తున్నాను. ఇప్పటికీ రోజూ చదువుతాను, రాస్తుంటాను. మహిళ ఎన్ని సాధించినప్పటికీ సమాజంలో సమానత్వం మాత్రం పూర్తిస్థాయిలో రాలేదనే చెప్పాలి. అయితే నా చిన్నప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉంది. అప్పట్లో సమాజంలో స్త్రీ-పురుషుల మధ్య అసమానత్వం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అంత తీవ్రంగా లేదు. కానీ సమానత్వం మాత్రం ఇంకా రాలేదు'' అంటూ తన అక్షరయానం గురించి వివరించారు అరుణ.



అరుణా రవికుమార్

- ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి; ఫొటో: అనిల్‌కుమార్ మోర్ల



డ్రైవర్ గంగవ్వ!



నచ్చిన పనిని ఎంచుకున్నా!

ఇంటర్మీడియెట్ పూర్తవుతూనే పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. అక్కడ వాతావరణం ఎందుకో నాకు సరిపడదు అనిపించింది. వారం రోజులు కూడా గడవకముందే ఇంటికి వచ్చేశాను. అమ్మానాన్నలకు భారం కాకూడదని నిర్ణయించుకున్నా. నాకు బాగా నచ్చిన పని మీద దృష్టి పెట్టాను. డ్రైవింగ్ సొంతంగానే నేర్చుకున్నాను. రైస్‌మిల్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే ట్రాక్టర్, లారీ, కారు.. డ్రైవింగ్ నేర్చుకున్నాను. కొందరు విచిత్రంగా చూసేవారు. కొందరు మగరాయుడు అనేవారు. ఎవరు ఏమనుకున్నా నా కష్టం మీద నేను బతకాలనుకుని నచ్చిన పనిచేసుకుంటూ వెళుతున్నాను.

– గంగవ్వ, సజ్జన్‌పల్లి,
లింగంపేట మండలం, కామారెడ్డి జిల్లా

పంచాయతీ ట్రాక్టర్‌ను నడుపుతుంది.
లారీ మీద, బైక్ మీద సవారీ చేస్తుంది.
పంటల సాగులోనూ అందెవేసిన చేయి
కష్టాలను ఎదిరించి సొంత కాళ్ల మీద నిలబడింది.
కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం సజ్జన్‌పల్లి గ్రామంలో
గంగవ్వ గురించి అడిగితే 'ఎవరు?' అంటారేమో గానీ...
డ్రైవర్ గంగవ్వ.. అంటే అందరికీ తెలుసు.

ప్రతిరోజూ పంచాయతీ ట్రాక్టర్‌ను తీసుకుని గల్లీల్లో చెత్త సేకరణతో పొద్దున్నే అందరినీ పలకరిస్తూ వెళుతుంది గంగవ్వ. ట్రాక్టర్ ఒక్కటే కాదు లారీ, ఆటో, కారు ఏదైనా నడపగలదు. బైక్ మీద సవారీ చేయగలదు. సొంత కాళ్ల మీద నిలబడిన గంగవ్వ ఎందరికో ఆదర్శంగా నిలిచింది.





చదువుకుంటూనే డ్రైవర్‌గా!

సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన పుట్టి నాగయ్య, సాలవ్వల కూతురు గంగవ్వ. శెట్పల్లి సంగారెడ్డిలో పదో తరగతి వరకు చదువుకుంది. లింగంపేట మండల కేంద్రానికి వెళ్లి ఇంటర్ చదివింది. దూరభారాలు అని చూడకుండా సైకిల్ మీద సవారీ చేస్తూ వేరే ఊళ్లలో చదువుకుంది. పేద కుటుంబం కావడంతో సెలవు దినాల్లో కూలి పనులకు వెళ్లేది. అమ్మానాన్నలకు చేదోడువాదోడుగా ఉండేది. ఈ క్రమంలోనే బైకు నేర్చుకుంది. తరువాత ట్రాక్టర్ నడపడం నేర్చుకుంది. లారీ డ్రైవర్‌గానూ పనిచేసింది.

గ్రామ పంచాయితీ పనుల్లో...

గంగవ్వకు తల్లిదండ్రులు పెళ్లి చేశారు. వారం రోజులు తిరక్కుండానే వెనుదిరిగి వచ్చేసి, తల్లిగారింట్లోనే ఉండిపోయింది. అప్పటి నుంచి ఇంటి దగ్గరే ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్లేది. అలాగే ట్రాక్టర్, కారు, లారీ డ్రైవర్‌గా వెళ్లి వచ్చేది. నాలుగేళ్ల పాటు రైస్‌మిల్‌లో ఆపరేటర్‌గా కూడా పనిచేసింది. ఐదేళ్ల కిందట పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్లు, ట్యాంకర్లు సరఫరా చేయడంతో గ్రామంలో డ్రైవింగ్ లైసెన్సు ఉన్నవాళ్లు దొరకలేదు. అప్పటికే భారీ వాహనాలు నడిపే సామర్థ్యంతో పాటు డ్రై వింగ్ లైసెన్స్ ఉండడంతో పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా నియమించారు. అప్పటి నుంచి పంచాయతీలో పనిచేస్తోంది.

రోజూ చెత్త సేకరణ నుంచి రకరకాల పంచాయితీ పనుల్లో చురుగ్గా పాల్గొంటుంది. నిచ్చెన సాయంతో స్తంభం ఎక్కి విద్యుత్తు దీపాలను సరిచేస్తుంది. పంచాయతీలో ఏ పని ఉన్నా ఇట్టే చేసిపెడుతుంది. మొదట్లో ఆమెకు పంచాయతీ నుంచి రూ.2,500 వేతనం ఇచ్చేవారు. క్రమంగా పెరుగుతూ వచ్చి ఇప్పుడు రూ.8,500 వేతనం ఇస్తున్నారు. ట్రాక్టర్ అవసరం ఎప్పుడు ఏర్పడినా సరే గంగవ్వ పరుగున వెళ్లి ట్రాక్టర్ తీస్తుంది. నాలుగేళ్ల కిందట తండ్రి నాగయ్య చనిపోయాడు. తల్లి సాలమ్మతో కలిసి ఉంటుంది. అన్న కొడుకుని చదివించింది. అతను ఇప్పుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు.

వ్యవసాయ పనులు

గంగవ్వ డ్రైవర్‌గా పనిచేస్తూనే వ్యవసాయ పనులు చేస్తోంది. తనకు సొంత భూమి లేకపోవడంతో వేరేవాళ్ల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తోంది. వెళ్లి దున్నడం, నాటు వేయడం, కలుపుతీయడం వంటి పనులన్నీ సొంతంగా చేసుకుంటుంది. లింగంపేట మండల కేంద్రానికి వెళ్లాలన్నా, ఎల్లారెడ్డి పట్టణానికి వెళ్లాలన్నా గంగవ్వ బైకు మీదనే ప్రయాణం చేస్తుంది. 'ఎవరిపైనా ఆధారపడకుండా బతకడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేద'నే గంగవ్వ మాటలు నేటి తరానికి స్ఫూర్తి కలిగిస్తాయి.

– ఎస్.వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

మిమ్మల్ని మీరు పట్టించుకోండి!

కుటుంబ సభ్యులందరికీ కావలసిన వాటిని అమర్చడంలో పడి మహిళలు తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించరు. దీనివల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఉండదని అందరికీ తెలిసిందే. అందువల్ల ముందే మేలుకొనడం అవసరం.



నిన్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు జరుపుకునే ఉంటారు. అయితే అంతకన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే మహిళలు తమ ఆరోగ్యంపై కాస్త శ్రద్ధ పెట్టి సమయం కేటాయించడం. తమ వయసుకు తగ్గ పోషకాహారం తీసుకోవడం. అనారోగ్య సమస్యలను దాచిపెట్టకుండా తగిన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. మీరు ఆరోగ్యంగా ఉంటేనే...మీ కుటుంబం ఆరోగ్యంగా ఆనందంగా ఉంటుందని గుర్తుపెట్టుకోండి..



ఐరన్ ఉండే ఆహారం

మహిళలు తీసుకోవాల్సిన ముఖ్యమైన దానిలో ఐరన్ మొదటి స్థానంలో ఉంది. గర్భధారణ సమయంలో స్త్రీలకు ఐరన్ చాలా అవసరం. శరీరంలో ఐరన్ పరిమాణం తగ్గిపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది. దీని వల్ల నీరసం, అలసట, ఊపిరి అందకపోవడం వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల మీ ఆహారంలో మాంసకృత్తులు, చికెన్, సీఫుడ్, బీన్స్, కాయధాన్యాలు, బచ్చలి కూర, బ్రోకలీ, బీట్‌రూట్, దానిమ్మ, ఖర్జూరం, తృణధాన్యాలు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవడం అలవాటు చేసుకోవాలి.



విటమిన్ ఎ తప్పనిసరి

మహిళలకు అవసరమైన విటమిన్ల జాబితాలో విటమిన్ ఎ ద్వితీయ స్థానంలో ఉంది. ఇది మహిళల పునరుత్పత్తి ఆరోగ్యానికి ముఖ్యమైన విటమిన్. ఆహారంలో విటమిన్ ఎ అధికంగా ఉండే ఆకుకూరలు, అరటి పండ్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్ బి 12


విటమిన్ బి 12 అనేది జీవక్రియ కార్యకలాపాలను పెంచుతుంది. రక్తహీనతను నివారిస్తుంది. మహిళల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అందువల్ల బీ 12 సమృద్ధిగా ఉండే మాంసం, చేపలు, గుడ్లు తీసుకోవాలి. శాకాహారులు పాలు తియ్యని వేరుసెనగపప్పు, సెనగలు, దంపుడు బియ్యం, వెన్న తియ్యని పాలు (జంతువుల నుంచి వచ్చిన పాలు) వంటివి తీసుకోవాలి.





కాల్షియం

మహిళలు వయస్సు పెరిగేకొద్దీ, ఎముక సంబంధిత ఆరోగ్య సమస్యలను తరచు ఎదుర్కొంటారు. అందువల్ల, ఎముకల ఆరోగ్యానికి మహిళలు కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యం. ఇందుకోసం పాలు, గుడ్లు, నువ్వులు వంటివి తీసుకోవాలి.



విటమిన్ డి

ఈ జాబితాలో విటమిన్ డి తర్వాతి స్థానంలో ఉంది. విటమిన్ డి మన శరీరం కాల్షియాన్ని గ్రహించడంలో సహాయపడుతుంది. ఇది ఎముకలు, దంతాల పెరుగుదలకు సహాయపడుతుంది.



మెగ్నీషియం

మెగ్నీషియం కూడా స్త్రీలకు కావలసిన అతి ముఖ్యమైన పోషకం. కండరాల బలం ఎముకల ఆరోగ్యానికి మెగ్నీషియం అవసరం. మహిళలు మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం.




ఈ పరీక్షలు అవసరం

భారతదేశంలో మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.. ఎన్నో గణాంకాలు స్త్రీలల్లో ఐరన్ లోపం ఉంది అని చెబుతున్నాయి. కనీసం 10 శాతం కూడా హిమోగ్లోబిన్ ఉండటం లేదు. ఈ పరిస్థితిని ఇలానే నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.. ముఖ్యంగా ఇది బ్లడ్ క్యాన్సర్‌కు కూడా దారితీస్తుంది. అందువల్ల అత్యవసరమైన సీబీపీ అంటే కంప్లీట్ బ్లడ్ పిక్చర్, థైరాయిడ్, విటమిన్ పరీక్షలు, కాల్షియం, కొలెస్ట్రాల్, ఐరన్ వంటి పరీక్షలను చేయించుకోవడం అవసరం.

హెల్త్ టిప్స్

- దంత సమస్యలు ఉన్నవారు.. నోటి దుర్వాసనతో బాధపడుతున్న వారు.. అల్లాన్ని ఎండబెట్టి పొడి చేసి దాంట్లో కాస్త నీరు కలిపి పేస్ట్‌లా చేసి దానితో పళ్లు తోముకుంటే చిగుళ్లు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది.



- కొన్ని ఎండు ద్రాక్ష కొన్ని ధనియాలు నీరు పోసి మరిగించి చల్లార్చి ఆ కషాయాన్ని ఉదయం, సాయంకాలం తాగాలి. కీళ్ల వాపులు తగ్గి పోతాయి.
- సీజనల్ వ్యాధులను తగ్గించడంలో అల్లం బాగా పనిచేస్తుంది. కాస్త అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని పూటకు ఒక కప్పు మోతాదులో తాగుతుంటే దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలు తగ్గుతాయి





- అల్లం రసం + కీర దోసకాయ రసం + నిమ్మకాయ రసం కలిపిన మిశ్రమాన్ని ప్రతి రోజు ఉదయం పూట తాగాలి. నొప్పులు, వాపులు తగ్గి పోతాయి.



- గచ్చకాయను పగలగొట్టి లోపలి పప్పును తీసుకుని నానబెట్టిన కొన్ని మెంతులను కలిపి కొన్ని చుక్కల నీరు కలిపి మెత్తగా నూరాలి. ఆ మిశ్రమాన్ని పడుకునేముందు కీళ్ల నొప్పులు, వాపు ఉన్న చోట రాసుకొని పడుకోవాలి. తెల్లవారేసరికి నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

పండంటి ఆరోగ్యం



నేటి కాలంలో 30 ఏళ్లు దాటితే చాలు కీళ్ల నొప్పులు ప్రారంభమవుతున్నాయి. ఈ పరిస్థితిలో వాటిని ఎదుర్కోవటానికి చాలామంది చాలా చిట్కాలు పాటిస్తున్నారు. కానీ ఎటువంటి ఫలితాలు ఉండటం లేదు. కానీ ఆహారంలో ఈ మూడు పండ్లను చేర్చుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఆ పండ్లేమిటంటే...



నారింజ: రోజూ నారింజను తినడం వల్ల శరీరంలో నీటి కొరత తీరుతుంది. ఇందులో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లనొప్పులని తగ్గించడంలో సహాయపడుతుంది.

ద్రాక్ష: వీలయినంత వరకు ద్రాక్షపండ్లను తీసుకోవడం ద్వారా అనేకరకాల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. చిన్నప్పటినుంచి పిల్లలకి ద్రాక్షపండ్లను తినిపించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.



పుచ్చకాయ: వేసవి కాలంలో పుచ్చకాయ తినడం అన్ని విధాల శ్రేయస్కరం. దీనివల్ల శరీరంలో నీటి కొరత ఉండదు. తక్షణ శక్తి లభిస్తుంది. దీనిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి. ఎండాకాలం బయటికి వెళ్లే ముందు లేదా బయటి నుంచి వచ్చిన తర్వాత పుచ్చకాయ తీసుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు కీళ్లనొప్పులని తగ్గిస్తాయి.

ఉల్లి తీసుకోండి మళ్లీ మళ్లీ!

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని చిన్నప్పటి నుంచి విన్నదే. అయితే, దానివల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుంటే మాత్రం మనమే మరొకరికి చెబుతాం ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని... ఇంతకీ ఉల్లి ఏం మేలు చేస్తుందో, ఎలా చేస్తుందో తెలుసుకుందాం.

- మజ్జిగ లేదా పెరుగుతో కలిసిన ఉల్లి శరీరానికి మంచిచేసే ఎన్నో పోషకాలనిస్తుందని పరిశోధనలలో వెల్లడైంది.
- పచ్చిఉల్లిని ప్రతిరోజూ 50 గ్రాముల మోతాదులో తింటే షుగర్ అదుపులో ఉంటుందని పరిశోధనల్లో తెలిసింది. అంతేకాదు, ఉల్లిని తినడం వల్ల ఎలాంటి దుష్ఫలితాలూ ఉండవు. దీనిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య తగ్గి, హార్ట్‌స్ట్రోక్ ప్రమాదాలు తగ్గుతాయి.
- ఉల్లిగడ్డను సన్నని ముక్కలుగా కట్ చేసి ఆ ముక్కలను నీటిలో మరిగించి తాగుతుంటే మూత్రంలో మంట తగ్గుతుంది. ఉల్లిపాయను గుజ్జుగా చేసి 3 టేబుల్ స్పూన్ల వెనిగర్‌తో కలిపి తింటూ ఉంటే జీర్ణసంబంధిత సమస్యలు తగ్గి జీర్ణ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది.
- పచ్చి ఉల్లిపాయను రోజూ ఏదో ఒక రూపంలో తింటూ ఉంటే మహిళల్లో వచ్చే రుతుక్రమ సమస్య తగ్గిపోతుంది. పచ్చి ఉల్లిగడ్డ తినడం వల్ల బీపీ, హార్ట్ అటాక్, ఆస్తమా, అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, దగ్గు, నిద్రలేమి, స్థూలకాయం వంటి సమస్యలు రావు.



- రాత్రి పడుకునే ముందు పచ్చి ఉల్లిపాయ తింటే, వేసవిలో వడదెబ్బ ముప్పు తప్పుతుంది. దీనితోపాటు, పచ్చి ఉల్లిపాయలో వేసవి వేడి నుండి రక్షించే గుణాలు ఉన్నాయి.
- ఉల్లిపాయ రక్తాన్ని శుద్ధి చేస్తుంది. శరీరంలో ఉన్న విషాన్ని తొలగిస్తుంది. నిద్రకు ముందు పచ్చి ఉల్లిపాయ తినడం నిద్రలేమిని దూరం చేస్తుంది.
- జలుబు, కఫంలో ఉల్లిపాయ చాలా మేలు చేస్తుంది. ఉల్లి రసం, తేనె కలిపి తీసుకుంటే జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి త్వరగా తగ్గుతాయి. ఉల్లిపాయల్లో ఉండే విటమిన్ సి, కాల్షియం నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఉల్లి అనేకరకాల క్యాన్సర్ల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. దీనితోపాటు, ఉల్లిపాయ తినడం వల్ల కడుపు, పెద్దప్రేగు, రొమ్ము, ఊపిరితిత్తులు ప్రోస్టేట్ క్యాన్సర్ మొదలైనవి తగ్గుతాయి.
- ఉల్లి కీళ్లకు, గుండెకు మేలు చేస్తుంది. ఉల్లిగడ్డలు రక్తపోటు ను అదుపులో ఉంచుతాయి.
- బ్యాక్టీరియాల వల్ల కలిగే ఇన్ఫెక్షన్లు, డయేరియాల నుంచి కాపాడే ఆహారంలో ఉల్లిదే అగ్రస్థానం.. ఉల్లిలోని యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు అనేక వ్యాధుల నుంచి కాపాడతాయి. పచ్చిఉల్లిపాయను రోజు తింటే ఎముకల బలహీనతను అధిగమించవచ్చు. ఉల్లిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు జుట్టు సంబంధ సమస్యల్ని దూరం చేస్తాయి. ఉల్లి రసాన్ని మాడుకు పట్టించడం వల్ల జుట్టు రాలడంతోపాటు చుండ్రు సమస్యలు తగ్గుతాయి. జుట్టు పట్టు కుచ్చులా మెరుస్తుంది. జుట్టు పెరుగుతుంది.
- మూత్రపిండాలు, మూత్రాశయంలో రాళ్ల సమస్యతో బాధపడేవారికి ఉల్లి మంచి ఔషదం. ఉల్లిపాయలను సన్నగా తరిగి పెరుగులో కలిపి రోజూ ఉదయం తీసుకుంటే కిడ్నీలోని రాళ్లు కరిగిపోతాయి. తేనెటీగలు లేదా తేలు కుట్టినప్పుడుఉల్లి రసాన్ని రాస్తే సత్వర ఉపశమనం ఉంటుంది.

సినిమా


● ధనుష్

కుబేర ఫిక్స్

నాగార్జున, ధనుష్ హీరోలుగా ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందుతోన్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. కాగా మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రానికి 'కుబేర' టైటిల్‌ని ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేసింది చిత్రబృందం. అయితే ధనుష్ లుక్ టైటిల్‌కి భిన్నంగా ఉంది. ధనుష్‌ని చూస్తే పొడవాటి గెడ్డం.. చిరిగిన పాత దుస్తుల్లో సాదా సీదా వ్యక్తిలా కనిపిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటివరకూ నాగార్జున పాత్ర తాలూకు అప్‌డేట్ ఇవ్వలేదు మేకర్స్. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి అక్కినేని అభిమానుల్లో ఉంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి.


● విష్ణు మంచు

కన్నప్ప గురి

విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ మూవీలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'కన్నప్ప' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. విల్లు గురిపెట్టిన కన్నప్పగా విష్ణు మంచు లుక్ విడుదలైంది. ''ఒక ధైర్యవంతుడైన యోధుడు, శివుని భక్తుడైన కన్నప్ప కథను 'కన్నప్ప'గా తెరపైకి తీసుకొస్తున్నాం. ఇంత గొప్ప పాత్రను అంతే గొప్పగా పోషిస్తున్నారు విష్ణు మంచు. ఫస్ట్ లుక్ పోస్టర్ కన్నప్ప క్యారెక్టర్‌లోని డెప్త్, ఇంటెన్సిటీ చూపిస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మూవీ రూపొందుతుండగా అన్ని భాషల్లో రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వస్తోంది. 'కన్నప్ప' చిత్రం రెండో షెడ్యూల్ ప్రస్తుతం న్యూజిల్యాండ్‌లో జరుగుతోంది. అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● ప్రభాస్

పేరు భైరవ

మహా శివరాత్రి కానుకగా ప్రభాస్ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది 'కల్కి 2898 ఏడీ' చిత్ర యూనిట్. ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర పేరు భైరవి అని పేర్కొని, ఆయన లేటెస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ కీలక పాత్రధారులు. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. మహా శివరాత్రి సందర్భంగా భైరవ పాత్రని పరిచయం చేసి, కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా 'కల్కి 2898 ఏడీ' రూపొందుతోంది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరు వేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. అక్కడి అందమైన ప్రదేశాల్లో ప్రభాస్, దిశా పటానీలపై ఒక పాటను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు మేకర్స్.

నాకు నేనే కొత్తగా అనిపించాను - సుహాస్

''ప్రసన్న వదనం' సినిమా చాలా బావుంటుంది. ఈ మూవీలో నాకు నేనే కొత్తగా అనిపించాను. డైరెక్టర్ సుకుమార్‌గారి అసోసియేట్ అయిన అర్జున్‌గారు సినిమా చెప్పే విధానం సుకుమార్‌గారిలానే ఉంటుంది. 'ప్రసన్న వదనం' పక్కాగా బ్లాక్ బస్టర్ అయ్యే సినిమా.. అందులో ఎలాంటి అనుమానం లేదు'' అని సుహాస్ అన్నారు. అర్జున్ వైకే దర్శకత్వంలో సుహాస్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ, రాశీ సింగ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రసన్న వదనం'. జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా టీజర్ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''టీజర్ అద్భుతంగా ఉంది. కథలోని పాయింట్ అదిరిపోయింది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''మా గురువు సుకుమార్‌గారి వద్ద నేర్చుకున్న జ్ఞానం నాకు చాలా సహాయపడింది. 'ప్రసన్న వదనం' చాలా సూపర్‌గా వచ్చింది'' అన్నారు అర్జున్ వైకే. ''త్వరలోనే ఈ మూవీని విడుదల చేస్తాం'' అన్నారు జేఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి.


● రాశీ సింగ్, సుహాస్, పాయల్


● తమన్నా

దుష్టశక్తుల నుండి ఎలా కాపాడారు?

తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. హీరోయిన్ హెబ్బా పటేల్ లీడ్ రోల్‌లో నటించిన 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకి సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో డైరెక్టర్ సంపత్ నంది క్రియేటర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్‌లపై డి. మధు నిర్మిస్తున్నారు. శివరాత్రి కానుకగా 'ఓదెల 2' నుంచి శివ శక్తిగా తమన్నా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఒక చేతిలో దండకం, మరో చేతిలో డమరుకంతో నాగ సాధువు వేషంలో కనిపించారు తమన్నా. ''ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా కాపాడారు? అనే అంశంతో 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అత్యధిక బడ్జెట్‌తో బహు భాషల్లో ఈ మూవీ రూపొందుతోంది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కాశీలో జరుగుతోంది. శివ శక్తి పాత్ర కోసం తమన్నా పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్. ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

తెలుగులోనూ అంతే హిట్! - 'దిల్' రాజు

''ప్రేమలు' సినిమా మలయాళంలో ఫిబ్రవరి 9న విడుదలై సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఇది మలయాళ సినిమా అయినప్పటికీ 90 శాతం చిత్రీకరణ హైదరాబాద్‌లోనే జరిగింది. శుక్రవారం తెలుగులో విడుదలైన ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ స్పందన చూస్తుంటే మలయాళంలో ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలుగులోనూ అంతే హిట్ అవుతుందనిపిస్తోంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నస్లేన్ కె. గఫూర్, మాథ్యూ థామస్, మమిత బైజు, శ్యామ్ మోహన్ కీలక పాత్రల్లో గిరీష్ ఏడీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలు'. ఫాహద్ ఫాజిల్, దిలీష్ పోతన్, శ్యామ్ పుష్కరన్ నిర్మించిన ఈ మూవీ మలయాళంలో హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. శుక్రవారం ఈ మూవీ రిలీజైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో కార్తికేయ మాట్లాడుతూ– ''కుటుంబమంతా కలిసి చూసే చిత్రమిది. ఈమూవీ డైలాగ్స్‌ను ఏడెనిమిది రోజుల్లో రాసి డబ్బింగ్ కూడా పూర్తి చేసిన ఆదిత్యకి ధన్యవాదాలు'' అన్నారు.


● కార్తికేయ, 'దిల్' రాజు


● రుహానీ శర్మ

మనసుని హత్తుకునేలా...

రుహానీ శర్మ, సుహాస్, కార్తీక్ రత్నం, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీరంగ నీతులు'. వెంకటేశ్వర రావు బల్మూరి నిర్మించిన ఈ సినిమాని ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'శ్రీరంగ నీతులు'. యువతరం భావోద్వేగాలు, సహజంగా సాగే మాటలు, మనసుని హత్తుకునే సన్నివేశాలు ఉంటాయి. కొత్తదనంతో పాటు వాణిజ్య అంశాలతో రూపొందిన మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు. ''నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు, వినోదం.. ఇలా అన్ని అంశాల కలయికతో అందర్నీ అలరించేలా ఈ మూవీని తెరకెక్కించాడు దర్శకుడు'' అన్నారు వెంకటేశ్వరరావు బల్మూరి. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.

ప్రేమికుడు సిద్ధం


● నగ్మా, ప్రభుదేవా

ప్రేక్షకుల ముందుకు మరోసారి వచ్చేందుకు ప్రేమికుడు సిద్ధం అవుతున్నాడు. ప్రభుదేవా హీరోగా, నగ్మా హీరోయిన్‌గా రూపొందిన చిత్రం 'ప్రేమికుడు' (తమిళంలో 'కాదలన్'). శంకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీ 1994లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ మూవీలోని 'ముక్కాలా ముక్కాబులా', 'ఊర్వశి ఊర్వశి', 'ఓ చెలియా నా ప్రియ సఖియా', 'అందమైన ప్రేమరాణి'.. వంటి పాటలన్నీ యువతను ఉర్రూతలూగించాయి. క్లాసిక్ హిట్‌గా రూపొందిన 'ప్రేమికుడు' తెలుగులో రీ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. తెలుగు రీ రిలీజ్ హక్కులను నిర్మాతలు మురళీధర్ రెడ్డి, రమణ దక్కించుకున్నారు. సీఎల్ఎన్ మీడియా ద్వారా త్వరలో సినిమా రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. అతి త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాతలు పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
33	20
74,119	22,494

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు ముగింపు)

నాస్‌డాక్	16,209	▽	63
డోజోన్స్	38,885	▲	93
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,660	▽	33
డాక్స్	17,815	▽	28
షాంఘై	3,046	▽	19
నికాయ్	39,685	▲	90

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.44	82.42
£	బ్రిటన్ పౌండ్	104.30	106.85
€	యూరో	89.21	91.56
¥	జపాన్ ఎన్ (100)	55.14	56.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.49	53.57
S$	సింగపూర్ డాలర్	59.87	64.10
SAR	సౌదీ రియాల్	21.17	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	21.65	23.43
¥	చైనా యువాన్	10.37	12.37

టాటా సన్స్ మెగా ఐపీవో!

- అంచనా విలువ రూ. 11 లక్షల కోట్లు
- ఐపీవో పరిమాణం రూ. 55,000 కోట్లు!
- ఏడాదిన్నర కాలంలో లిస్టింగ్ తప్పనిసరి



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా సన్స్ పబ్లిక్ ఇష్యూకి రానున్నట్లు ఈక్విటీ మార్కెట్ రీసెర్చ్ సంస్థ స్పార్క్ క్యాపిటల్ పేర్కొంది. టాటా గ్రూప్ ఎన్‌బీఎఫ్‌సీ హోల్డింగ్ కంపెనీ విలువను రూ. 7.8 లక్షల కోట్లుగా మదింపు చేసింది. గ్రూప్ కంపెనీల ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం విలువ మదింపు చేయగా.. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రానున్న 18 నెలల్లో టాటా సన్స్ ఐపీవో చేపట్టనున్నట్లు తెలియజేసింది. అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ గతేడాది గుర్తింపునిచ్చిన నేపథ్యంలో 2025 సెప్టెంబర్‌కల్లా తప్పనిసరిగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కావలసి ఉన్నట్లు స్పార్క్ పేర్కొంది. ఇందుకు ఏడాదిన్నర కాలంలో పబ్లిక్ ఇష్యూ చేపట్టవలసి ఉంటుందని తెలియజేసింది. దీంతో సంక్లిష్టంగా ఉన్న గ్రూప్ హోల్డింగ్ నిర్మాణం సరళతరమయ్యేందుకు వీలుంటుందని అభిప్రాయపడింది. కాగా.. ఇటీవల వెలువడిన సమాచారం ప్రకారం కంపెనీ రూ. 11 లక్షల కోట్ల విలువను అందుకోగలదని వెల్లడించింది. వెరసి ఐపీవో పరిమాణం రూ. 55,000 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేసింది. టాటా సన్స్ హోల్డింగ్స్‌లో 80 శాతం మోనిటైజబుల్ కానప్పటికీ పునర్వ్యవస్థీకరణ కారణంగా కంపెనీ రీరేటింగ్‌ను సాధించే వీలున్నట్లు పేర్కొంది.

టీసీఎస్ బలిమి

టాటా సన్స్ విలువలో సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ అతిపెద్ద వాటాను ఆక్రమిస్తోంది. టీసీఎస్ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం టాటా సన్స్ వాటా విలువ రూ. 10 లక్షల కోట్లవరకూ ఉంటుంది. అన్‌లిస్టెడ్ కంపెనీలు, పెట్టుబడులుకాకుండా గ్రూప్‌లోని ఇతర లిస్టెడ్ దిగ్గజాలు టాటా మోటార్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్‌లో యాజమాన్య వాటాలు కలిగి ఉంది. టాటా కెమికల్స్‌లో అత్యధిక స్థాయి(కంపెనీ విలువలో 80 శాతం)లో యాజమాన్య హక్కులను కలిగి ఉంది. కాగా.. టాటా సన్స్‌లో దొరాబ్జీ టాటా ట్రస్ట్ 28 శాతం, రతన్ టాటా ట్రస్ట్ 24 శాతం, సైరస్ మిస్త్రీ కుటుంబ పెట్టుబడి సంస్థ(స్టెర్లింగ్ ఇన్వెస్ట్‌మెంట్) 9 శాతం, ఇతర ప్రమోటర్లు 14 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి.

విలువ జోడింపు

అన్‌లిస్టెడ్ పెట్టుబడులతో పలు మార్గాల ద్వారా టాటా సన్స్‌కు అదనపు విలువ జమకానున్నట్లు స్పార్క్ క్యాపిటల్ తెలియజేసింది. ఇటీవల సెమీకండక్టర్స్ తదితర ఆధునికతరం విభాగాలలోకి టాటా గ్రూప్ ప్రవేశించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. టాటా ఎలక్ట్రానిక్స్.. చిప్ తయారీ ప్రణాళికలు ప్రకటించిన విషయం విదితమే. టాటా టెక్నాలజీస్, టాటా మెటాలిక్స్, ర్యాలీస్ తదితర అనుబంధ సంస్థలను పేర్కొంది. ఫలితంగా టాటా గ్రూప్ మరో రూ. 1–1.5 లక్షల కోట్ల విలువను జోడించుకోనున్నట్లు అంచనా వేసింది. లిస్టెడ్, అన్ లిస్టెడ్ కంపెనీలు, ప్రిఫరెన్స్ షేర్లు, ఫండ్స్‌లో పెట్టుబడులను పరిగణించి విలువను మదింపు చేసింది.

మే 20 నుంచి స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ: తదుపరి స్పెక్ట్రం వేలం మే 20 నుంచి ప్రారంభం కానుంది. టెలికం కంపెనీలను ఆహ్వానిస్తూ టెలికమ్యూనికేషన్ శాఖ ఈ మేరకు నోటీసు విడుదల చేసింది. మొబైల్ ఫోన్ సేవల కోసం ఎనిమిది 5జీ స్పెక్ట్రమ్ బ్యాండ్స్‌ను రూ.96,317.65 కోట్ల బేస్ ధరకు ప్రభుత్వం వేలం వేయనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
9-3-2024	
విశాఖ	475–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
8-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469–00
వరంగల్	471–00
రిటైల్ ధర	5.30

ఎయిరిండియా- విస్తారా విలీనం వేగం!



న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజాలు ఎయిరిండియా, విస్తారా విలీన ప్రక్రియ వేగమందుకోనుంది. ఇందుకు సింగపూర్ నియంత్రణ సంస్థ కాంపిటీషన్ అండ్ కన్జూమర్ కమిషన్(సీసీసీఎస్) షరతులతో కూడిన అనుమతులు ఇచ్చినట్లు ఎయిరిండియా చీఫ్ క్యాంప్‌బెల్ విల్సన్ తాజాగా పేర్కొన్నారు. దీంతో రెండు సంస్థలూ తమ షెడ్యూళ్లు, కాంట్రాక్టులు తదితర సవివర సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు అనుమతి లభించినట్లు తెలియజేశారు. 2022 నవంబర్‌లో ఎయిరిండియాలో విస్తారా విలీన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఎయిరిండియాలో 25.1 శాతం వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ సొంతం చేసుకోనుంది. టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ కలసి సంయుక్త సంస్థ(జేవీ)గా విస్తారాను ఏర్పాటు చేసిన విషయం విదితమే.

ఈక్విటీ ఎంఎఫ్‌లకు ఫిబ్రవరిలో రూ.26,866 కోట్లు



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లోకి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.26,866 కోట్ల పెట్టుబడులు వచ్చాయని భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) గణాంకాలు వెల్లడించాయి. ఒక నెలలో ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం గడిచిన 23 ఏళ్లలో గరిష్టం. ఈ జనవరిలో వెల్లువెత్తిన రూ.21,721 కోట్లతో పోలిస్తే కూడా 23% అధికం. కొత్త ఫండ్ల ఆవిష్కరణ, థీమాటిక్/సెక్టోరియల్ ఫండ్లపై ఆసక్తి ఇందుకు ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) పథకాల్లోకి కూడా ఫిబ్రవరి జీవితకాల గరిష్టం రూ.19,186 కోట్లకు చేరాయి. జనవరి ఇవి రూ.18,838 కోట్లుగా ఉన్నాయి.




ప్రీమియమైజేషన్ దిశగా షావోమి..

రూ.లక్ష ఖరీదైన షావోమి 14 సిరీస్ విడుదల

ముంబై: చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షావోమి భారత మార్కెట్లో తన వ్యాపార వ్యూహాన్ని మార్చింది. ప్రీమియమైజేషన్ (డబ్బున్న కస్టమర్లు అత్యంత ఖరీదైన ఉత్పత్తుల వైపు మొగ్గుచూపడం) దిశగా అడుగులు వేస్తూ తన పోర్ట్‌ఫోలియోలోనే అత్యంత ఖరీదైన షావోమి 14 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఇందులో ప్రారంభ స్థాయి షావోమి 14 స్మార్ట్ ఫోన్ ధర రూ.59,999 కాగా, షావోమి 14 అల్ట్రా స్మార్ట్ ఫోన్ రూ.99,999 ఉంది.

ట్రేడింగ్‌లో మహిళల హవా..

- సానుకూలంగా తక్కువ బ్రోకరేజ్ ఫీజులు, ట్రేడింగ్ వేళలు
- యస్ సెక్యూరిటీస్ ఖాతాల్లో 75 శాతం వృద్ధి
- రెలిగేర్ బ్రోకింగ్ యాక్టివ్ ట్రేడర్లలో 30 శాతం మహిళలే



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అన్ని రంగాలతో పాటు ట్రేడింగ్‌లోనూ మహిళలు దూసుకెడుతున్నారు. బ్రోకరేజీ ఫీజులు తగ్గడం, ట్రేడింగ్ వేళలు కొంత అనువుగా ఉండటం వంటి అంశాలు ఇందుకు కారణంగా ఉంటున్నాయి. ఖాతాలు తెరవడమే కాకుండా మహిళలు ట్రేడింగ్‌లో చురుగ్గా పాలుపంచుకుంటున్నారని యస్ సెక్యూరిటీస్ ఒక నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 31 నాటికి మహిళా ఇన్వెస్టర్ల అకౌంట్లు వార్షికంగా 75 శాతం పెరిగినట్లు తెలిపింది. అలాగే, మరో బ్రోకరేజ్ సంస్థ రెలిగేర్ బ్రోకింగ్ ప్లాట్‌ఫాంలోని యాక్టివ్ ట్రేడర్లలో మహిళలు 30 శాతం ఉన్నారు. ఇక ఇన్వెస్ట్‌మెంట్‌పరంగా చూస్తే గతేడాది తమ ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకున్న కొత్త ఇన్వెస్టర్లలో 41 శాతం మంది మహిళలే ఉన్నారని టెక్ ఆధారిత ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఫిన్‌ఎడ్జ్ తెలిపింది. రియల్ ఎస్టేట్‌లాగా కాకుండా చాలా తక్కువ మొత్తాన్నైనా షేర్లలో ఇన్వెస్ట్ చేసే వీలుండటం కూడా మహిళలు స్టాక్ మార్కెట్ వైపు మొగ్గు చూపుతుండటానికి కారణం కావచ్చన్నది విశ్లేషణ.

ఆర్థిక స్వాతంత్ర్యంపై అవగాహన..

కచ్చితంగా నిర్దిష్ట ప్రదేశానికే పరిమితం కాకుండా ఎక్కడి నుంచైనా ట్రేడింగ్ చేసే సౌలభ్యం ఉండటం, వేళలు కూడా అనుకూలంగా ఉండటం వల్ల మహిళలు కూడా ట్రేడింగ్‌ను ఎంచుకుంటున్నారని ఆర్థిక అక్షరాస్యత కన్సల్టెంట్, ఫుల్‌–టైమ్ ట్రేడర్ అయిన ప్రీతి చాబ్రా తెలిపారు. మహిళా ట్రేడర్లు పెరగడానికి గల కారణాల్లో ఆర్థిక స్వాతంత్ర్యంపై అవగాహన మెరుగుపడుతుండటం కూడా ఒకటని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఇంటి నుంచే ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలను కల్పించే ట్రేడింగ్ ఆకర్షణీయంగా ఉంటోందని ఉమాదేవి అనే మరో ట్రేడర్ తెలిపారు. ట్రేడింగ్ అంత సులువైనదేమీ కాకపోయినప్పటికీ మార్కెట్ల గురించి అవగాహన పెంచుకుంటూ, రిస్కు మేనేజ్‌మెంటును అర్థం చేసుకుంటూ మహిళలు ఇప్పుడిప్పుడే ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ వైపు అడుగులు వేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

మహిళా ఖాతాదార్లకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆఫర్లు..

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేట్ సంస్థలు పలు కార్యక్రమాలు ప్రకటించాయి. ఈ ఏడాది జూన్ 30 వరకు మహిళా శక్తి సేవింగ్స్ ఖాతాలు లేదా ఉమెన్ పవర్ కరెంట్ అకౌంట్లు తీసుకున్నా, డిసెంబర్ 31లోగా రుణాలు తీసుకున్న మహిళలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తెలిపింది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు తక్కువ వడ్డీ రేటు, ప్రాసెసింగ్ చార్జీలు పూర్తిగా మినహాయింపు, వార్షికంగా సేఫ్ డిపాజిట్ లాకర్ చార్జీలపై 50 శాతం డిస్కౌంటు వంటివి వీటిలో ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెరియర్‌లో వివిధ దశల్లో ఉన్న మహిళా ఉద్యోగుల కోసం రీకిండిల్, ర్యాంప్ బ్యాక్, యామ్ వాయిస్ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు అమెజాన్ వెల్లడించింది. మరోవైపు, వేతనాల్లో సమానత, ఉద్యోగం–వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యతను ప్రోత్సహించే విధానాలు అమలు చేస్తున్నట్లు ఐకియా తెలిపింది. మహిళా ఎంట్రప్రెన్యూర్స్‌కు తోడ్పాటు అందించేందుకు హర్‌స్టోర్ అనే వేదికను ఏర్పాటు చేసినట్లు బ్రిటానియా పేర్కొంది. హెచ్‌సీసీబీ 25,000 మంది మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ కల్పించినట్లు తెలిపింది.



న్యూజిలాండ్ 162... ఆస్ట్రేలియా 124/4

క్రైస్ట్‌చర్చ్‌లో శుక్రవారం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజే 14 వికెట్లు నేలకూలాయి. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 162 పరుగులకే ఆలౌటైంది. టామ్ లాథమ్ (38)దే అత్యధిక స్కోరు. ఒక దశలో కివీస్ 107/8తో నిలవగా తొమ్మిదో వికెట్‌కు 55 పరుగులు జోడించి హెన్రీ (29), సౌతీ (26) ఆదుకున్నారు. హాజిల్‌వుడ్ (5/31) ఐదు వికెట్లతో కివీస్‌ను కుప్పకూల్చగా...మిచెల్ స్టార్క్ (3/59) కెరీర్‌లో 357 వికెట్లతో ఆసీస్ దిగ్గజం డెన్నిస్ లిల్లీ (354)ను అధిగమించాడు. అనంతరం ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 4 వికెట్లకు 124 పరుగులు చేసి మరో 38 పరుగులు వెనుకంజలో ఉంది. స్మిత్ (11), ఖ్వాజా (16), గ్రీన్ (25), హెడ్ (21) వెనుదిరగ్గా... లబుషేన్ (45 బ్యాటింగ్) ఆసీస్‌ను నడిపిస్తుండగా, మ్యాట్ హెన్రీ 3 వికెట్లు పడగొట్టాడు. కివీస్ ఆటగాళ్లు కేన్ విలియమ్సన్, టిమ్ సౌతీలకు ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం.

ఢిల్లీని ఓడించిన దీప్తి

- పరుగు తేడాతో యూపీ అనూహ్య విజయం
- మహిళల ప్రీమియర్ లీగ్



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దీప్తి

న్యూఢిల్లీ: మహిళా దినోత్సవం రోజున మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఉత్కంఠ రేపిన మ్యాచ్ జరిగింది. గెలుపు దిశగా పయనిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్‌ను దీప్తిశర్మ (4/19) అద్భుత బౌలింగ్‌తో ఓడించింది. ఢిల్లీ లక్ష్యం 138 పరుగులు కాగా... ఒక దశలో 18 ఓవర్లలో 124/4 స్కోరు వద్ద విజయానికి 12 బంతుల్లో 15 పరుగుల దూరంలో ఉంది. అయితే 11 బంతుల్లో 6 వికెట్లను కోల్పోయిన ఢిల్లీ గెలుపు వాకిట బొక్కబోర్లా పడింది. యూపీ వారియర్స్ ఆఖరి దాకా పోరాడి పరుగు తేడాతో గెలిచింది. 19వ ఓవర్ వేసిన దీప్తి 3 వికెట్లు తీసి 5 పరుగులే ఇవ్వడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆమె శ్రమను నీరుగార్చకుండా చివరి ఓవర్లో బౌలింగ్‌కు దిగిన గ్రేస్ హారిస్ (2/8) ఐదు బంతులేసి రెండు వికెట్లు తీసింది. దీంతో పాటు మరో రనౌట్ కూడా చేసిన యూపీ విజయాన్నందుకుంది. ఉత్కంఠ రేపిన ఈ పోరు అందర్నీ మునివేళ్లపై నిలబెట్టింది. మొదట యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. దీప్తిశర్మ (48 బంతుల్లో 59; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో మళ్లీ ఒంటరి పోరాటం చేసింది. క్యాపిటల్స్ బౌలర్లు రాధా యాదవ్, టిటస్ సాధు చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19.5 ఓవర్లలో 137 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ (46 బంతుల్లో 60; 12 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, తర్వాత వచ్చిన వారు చెత్త షాట్లతో ఓటమిని మూల్యంగా చెల్లించారు. జెమీమా (17), షఫాలీ (15), అలైస్ క్యాప్సీ (15) రెండంకెల స్కోర్లు చేశారంతే! ఎవరూ క్రీజులో నిలిచే ప్రయత్నం చేయలేదు. నేడు జరిగే మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడుతుంది.

జోరు కొనసాగింది



ధర్మశాల

టెస్టు మ్యాచ్ రెండో రోజు ఊహించినట్లుగానే అంచనాలకు అనుగుణంగా సాగింది...పటిష్టమైన భారత బ్యాటింగ్ లైనప్ ఇంగ్లండ్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శుక్రవారం ఆటలో 338 పరుగులు రాబట్టింది...రోహిత్, గిల్ సెంచరీలు పూర్తి చేసుకొని సగర్వంగా నిలవగా...యువ ఆటగాళ్లు పడిక్కల్, సర్ఫ రాజ్ భారీ భాగస్వామ్యంతో తమ వంతు పాత్ర పోషించారు. ఒక దశలో ఒక పరుగు తేడాతో మూడు వికెట్లు కోల్పోయినా దాని ప్రభావం జట్టుపై పడలేదు... ఫలితంగా ఇప్పటికే 255 పరుగుల ఆధిక్యంలో నిలిచిన టీమిండియా విజయానికి కావాల్సిన సరంజామాను సిద్ధం చేసుకుంది. సుదీర్ఘ భారత పర్యటనలో తమ చివరి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్లను ఎదుర్కొని ఇంగ్లండ్ ఏమాత్రం పోరాటపటిమ కనబరుస్తుందనేది చూడాలి.

రోహిత్   గిల్

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 473/8
- రోహిత్, గిల్ సెంచరీలు
- ప్రస్తుత ఆధిక్యం 255 పరుగులు
- రాణించిన పడిక్కల్, సర్ఫరాజ్

ధర్మశాల: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను 4–1తో ముగించే దిశగా భారత జట్టు వేగంగా దూసుకుపోతోంది. మ్యాచ్ రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 120 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 473 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (150 బంతుల్లో 110; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), రోహిత్ శర్మ (162 బంతుల్లో 103; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 171 పరుగులు జోడించారు. దేవ్‌దత్ పడిక్కల్ (103 బంతుల్లో 65; 10 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (60 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) కూడా అర్ధ సెంచరీలు చేశారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 97 పరుగులు జత చేయడం విశేషం.

శతకాలు పూర్తి...

రెండో రోజు ఆటను రోహిత్, గిల్ బౌండరీలతో దూకుడుగా మొదలు పెట్టారు. వీరిని నిలువరించేందుకు ఇంగ్లండ్ బౌలర్లు చేసిన ప్రయత్నం విఫలమైంది. 68 పరుగుల వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను క్రాలీ వదిలేయడం భారత్‌కు కలిసి రాగా, 64 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ముఖ్యంగా వుడ్, బషీర్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు ధారాళంగా పరుగులు రాబట్టారు. ఇదే జోరును కొనసాగిస్తూ మూడు బంతుల వ్యవధిలో ఇద్దరూ శతకాలు పూర్తి చేసుకున్నారు. 154 బంతుల్లో రోహిత్ 12వ టెస్టు సెంచరీ రాగా, 137 బంతుల్లో గిల్ నాలుగో సెంచరీని అందుకున్నాడు. తొలి సెషన్‌లో భారత్ 30 ఓవర్లలో 129 పరుగులు చేయగా, ఇంగ్లండ్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయింది. అయితే లంచ్ తర్వాత వరుస ఓవర్లలో వీరిద్దరు వెనుదిరిగారు. గత జూన్ తర్వాత తొలి సారి బౌలింగ్‌కు దిగిన స్టోక్స్ తన మొదటి బంతికే రోహిత్‌ను బౌల్డ్ చేయగా, తర్వాతి ఓవర్లో గిల్‌ను మరో చక్కటి బంతితో అండర్సన్ బౌల్డ్ చేశాడు.



సర్ఫరాజ్

కుర్రాళ్ల జోరు...

మూడో వికెట్‌గా గిల్ అవుటైన సమయంలో భారత్ ఆధిక్యం 61 పరుగులు మాత్రమే! రెండు కీలక వికెట్లు తీసి ఒత్తిడి పెంచేందుకు ఇంగ్లండ్ సిద్ధం కాగా...భారత యువ బ్యాటర్లు పడిక్కల్, సర్ఫరాజ్ దానిని సమర్థంగా అడ్డుకున్నారు. మూడో టెస్టు ఆడుతున్న సర్ఫరాజ్, అరంగేట్ర బ్యాటర్ పడిక్కల్ భాగస్వామ్యం ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లింది. అండర్సన్ ఓవర్లో మూడు ఫోర్లతో ధాటిని చూపిన పడిక్కల్ తొలి 30 పరుగుల్లో 7 ఫోర్లు ఉండటం విశేషం. మరో వైపు ఆరంభంలో జాగ్రత్తగా ఆడిన సర్ఫరాజ్ ఆ తర్వాత జోరు పెంచాడు. వుడ్ బౌలింగ్‌లో అతను కొట్టిన 3 ఫోర్లు, సిక్స్ హైలైట్‌గా నిలిచాయి. బషీర్ ఓవర్లో 2 ఫోర్లతో సర్ఫరాజ్ 55 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. రెండో సెషన్‌లో భారత్ 24 ఓవర్లలో 112 పరుగులు రాబట్టింది. అయితే టీ విరామం తర్వాత తొలి బంతికే సర్ఫరాజ్ వెనుదిరిగాడు. అనంతరం 83 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్న పడిక్కల్ కూడా కొద్దిసేపటికే పెవిలియన్ చేరాడు. జురేల్ (15) ప్రభావం చూపలేకపోగా...హార్ట్‌లీ ఒకే ఓవర్లో జడేజా (15), అశ్విన్ (0)లను వెనక్కి పంపాడు. ఈ దశలో కుల్దీప్ (27 బ్యాటింగ్) పట్టుదల కనబర్చగా, బుమ్రా (19 బ్యాటింగ్) అండగా నిలిచాడు. వీరిద్దరు 18 ఓవర్ల పాటు మరో వికెట్ పడకుండా ఆటను ముగించారు.



పడిక్కల్

స్కోరు వివరాలు:

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 218; భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బి) స్టోక్స్ 103; గిల్ (బి) అండర్సన్ 110; పడిక్కల్ (బి) బషీర్ 65; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) బషీర్ 56; జడేజా (ఎల్బీ) (బి) హార్ట్‌లీ 15; జురేల్ (సి) డకెట్ (బి) బషీర్ 15; అశ్విన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 27; బుమ్రా (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (120 ఓవర్లలో 8 వికెట్లకు) 473. **వికెట్ల పతనం:** 1–104, 2–275, 3–279, 4–376, 5–403, 6–427, 7–427, 8–428. **బౌలింగ్:** అండర్సన్ 14–1–59–1, వుడ్ 15–1–89–0, హార్ట్‌లీ 39–3–126–2, బషీర్ 44–5–170–4, స్టోక్స్ 5–1–17–1, రూట్ 3–0–8–0.

సింధు పరాజయం

సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం ● ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లకు క్వార్టర్ ఫైనల్లో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రెండు వరుస ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధుకు క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 24–22, 17–21, 18–21తో ఒలింపిక్ చాంపియన్ చెన్ యూ ఫె (చైనా) చేతిలో పోరాడి ఓడింది. గంటా 32 నిమిషాల పాటు భారత స్టార్ తుదికంటా పోరాడినా ఫలితం దక్కలేదు. ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యూ ఫెకు దీటుగా కోర్టులో శ్రమించడంతో ర్యాలీలు సుదీర్ఘంగా సాగాయి. దీంతో తొలిగేమ్ హోరాహోరీగా సాగింది. 22–22 వద్ద సింధు క్రాస్‌కోర్టు షాట్లతో విరుచుకుపడి తొలిగేమ్ నెగ్గింది. తర్వాత రెండో గేమ్‌లో సర్వీస్ వైఫల్యంతో వెనుకబడిన సింధు గేమ్‌ను కోల్పోయింది. నిర్ణాయక మూడో గేమ్‌లోనూ ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. కానీ చైనా ప్రత్యర్థి పైచేయి సాధించడంతో మ్యాచ్‌లో ఓటమి తప్పలేదు. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్‌సీడ్ సాత్విక్–చిరాగ్ ద్వయం 21–19, 21–13తో థాయ్‌లాండ్‌కు చెందిన సుపక్ జొమ్‌కొ–కిటినుపాంగ్ కెద్రెన్ జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా సెమీస్ చేరుకున్నాడు. క్వార్టర్స్ మ్యాచ్‌లో లక్ష్య 19–21, 21–15, 21–13 స్కోరుతో లో కీన్ యూ (సింగపూర్)ను ఓడించాడు.

తొలి రౌండ్‌లోనే నగాల్ ఓటమి

ఇండియన్ వెల్స్: ఏటీపీ మాస్టర్స్–1000 టోర్నీ ఇండియన్ వెల్స్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ఆటగాడు సుమిత్ నగాల్‌కు తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. కెనడాకు చెందిన మిలోస్ రావ్‌నిక్ 6–3, 6–2తో ప్రపంచ 101వ ర్యాంకర్ నగాల్‌ను వరుస సెట్లలో ఓడించాడు. గంటా 28 నిమిషాల పాటు జరిగిన ఈ సమరంలో మాజీ వరల్డ్ నంబర్ 3 రావ్‌నిక్ మెరుగైన ఆటతీరు కనబరిచాడు. మూడు బ్రేక్ పాయింట్లు సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించాడు. ఈ టోర్నీలో క్వాలిఫయింగ్‌లోనే నగాల్ ఓడినప్పటికీ చివరి నిమిషంలో స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ వైదొలగడంతో 'లక్కీ లూజర్'గా సుమిత్ నగాల్‌కు మెయిన్ 'డ్రా' అవకాశం లభించింది.

క్వార్టర్స్‌లో ఓడిన సహజ

నాగ్‌పూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్‌- డబ్ల్యూ35) టోర్నమెంట్‌లో సహజ యామలపల్లి పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సింగిల్స్‌లో ఐదో సీడ్ సహజ 4–6, 1–6 స్కోరుతో అన్‌సీడెడ్ డాయెన్ బ్యాక్ (కొరియా) చేతిలో ఓటమిపాలైంది. మరో వైపు శ్రీవల్లి రష్మిక భమిడిపాటి – వైదేహి చౌదరి ద్వయం పోరాటం సెమీ ఫైనల్లో ముగిసింది. మహిళల డబుల్స్ సెమీస్‌లో నాలుగో సీడ్ జస్టినా మికుల్‌స్కైట్ (లిథువేనియా) – యెన్‌వూ కూ (కొరియా) జోడి 6–1, 2–6, 10–8 తేడాతో రష్మిక – వైదేహి జంటపై విజయం సాధించింది.

క్లుప్తంగా...

ప్రజలను మోసం చేసేందుకే అపవిత్ర కలయికలు

చంద్రబాబుపై ఎంపీ మోపిదేవి ధ్వజం



రేపల్లెరూరల్: రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకే చంద్రబాబు అపవిత్ర కలయికతో ఎన్నికలకు సిద్ధమౌతున్నాడని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు ధ్వజమెత్తారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో పేదలకు మంచి జరగడాన్ని చంద్రబాబు అండ్ కో బృంద సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఇప్పటికే జనసేన, కమ్యూనిస్టు పార్టీలతో కుమ్మక్కైన బాబు బీజేపీతో పొత్తు కోసం తాపత్రయపడుతున్నారన్నారు. పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేలా వివిధ సంక్షేమ పథకాల ద్వారా అవినీతికి తావునివ్వకుండా రూ.2.56లక్షల కోట్లును నేరుగా ప్రజల ఖాతాలలోకే జమ చేసిన ఘనత దేశ చరిత్రలో ఒక జగనన్నకే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో చంద్రబాబు ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. నేడు ష్యూరిటీ గ్యారెంటీ పేరుతో ఇస్తున్న హామీలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఈ నెల 10న మేదరమెట్లలో నిర్వహిస్తున్న 'సిద్ధం' సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిని మార్చండి

బి.కొత్తకోటలో శంకర్ వర్గీయుల రాస్తారోకో



బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని మార్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బి.కొత్తకోటలో మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు రాస్తారోకో నిర్వహించారు. శంకర్‌కు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేసిన నాయకులు కొత్త అభ్యర్థి ఎంపికను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన రెండు నెలలకే టికెట్ ఇవ్వడానికి ఉన్న అర్హతలేమిటని నిలదీశారు. చంద్రబాబు, లోకేశ్‌ను తప్పుదోవ పట్టించిన నాయకులతో తాము కలిసి పని చేయలేమని స్పష్టం చేశారు. ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య పరంగా మొదటిస్థానంలో ఉన్న బీసీలు పార్టీకి దూరమై ఓటమి తప్పదని హెచ్చరించారు. నేతలు కుడుం శ్రీనివాసులు, పెద్దమండ్యం మండల కన్వీనర్ జిట్టా వెంకటరమణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుకుమార్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర, సురేంద్రనాయుడు, పీహెచ్‌సీ కమిటీ మాజీ చైర్మన్ కనకంటి ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

జగనన్న సీఎం కాకపోతే వలంటీర్లను తొలగిస్తారు

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి. పక్కన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు(చిత్తూరు జిల్లా): గ్రామ స్వరాజ్యం సాధించాలని మహాత్మా గాంధీ కన్నకలలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి వలంటీర్ల ద్వారా ఎవరి సిఫారసు లేకుండానే సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందిస్తున్నారని, సుపరిపాలన సాగిస్తున్నారని రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి చెప్పారు. పుంగనూరులో రూ.2 కోట్లతో నిర్మించిన జెడ్పీ గెస్ట్‌హౌస్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని 1,200 మంది పేదలకు భూములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా లేకపోతే ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమం ఆగిపోతుందన్నారు. సచివాలయాలను మూసివేసి జన్మభూమి కమిటీల కార్యాలయాలుగా మార్చేస్తారని, వలంటీర్లను తొలగిస్తారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు తప్పుడు హామీలతో మళ్లీ మేనిఫెస్టోను తయారుచేసి పంచుతారని, వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మాటలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, కొండవీటి నాగభూషణం పాల్గొన్నారు.

బాబు జిమ్మిక్కులు నమ్మం

టీడీపీ బీసీ డిక్లరేషన్‌పై బీసీ నేతల మండిపాటు.. సీఎం జగన్‌ను చూసైనా నేర్చుకోవాలని హితవు



- బీసీల మేలు కోరిన జగన్ పాలన కొనసాగాలని స్పష్టీకరణ
- బాబు–పవన్ గారడీ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

సాక్షి, అమరావతి: ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటక బోడి మల్లన్న అన్నట్లుగా.. ఎన్నికల్లో అవకాశవాదంతో వ్యవహరించే చంద్రబాబును నమ్మేది లేదని బీసీలు కుండబద్దలు కొడుతున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి బీసీలే టీడీపీకి వెన్నెముక అని వారిని మభ్యపెట్టి ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత తమను కరివేపాకులా తీసిపారేస్తున్నాడని మండిపడుతున్నారు. 2014 ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే తమను మోసగించిన తీరును బీసీ నేతలు గుర్తుచేస్తున్నారు. అలాగే, 2019 ఎన్నికల ముందు కూడా బీసీలకు 119 హామీలను ఇచ్చిన చంద్రబాబు ఐదేళ్లలో ఒక్క హామీనీ సరిగ్గా అమలుచేయలేదన్నారు. ఇక 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన బీసీలను 'ఏం తమాషాలు చేస్తున్నారా.. పిచ్చాటలు ఆడారంటే మీ తోకలు కత్తిరిస్తా.. మీ తాట తీస్తా'.. అంటూ వేలు చూపించి బెదిరించడంతోపాటు మత్స్యకారులపై కేసులు పెట్టిన చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోయేదిలేదని బీసీ నేతలు స్పష్టంచేస్తున్నారు. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు కనీసం సగం సీట్లు కూడా ఇవ్వకుండా దగా చేసిన తీరును వారు మరిచిపోలేదు. ఏడాదికి రూ.10వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.50వేల కోట్లు బీసీ సబ్‌ప్లాన్‌కు కేటాయిస్తానని అప్పట్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిధుల కేటాయింపులో దగా చేయడమే కాకుండా పదవుల కేటాయింపులోను చంద్రబాబు బీసీలను తీవ్రమోసం చేశాడని వాపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వెనుకబడిన తరగతులను మరోమారు బురిడీ కొట్టించేందుకు ఆయన చేస్తున్న జిమ్మిక్కులను నమ్మేదిలేదని తెగేసి చెబుతున్నారు.

జగన్‌ను చూసి బాబు నేర్చుకోవాలి



రాజకీయాల్లో 42 ఏళ్ల అనుభవం, 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు యువకుడైన సీఎం జగన్‌ను చూసి చాలా నేర్చుకోవాలి. అధికారంలో ఉన్న రాజకీయ నాయకుడికి ప్రజలను ఆదుకుని అండగా నిలవాలనే మనస్సు ఉండాలి. అటువంటి మంచి మనస్సు జగన్‌కు ఉంది. చంద్రబాబుకు పేదల గురించి ఆలోచించే మనస్సు ఏ కోశానా లేదు. చంద్రబాబు సంక్షేమ పథకాలకు తన సొంత సొమ్ము ఇచ్చినట్లు ఫీలవుతాడు. అలాంటి చంద్రబాబు ఇప్పుడు బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు మేలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదం. 2014లో చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఎంతమేరకు అమలు చేశారో? గమనిస్తే చాలు ఆయన చిత్తశుద్ధి తెలిసిపోతుంది. తాజాగా టీడీపీ ప్రకటించిన డిక్లరేషన్‌లో ఎట్రాసిటీ యాక్ట్ తప్ప మిగతావన్నీ ప్రస్తుతం సీఎం జగన్ అమలుచేస్తున్నవే. సామాజిక న్యాయం అమలులో సీఎం జగన్‌కు ఎవరూ సాటిరారు.

– డాక్టర్ ఎస్వీ రావు, జాతీయ అధ్యక్షుడు, బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్

నయవంచకులు బాబు.. పవన్‌లను నమ్మం



చంద్రబాబు, పవన్‌లు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ నేతి బీర చందంగా ఉంది. గత డిక్లరేషన్‌నే అటకెక్కించిన నయవంచక బాబు, పవన్‌ఇప్పుడు మళ్లీ డిక్లరేషన్ అంటే బీసీలు నమ్మరు. వారి పట్ల బాబు, పవన్‌లకు చిత్తశుద్ధిలేదని తాజాగా ప్రకటించిన ఎమ్మెల్యే టికెట్లు తేటతెల్లం చేస్తున్నాయి. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలు, ఆలోచనలను అమలుచేస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్. గతంలో బీసీ డిక్లరేషన్‌లో చెప్పింది చెప్పినట్లుగా అమలుచేసి చూపించిన సీఎం జగన్ రాష్ట్రంలోని బీసీలను వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 33% రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు వేయించి బాబు ద్రోహం చేస్తే.. అంతకంటే ఎక్కువ పదవులు దక్కేలా చేసిన సీఎం జగన్ బీసీల పక్షపాతిగా మన్ననలు అందుకున్నారు. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటుచేశారు. 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వారి ఉన్నతికి సీఎం జగన్ చర్యలు చేపట్టారు.

– చింతపల్లి గురుప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ కులాల జేఏసీ

బాబు గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం లేదు

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి
- సచివాలయాలను జన్మభూమి కార్యాలయాలుగా మారుస్తారు
- నాడు ఓటుకు కోట్లు.. నేడు నోటుకు సీటు



శ్రీరంగరాజపురం (చిత్తూరు జిల్లా): చంద్రబాబు గ్రామంలో ఇప్పటికీ దళితులకు ఆలయ ప్రవేశం లేదని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. శ్రీరంగరాజపురంలో శుక్రవారం నారాయణస్వామి విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా చంద్రబాబు అండ్ కోకు కులపిచ్చి పోలేదన్నారు. బాబు సొంత గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం కల్పించకపోవడం దారుణమన్నారు. ఆయనకు మద్దతు తెలిపే పవన్‌కళ్యాణ్‌కు ఎంత కులపిచ్చి ఉందో ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మోసాల మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని, వాటిని నమ్మి ప్రజలు మోసపోకండని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో, చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలు పోల్చి చూసుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తీసివేసి సచివాలయాలను జన్మభూమి కార్యాలయాలుగా మారుస్తారని చెప్పారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికి పారిపోయి కరకట్టకు వచ్చాడని, నేడు అదే కరకట్టపై నోటు ఇస్తేనే సీటు ఇస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కనుసన్నుల్లోనే పీకేటీం, ప్రశాంత్ కిషోర్ పనిచేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంను చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నారాయణస్వామి స్పష్టం చేశారు.

రెప్పవాలితే చాలు!

రహదారులపై మృత్యుఘోష



- డ్రైవర్లు, ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న నిద్రమత్తు
- హైవేలు, కీలక మార్గాల్లో దీనివల్లే 40% ప్రమాదాలు
- సుదీర్ఘ ప్రయాణాలు, విశ్రాంతి లేకపోవడంతో అలసట
- ప్రమాదాల నివారణకు సాగుతున్న పరిశోధనలు

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు పై కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో అల్వాల్ వెంకటాపురానికి చెందిన నవ దంపతులు బాల కిరణ్, కావ్య సహా ఐదుగురు.. ఉత్తరాంధ్రలోని కాశీబుగ్గ వద్ద చైతన్యపురికి చెందిన వేదవతి, వెంకటయ్య.. ఇలా ఎందరో డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రాణాలు కోల్పోయారు. సుదీర్ఘ ప్రయాణం, తగినంత విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం వల్ల నిద్ర మత్తులోకి జారుకుంటున్న డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఏటా లక్షలాది మంది డ్రైవర్లు, ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 40 శాతం నిద్రమత్తు వల్లే చోటు చేసుకుంటున్నాయని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా డ్రైవర్ల పని వేళలకు సంబంధించిన చట్టం అమలు కావడంతో పాటు సాంకేతికంగానూ అనేక మార్పులు వస్తేనే ఈ ప్రమాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అలసటే ప్రధాన కారణం

దేశ వ్యాప్తంగా ఉన్న జాతీయ, రాష్ట్ర రహదారులు..అలాగే హైదరాబాద్‌లోని పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే, నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ వంటి కీలక రోడ్లపై ప్రయాణించే వాహనాల్లో అత్యధికం ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలకు చెందినవే అయినప్పటికీ.. వ్యక్తిగత రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు సైతం పెద్ద సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం సుదూర ప్రాంతాల నుంచి గమ్య స్థానాలకు సరుకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లకు అవసరమైన విశ్రాంతి ఉండదు. ఎన్ని ట్రిప్పులు ఎక్కువ వేయిస్తే అంత ఎక్కువ మొత్తం సంపాదించవచ్చనే ధోరణితో యాజమాన్యాలు పని చేస్తుంటాయి. ఎప్పటికప్పుడు డ్రైవర్లపై ఒత్తిడి పెంచుతుంటాయి. రిలీవర్ రాకపోవడం, ఇతరత్రా కారణాలతో విశ్రాంతి ఇవ్వకుండా పని చేయిస్తుంటాయి. ఇక వివిధ పనులపై వ్యక్తిగత వాహనాల్లో వెళ్లే వారు సైతం వీలైనంత త్వరగా గమ్యస్థానానికి చేరుకోవాలనుకుంటారు. త్వరగా పని పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలనుకుంటారు. తగినంత విశ్రాంతి లేకుండా వేగంగా డ్రైవ్ చేస్తుంటారు. అలసటతో నిద్రమత్తుకు గురై వాహనంపై నియంత్రణ కోల్పోతారు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టునో, నిలిపి ఉంచిన లారీ లాంటి ఏ భారీ వాహనాన్నో ఢీకొట్టేస్తారు. ఇలాంటి ఘటనల్లో ఏం జరిగిందో తెలుసుకునే లోపే ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి.

రోడ్డు పక్కన ఆపినా..

జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్లలో కొందరు కాస్త అలసట తీర్చుకుందామనో, టీ తాగుదామనో రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ఉంచడం ప్రమాదాలకు కారణమవుతోంది. డ్రైవర్లు తామ వాహనాలను పార్కింగ్ చేసుకుని సేద తీరేందుకు అవసరమైన స్థలాలు అన్నిచోట్లా అందుబాటులో ఉండట్లేదు. చాలావరకు దాబాలు, రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల వద్దే వీరు తమ వాహనాలను ఆపి ఉంచుతున్నా.. మరికొందరు వెంటనే వెళ్లిపోదామనో, ఇతరత్రా కారణాలతోనో రహదారికి పక్కగానే ఆపుతున్నారు. ఇది అనేక సందర్భాల్లో ఎదుటి వారికి, కొన్నిసార్లు వారికే ప్రమాదకరంగా మారుతోంది. ఈ వాహనాలు సరిగా కనబడక పోవడం, అలసట, నిద్రావస్థలో ఆదమరిచి ఉండటం లాంటి కారణాలతో వేగంగా వచ్చే వాహనాలు వీటిని ఢీ కొంటున్నాయి. బ్లాక్ స్పాట్స్ వద్ద నిలుపుతున్న సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారులపై తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను పోలీసులు గుర్తిస్తుంటారు. వీటినే సాంకేతిక పరిభాషలో బ్లాక్‌స్పాట్స్ అంటారు. ఇలాంటి బ్లాక్‌స్పాట్స్ హైవేలపై ఎక్కువగా ఉంటున్నాయి.

ఎంవీ యాక్ట్ ఏం చెబుతోందంటే...

ప్రతి రవాణా వాహనంలో డ్రైవర్‌తో పాటు ఖచ్చితంగా కో–డ్రైవర్ ఉండాలని మోటారు వాహనాల చట్టం స్పష్టం చేస్తోంది. డ్రైవర్లు రోజుకు కేవలం పది గంటల (విశ్రాంతితో కలిపి) చొప్పున వారానికి 48 గంటలు మాత్రమే పని చేయాలి. డ్రైవర్ విధులు నిర్వర్తించే ఎనిమిది గంటల కాలంలో ఖచ్చితంగా రెండు గంటల విశ్రాంతి ఉండాలి. తన వాహనం ద్వారా ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఆ సమాచారాన్ని పోలీసులకు తెలిపి తీరాలి. రహదారుల పక్కన నిర్దేశిత ప్రాంతాల్లో మినహా ఎక్కడా వాహనాలను పార్క్ చేయకూడదు. ఈ నిబంధనలు కేవలం రవాణా వాహనాలకే కాదు.. వ్యక్తిగత వాహనాల డ్రైవర్లకూ వర్తిస్తాయి. అయితే ఇవి ఎక్కడా అమలుకాని కారణంగానే హైవేలు, ఇతర మార్గాలపై ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయని నిపుణులు అంటున్నారు.

ప్రమాదాల నివారణకు పరిశోధనలు

ఏటా లక్షల మందిని మింగుతున్న కారు ప్రమాదాల నివారణకు ప్రపంచ వ్యాప్తంగా ఆటోమొబైల్ సంస్థలు దశాబ్దాలుగా ముమ్మర పరిశోధనలు చేస్తున్నాయి. వీటి ఫలితంగానే 1948లో రోడ్ గ్రిప్, ఆ తర్వాత రేడియల్ గ్రిప్ టైర్లు అందుబాటులోకి వచ్చాయి. 1958లో ఓల్వో కంపెనీ సీటుబెల్ట్‌ను కనుగొంది. తర్వాత ఎయిర్ బ్యాగులూ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ప్రధానంగా మూడు అంశాలపై ఆటోమొబైల్ కంపెనీల పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి కూడా సాకారమైతే కారు ప్రమాదాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని మోటారు వాహన రంగ నిపుణులు చెప్తున్నారు.

ఆటో బ్రేకింగ్

ముందున్న వాహనాలు/వస్తువులు కారుకు సమీపంలోకి రాగానే కారులో ఉండే సెన్సర్లు పని చేస్తాయి. బ్రేకులు వాటంతట అవే పడేలా చేస్తాయి. ఈ టెక్నాలజీ ప్రస్తుతం స్వీడన్‌లో ప్రయోగాల దశలో ఉంది.

ఇంటెలిజెంట్ విండ్ స్క్రీన్

డ్రైవర్ కారు నడిపేప్పుడు అతడు నిద్రలో జోగకుండా, అతని దృష్టి మళ్లకుండా ఇది ఉపకరిస్తుంది. డ్రైవర్ సరిగా చూస్తున్నాడా? ఎటు చూస్తున్నాడనే దాన్ని గమనిస్తూ అప్రమత్తం చేస్తుంది. రోడ్ల అంచులు, వాహనం స్థితి తదితరాలను సూచిస్తుంది.

క్రాష్ టెస్ట్ డమ్మీ


కారు నడిపే వ్యక్తి పర్సనాలిటీ ఆధారంగా ఎక్కడ ఢీ కొంటే ఏ అవయవాలు దెబ్బతింటాయి అనేది నిర్ధారిస్తుంది. ఇప్పటికే 100కు పైగా నమూనాలు రూపొందించిన ఈ టెక్నాలజీతో వ్యక్తికి తగ్గట్టుగా భద్రతా ప్రమాణాలను కారులో ఏర్పాటు చేసేందుకు వీలుగా పరిశోధనలు సాగుతున్నాయి.

మానవ తప్పిదాలను నివారించాలి

వాహనం ఎంతటి భద్రతా ప్రమాణాలతో కూడినదైనా, ఎంత టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా.. అతి ఎక్కువగా ప్రమాదాలకు కారణమయ్యే మానవ తప్పిదాలను నివారించకపోతే ఫలితం ఉండదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సరిగా రాకపోయినా వాహనం నడపడం, హైవే డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, మితిమీరిన వేగం, వాహనాన్ని అదుపు చేయలేక పోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ ధరించడంలో నిర్లక్ష్యం వహించడం లాంటివి నివారిస్తేనే ఏ టెక్నాలజీతోనైనా పూర్తి ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు.

ఆమంచి స్వాములు జనసేనకు గుడ్ బై!

చీరాల సమన్వయకర్త పదవికి రాజీనామా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీరాలకు చెందిన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి శ్రీనివాసులు(స్వాములు) ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇటీవలే చేరిన స్వాములును పార్టీ చీరాల సమన్వయకర్తగా నియమించింది. అయితే స్వాములు శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ఆ పార్టీ పీఏసీ నేత నాదెండ్ల మనోహర్‌కు పంపారు. లేఖను సోషల్ మీడియాలోనూ పోస్ట్ చేశారు. అనుచరులతో చర్చించి పార్టీకి సైతం స్వాములు రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది. నాలుగు నెలల కిందటే ఆమంచి స్వాములు జనసేనలో చేరారు. ఆ తర్వాత ఆయనను పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవితో పాటు చీరాల సమన్వయకర్తగా నియమించారు. జనసేన తరపున చీరాల నుంచి పోటీ చేస్తున్నట్టు ఆమంచి ప్రచారం చేసుకున్నారు. కొన్నాళ్లు కూటమి అభ్యర్థిగా ఉమ్మడి ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి పోటీ చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ, బీజేపీలతో పొత్తు కుదుర్చుకున్న జనసేన.. ఆమంచి స్వాములుకు చీరాల, గిద్దలూరుల్లో టికెట్ ఇవ్వలేదు. కూటమికి దర్శి సీటును కేటాయించినా అక్కడ వేరొకరికి టికెట్ ఇచ్చింది. చీరాల టికెట్ అలయన్స్‌లో టీడీపీకి కేటాయిస్తున్నందున టికెట్ ఇవ్వలేమని జనసేన పీఏసీ నేత నాదెండ్ల మనోహర్ స్వాములుకు తేల్చి చెప్పారు. ఇన్నాళ్లూ చీరాల టికెట్ అంటూ ప్రచారం చేసుకుని, చివరకు తాను నమ్ముకున్న జనసేన పార్టీ, పవన్‌కళ్యాణ్ మోసగించడంతో ఆమంచి స్వాములు తీవ్ర మనోవేదనకు గురై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆమంచి స్వాములు పార్టీకి గుడ్ బై చెప్పడంతో జిల్లాలో జనసేన పార్టీకి ఉన్న నామమాత్రపు బలం కనుమరుగు కానుంది. ఆమంచి స్వాములు చాలా కాలం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడిగా ఉండి కాపు సామాజికవర్గం నేతలతో సఖ్యతగా ఉన్నారు. జనసేన.. స్వాములకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఇక్కడి కాపు సామాజికవర్గం ఆ పార్టీ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉంది. వారంతా జనసేనకు గుడ్ బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. చీరాల సీటు టీడీపీకి కేటాయించినా కాపు సామాజికవర్గం ఆ పార్టీకి మద్దతు పలికే పరిస్థితి లేదు.

రంగాను చంపిన బాబుకు ఓటేయాలా పవన్?

- కమ్మ కులంలో పుడితే బాగుండేదన్నది పవన్ భావన
- కాపులను వంచిస్తున్న ఘనత ఆయనదే
- రంగాను అభిమానించేవారెవరైనా టీడీపీకి ఓటు వేయొద్దు
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని



హైదరాబాద్: తాను కాపు కులంలో ఎందుకు పుట్టానా.. కమ్మ కులంలో పుడితే బాగుండేది.. అన్న భావనలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఉన్నారని ఏపీఎఫ్‌డీసీ చైర్మన్, నటుడు పోసాని కృష్ణమురళి అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాపు కులస్తులంతా తమ వాడు సీఎం కావాలని పవన్‌కు అండగా నిలిచారని, అయితే వారిని వంచించిన ఘనత పవన్‌కే దక్కిందన్నారు. కాపు సోదరుల కోసమే తాను ఈ ప్రెస్‌మీట్ పెట్టినట్టు చెప్పారు. జనసేనను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన పవన్.. చంద్రబాబు సీఎం అవడానికి ఓట్ల పేరుతో మరోసారి కాపులను మోసం చేయడానికి వస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కాపుల ఆశాజ్యోతి వంగవీటి రంగా తామందరికీ పెద్ద హీరో అని.. అలాంటి రంగాను ఎలా చంపారో ఈ పోస్టర్ మీకు చెబుతుందంటూ అక్కడున్న పోస్టర్‌ను చూపారు. రంగాను హత్య చేయించింది చంద్రబాబేనని ఆరోపించారు. రంగాను గొంతు కోశాక ఆయన చనిపోయాడా లేదా.. అని మళ్లీ చంపారని చెప్పారు. రంగాను చంపిందెవరో అందరికీ తెలుసని, ఆయన కుమారుడికీ తెలుసన్నారు. రంగా బతికి ఉంటే ఎప్పటికైనా కాపు కులం నుంచి సీఎం అవుతారనే పథకం ప్రకారం చంద్రబాబు హత్య చేయించారని ఆరోపించారు. ఆ రోజుల్లో రంగాను ఎంత హింసించారో అందరికీ తెలుసని, తనకు ప్రాణహాని ఉందని అప్పట్లో రంగా సీఎం ఎన్టీఆర్‌కు, హోం మంత్రి కోడెల శివప్రసాదరావుకు సెక్యూరిటీ కోసం వినతి పత్రాలిచ్చారని, అయితే భద్రత కల్పించకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని చెప్పారు. తనకు సెక్యూరిటీ కావాలని కేంద్రానికి రంగా లేఖ రాయగా.. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు సెక్యూరిటీ కల్పించే లోపే రంగాను నడిరోడ్డుపై నరికి చంపించారని ఆరోపించారు.

ముద్రగడ విషయంలో మౌనమా.. బాబు జైలుకు వెళ్లగానే మద్దతా?

ఈ తరుణంలోనే పవన్‌కళ్యాణ్ వచ్చారని.. చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణలను పవన్ బూతులు తిడుతుంటే కాపులు నమ్మారని, పార్టీ పెట్టాను సీఎం అవుతానంటే ఆయన వెంట కాపులంతా నడిచారని తెలిపారు. కాపు కులంలో పవన్ సీఎం అవుతారని కాపులు నమ్మారని, అయితే నమ్మిన కాపులను మోసం చేసి.. చంద్రబాబుకు మద్దతు తెలపాలని, తనకు అంత సీన్ లేదని పవన్ చెప్పడంతో కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ముద్రగడ పద్మనాభంను మెడపట్టి గెంటించి, ఆయన కుటుంబ ఆడపడుచులను అవమానించింది చంద్రబాబేనని.. అప్పుడు మాట్లాడని పవన్.. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లగానే వెళ్లి పలకరించాడని దుయ్యబట్టారు. కాపులను రౌడీలు, గూండాలు అన్న చంద్రబాబుకు ఓటు వేయాలని పవన్ చెబుతున్నాడని.. రంగాను చంపిన చంద్రబాబును ఎలా సీఎంను చేయమంటావని ప్రశ్నించారు. రంగా చంపిన వాడు సీఎం అయితే బాగుంటుందని పవన్ అభిప్రాయపడుతున్నారని దుయ్యబట్టారు.

గుడిసెలు తగులబెట్టింది టీడీపీ వర్గీయులే

- ప్రసన్నాయపల్లిలో దాడులు చేసింది పరిటాల శ్రీరామ్ అనుచరులే
- భూమి ఆక్రమించింది వివేకాను హత్య చేసినోడు: తోపుదుర్తి



అనంతపురం టవర్‌క్లాక్: అనంతపురం జిల్లా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి సమీపంలో గుడిసెలు తగులబెట్టింది టీడీపీ వారేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకున్న వారిపై జరిగిన దాడి, గుడిసెలు తగులబెట్టడంలో తమకు సంబంధం లేదన్నారు. దాడులు చేసింది పరిటాల శ్రీరామ్ అనుచరులని చెప్పారు. ప్రసన్నాయపల్లి వంక పోరంబోకు భూమిలో పరిటాల సునీత గత ప్రభుత్వంలో పట్టాలు ఇప్పించాన్నారు. ఆ భూమి టీడీపీకి చెందిన హోటల్ శీనా, ఉప్పర శీనా, మరికొంతమంది స్వాధీనంలో ఉందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు రెండు రోజుల కిందట గుడిసెలు వేసుకున్నారని, వారిపై హోటల్ శీనా, ఉప్పర శీనా, మరికొందరు దాడులు చేసి, గుడిసెలకు నిప్పు పెట్టారన్నారు. నా అనుచరులు దాడులు చేశారంటూ ఈనాడు, ఈటీవీలో తప్పుడు కథనాలు ఇచ్చారని మండిపడ్డారు. భూములు ఆక్రమించుకుంది టీడీపీ వాళ్లని, వాటిలో గుడిసెలు వేయించి కబ్జా చేసేందుకు వచ్చినోడు వివేకా హత్య కేసు ముద్దాయి అని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొందరు కులాల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, వారికి పేదలపై ప్రేమ ఉంటే వారి ఆధార్ జిరాక్స్ కాపీలను సచివాలయాల్లో ఇస్తే ప్రభుత్వమే 90 రోజుల్లో ఇంటి పట్టాలు మంజూరు చేస్తుందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై పోరాడేందుకు కుల సంఘాలు ముందుకు రావాలన్నారు. రామోజీరావు పెద్ద దొంగ అని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రెండు వేల ఎకరాలు కొట్టేశారని ఆరోపించారు. తప్పుడు కథనాలతో ప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టి, వారికి నచ్చిన ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చి దోపిడీ చేయాలనుకుంటున్నారని విమర్శించారు. రామోజీ, రాధాకృష్ణ తప్పుడు కథనాలు మానుకుని పద్ధతిగా ఉండకపోతే బజారులోకి ఈడ్చి కొడతామని హెచ్చరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400 708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పౌరకార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం కుంబార గుండయ్య, గుడ్డద ఈశ్వర ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, పూజలతో పాటు జిల్లా శాలివాహన కుంబార సంఘం నేతలు సత్యనారాయణ స్వామి, నరసయ్య, బ్రహ్మయ్య తదితరుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం పౌర కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. నగరంలో స్వచ్ఛత కాపాడటంలో పౌరకార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని, వారి సేవలను గుర్తించి సన్మానించడంతో పాటు దుస్తులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్పొరేటర్ కల్పన వెంకట్రామిరెడ్డి, చైతన్య కళాశాల ఎండీ రాధాకృష్ణ, కుంబార సంఘం నాయకులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలను అందించిన ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్

కంప్లి: ప్రైవేటు వ్యక్తుల మాటలు వింటున్న అధికారులు వారికే కొమ్ము కాస్తున్నారని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హగరిబొమ్మనహళ్లిలో పురసభ పరంగా ఏర్పాటు చేసిన ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాలూకాలో కొంతమంది అధికారులు పేదల ఆస్తులు కబళించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి దుర్మార్గులను 24 గంటల్లో సస్పెండ్ చేయిస్తానని హెచ్చరించారు. పేదలకు అన్యాయం జరుగుతుంటే వారికి రక్షణ కల్పించాల్సిన అధికారులు తొత్తులుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

రాయచూరు రూరల్: సదృఢ సమాజ నిర్మాణం కోసం మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రీటా పేర్కొన్నారు. శుక్రవారం నవోదయ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వివేకవంతమైన ఆలోచనలు, విలువలతో కూడిన నడవడికతో సమాజంలో అభివృద్ధికి అనుగుణంగా మహిళలు ముందుకు సాగాలన్నారు. హక్కులు, విధులు, సమానత్వం మధ్య మహిళలను పనుల్లోకి తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ దొడ్డయ్య, వాణిశ్రీ, ప్రజ్ఞ, అపర్ణ, లక్ష్మి, దీపాలిలున్నారు.

దొడ్డ బసవేశ్వరుని రథం గద్దకు పూజలు

కంప్లి: కురుగోడు పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన దొడ్డ బసవేశ్వరుడి రథం గద్దను వివిధ ధార్మిక విధి విధానాలతో భక్తులు మహాశివరాత్రి పర్వదినాన రథగృహం(తేరినమనె) నుంచి బయటికి తీసి పూజలు చేశారు. ఈ కార్యక్రమం మహాశివరాత్రి నాడు జరగడంతో చుట్టు పక్కల నుంచి ప్రజలు తండోపతండాలుగా విచ్చేసి దర్శించుకున్నారు.

మేం బీజేపీని వీడబోం



మాట్లాడుతున్న బైరతి బసవరాజు

సాక్షి,బళ్లారి: ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ఎస్.టీ సోమశేఖర్, శివరామ హెబ్బార్ నడుచుకున్న తీరు బాగా లేదని, వారిద్దరు పరిస్థితులకు తగ్గట్టుగా నడుచుకున్నారనడం సరికాదని, తాను కూడా వారిద్దరితో మాట్లాడానని ఎమ్మెల్యే బైరతి బసవరాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం దావణగెరెలో విలేకరులతో మాట్లాడారు. అయితే తాను కాని, ఎమ్మెల్యే మునిరత్నం కాని ఎట్టి పరిస్థితుల్లోను బీజేపీని వీడే ప్రశ్నే లేదన్నారు. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. అధికారం వస్తుంది, పోతుంది, విలువలతో కూడిన రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాము బీజేపీ సిద్ధాంతాలను మెచ్చి పార్టీలోకి వచ్చామన్నారు. మళ్లీ పార్టీని ఎందుకు వీడుతామని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎక్కడికి వెళతారో కాలమే సమాధానం చెబుతుందన్నారు. ప్రస్తుతం తమ ముందున్న ఏకైక లక్ష్యం 28 స్థానాల్లో గెలుపొందాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నామన్నారు. ఎంపీ ఎన్నికల అనంతరం గ్యారెంటీలు ఎక్కడ ఉంటాయో వారికే తెలియదన్నారు. ఈ పరిస్థితుల్లో కాలమే సమాధానం చెబుతుందని కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. నాలుగేళ్ల తర్వాత తమ పార్టీ సొంతంగా అధికారంలోకి వస్తుందని, అంతవరకు ఎలాంటి రాజకీయాలు మారినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు



కోలారు: అంతరగంగ కాశీ విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు



రాయచూరులో అలంకరణలో చంద్రమౌళేశ్వరుడు



మాలూరు: ప్రత్యేక అలంకరణలో శంకరనారాయణస్వామి



శ్రీనివాసపురం: ప్రత్యేక అలంకరణలో ప్రసన్న సోమేశ్వరస్వామి



బళ్లారి: అమరేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి విశేష అలంకరణ దృశ్యం

సాక్షి,బళ్లారి: పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు, సాక్షాత్తు శివుడు లింగాకారంలో అవతరించిన రోజుగా చెప్పబడుతున్న శివరాత్రి రోజున భక్తులు శివనామస్మరణతో గడిపారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని కోట మల్లేశ్వర ఆలయం, నగరేశ్వర ఆలయం, నీలకంఠేశ్వర ఆలయం, కాశీ విశ్వేశ్వర ఆలయం, సంగమేశ్వర ఆలయం, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, నగర శివారల్లోని కప్పగల్ రోడ్డులోని అమరేశ్వర స్వామి ఆలయంతో పాటు బాలాజీ నగర్‌లో నూతనంగా వెలసిన శివాలయంలోని స్ఫటిక లింగానికి ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరి శివుడిని దర్శించుకున్నారు. శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలతో శివుడికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. శివాలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించడంతో నూతన కాంతులతో శివాలయాలు దేదీప్యమానంగా కనిపించాయి. శివభక్తులు ఓంనమఃశివాయ అనే నామస్మరణతో జాగరణ చేస్తూ భక్తిని చాటుకున్నారు. కొందరు ఉపవాసంతో శివాలయాల్లో పూజలు చేసి జాగరణ చేశారు. ప్రతి ఒక్కశివాలయాల్లో ఉపవాసం ఉన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు కూడా ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యం కల్పించారు. అలాగే ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సాక్షాత్తు శివుడు లింగాకారంలో అవతరించారని పురాణాలు ఘోషిస్తున్న హంపీలోని విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో చేరి పూజలు చేశారు. బళ్లారి జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో ఓంనమఃశివాయ అనే శివనామస్మరణతో మార్మోగిపోయాయి. శివమాల ధరించిన భక్తులు శివాలయాల్లో ప్రత్యేక భజనలు, పూజలు చేసి శివభక్తిని చాటుకున్నారు. శివాలయాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

జిల్లాలో సర్వం శివమయం

రాయచూరు రూరల్: జిల్లాలో శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణతో మారుమోగాయి. పట్టణంలోని మహాబళేశ్వర చౌక్‌లో చంద్రమౌళేశ్వర ఆలయం వద్ద రాత్రి 12 గంటల నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. నగరేశ్వర, వీరభద్రేశ్వర దేవస్థానం, ఐబీ రోడ్డులోని నందీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో భక్తులు పూజలు జరిపారు. వివిధ శివాలయాల్లో శివస్తోత్రం, కుంభాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శివాలయాలతో పాటు రామ మందిరం, హనుమాన్ మందిరం, రాజమాత ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలన్ని అలంకరించారు.

శివాలయాల్లో భక్తుల సందడి

కోలారు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకం తదితరాలు జరిగాయి. నగరంలోని ప్రసిద్ధ సోమేశ్వరాలయంలో ఉదయం 6 గంటలకే సోమేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. ఆలయంలోని నంది విగ్రహం ముందు మహిళలు నిమ్మకాయలతో దీపాలను వెలిగించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. పురాణ ప్రసిద్ధ అంతరగంగ కాశీవిశ్వనాథ స్వామి ఆలయం, జలకంఠేశ్వరస్వామి ఆలయం, దొడ్డపేటలోని నంజుడేశ్వరస్వామి ఆలయం, కాళమ్మ గుడి వీధిలోని కాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయంతో పాటు ముళబాగిలు తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఆవని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అంతరగంగ కాశీ విశ్వనాథస్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి తరలి వెళ్లారు. వక్కలేరి సమీపంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సోమేశ్వరస్వామి ఆలయంలోని నంది విగ్రహం ముందు మహిళా భక్తులు నిమ్మకాయలతో దీపాలను వెలిగించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

కోటిలింగాల క్షేత్రం భక్తులతో కిటకిట

కేజీఎఫ్: మహాశివరాత్రి పర్వదినాన తాలూకాలోని కోటిలింగేశ్వర ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. క్షేత్రంలోని 108 అడుగుల శివ లింగాన్ని దర్శనం చేసుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం ఆరు గంటలకే భక్తులు ఆలయంలో దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంజునాథ రథోత్సవం, బృహత్ శివలింగానికి పాలతో అభిషేకం, హోమం, హవనం, నిర్వహించారు. ప్రత్యేక పూలతో అలంకరించారు. రాత్రి జాగరణ సందర్భంగా భజన, హరికథ, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి తెలిపింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కేహెచ్ మునియప్ప, ఎమ్మెల్యే రూపా శశిధర్ కోటిలింగ క్షేత్రానికి చేరుకుని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు

మాలూరు: పట్టణంలోని దొడ్డపేటలో శంకరనారాయణస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అభిషేకం, హోమం, హవనం, వేద మంత్ర పారాయణం తదితర పూజలను చేశారు. తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి ఆచరణ

శ్రీనివాసపురం: శివరాత్రి పండుగను శుక్రవారం ముళబాగిలు నగరంతో పాటు తాలూకాలోని వివిధ శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నగరంలోని ప్రసన్న సోమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గణేశ్‌పాళ్యలోని శివాలయం, శివకేశవ నగర్‌లోని ఉద్భవశివలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి శివుడి దర్శనం చేసుకున్నారు. పురాణ ప్రసిద్ధ ఆవణి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి వేళలో పలు ఆలయాల్లో జాగరణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



బళ్లారి: శివాలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



కోలారులో సోమేశ్వరాలయం ముందు దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



కేజీఎఫ్: 108 అడుగుల శివలింగాన్ని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు



రాయచూరులో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



కేజీఎఫ్: కోటిలింగాల క్షేత్రంలో భక్తుల సందడి

ప్రభుత్వ పాఠశాలకు టీవీ వితరణ



కమేలా రోడ్డు పాఠశాలకు టీవీని అందజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

బళ్లారి రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎల్ఐసీ బ్రాంచ్-2 ఏఐఐఈఏ(ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్) సభ్యులు కమేలా రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలకు 43 అంగుళాల ఆండ్రాయిడ్ టీవీని అందజేశారు. ప్రతి ఏడాది ఎల్ఐసీ ఉద్యోగులు విద్యార్థులకు అందజేసే సాయంలో భాగంగా విద్యార్థుల కోరిక మేరకు పాఠ్యాంశాల ప్రాయోజిత కార్యక్రమాలు వీక్షించడానికి టీవీని పంపిణీ చేసినట్లు ఉద్యోగుల సంఘ కార్యదర్శి డీ.వీ.సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయిని సుజాతను సన్మానించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్-2 మేనేజర్ సంపత్‌కుమార్, ఏబీఎం వెంకటరాముడు, కోశాధికారి విఘ్నేశ్, ఉద్యోగులు శాంతకుమారి, వి.రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పౌరకార్మికుల సేవలు భేష్



మహిళా పౌరకార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిటౌన్: నగరంలో మహిళా పౌరకార్మికుల సేవలు శ్లాఘనీయమని పాలికె మేయర్ శ్వేత పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 3వ వార్డు కార్పొరేటర్ ప్రభంజన్‌కుమార్ మహిళా పౌరకార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత దంత పరీక్ష శిబిరం, పౌర కార్మికులకు సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా పౌరకార్మికులు నగరాన్ని నిత్యం శుభ్రపరుస్తూ నగర ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ముందంజలో ఉన్నారన్నారు. మహిళా పౌరకార్మికుల సమస్యలపై తాము స్పందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. కాగా 300 మంది మహిళలు దంత పరీక్షలు చేయించుకోగా 120 మంది మహిళలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దంత వైద్యుల సంఘం జిల్లాధ్యక్షుడు మధుసూధన్, కార్యదర్శి శ్రీధర్, వైద్యులు రాజీవ్, భావన, వాణిశ్రీ, శ్వేత, ఉపమేయర్ జానకీ, మాజీ మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్లు ప్రభంజన్‌కుమార్, మించు శ్రీను, బీఆర్ఎల్ శీను, గోవిందరాజులు పాల్గొన్నారు.

సిరిధాన్యాల పార్కు ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి బోసురాజు తదితరులు

రాయచూరు రూరల్: వ్యవసాయ రంగంలో మార్పులకు అనుగుణంగా సిరిధాన్యాల పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూ.25 కోట్ల నాబార్డ్ ఆర్థిక సహాయంతో చేపట్టే పార్క్‌కు వర్చువల్ విధానంలో పాల్గొన్న వ్యవసాయ శాఖా మంత్రి చెలువరాయ స్వామితో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. రాగి, సజ్జలు, కొర్రలు, మినుములు, ఇతరత్ర పంటలను పండించడానికి జిల్లాలో అనుకూల వాతావరణం ఉండటం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. సిరిధాన్యాల ప్రయోగాలయం, పరిశోధన, విత్తన కేంద్రాల ఏర్పాటు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. దేశంలో సిరిధాన్యాల ప్రయోగాలయం రాయచూరులో ఏర్పాటు కానుండడం ఇదే మొట్టమొదటిదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హనుమంతప్ప, రిజిస్ట్రార్ వీరనగౌడ, సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బసవనగౌడ బ్యాగవాట్, మల్లికార్జున, నాబార్డ్ అధికారి రమేష్, రవి, బీకే దేశాయి, జయణ్ణ, శాంతప్ప, శివమూర్తి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవి కాలంలో మూడు నెలల పాటు జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు వెల్లడించారు. ఆయన శుక్రవారం రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య జిల్లా స్థాయి అధికారులతో చర్చించారని, రూ.580 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. పశుగ్రాసం కోరకు రూ.40 కోట్లు, తాగునీటి కోసం రూ.70 కోట్ల నిధులను జిల్లాధికారి ఖాతాలో జమ చేశారన్నారు. సమస్యలను పరిష్కరించడానికి తహసీల్దార్, పీడీఓలకు అధికారం ఇచ్చారన్నారు. తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ఉండాలంటే గంట సేపు విద్యుత్ కోత విధించాలన్నారు. లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయంలో హైకమాండ్ తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు.

మహిళలు అక్షరాస్యులు కావాలి



సావిత్రిబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మహిళలు

రాయచూరు రూరల్: మహిళలు అక్షరాస్యులు కావాలని కట్టడ కార్మికుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మలియాబాద్‌లో ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. మహిళలు విద్యావంచితులు కారాదన్నారు. ప్రతి ఒక్క మహిళ అక్షరాస్యురాలు కావాలన్నారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే మహిళా స్వయం ఉపాధి సంఘం అధ్యక్షురాలు పద్మావతి, సరస్వతి, లక్ష్మమ్మ, ఐశ్వర్య, అశ్విని దాస్, గోవిందమ్మ, సుజాత, లక్ష్మి, తిమ్మలమ్మ, నరసమ్మలున్నారు.

జెస్కాం నిధుల వృథా.. నలుగురు సస్పెండ్

రాయచూరు రూరల్: వినియోగదారుల నుంచి వసూలు చేసిన డబ్బులను దుర్వినియోగం చేసిన రాయచూరు జెస్కాం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ బళ్లారి డివిజనల్ జెస్కాం సూపరింటెండెంట్ ఇంజినీర్ గురువారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. తాలూకాలోని చంద్రబండ, యాలపదిన్ని గ్రామాల్లో వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల రూపంలో సేకరించిన రూ.22 లక్షలను గ్రామీణ సీనియర్ అధికారులు పర్వీన్, సుధా, తాయప్ప, సహాయక అధికారిణి బసమ్మ దుర్వినియోగ పరిచినట్లు విచారణలో తేలడంతో వారిని సస్పెండ్ చేశారు. పూర్తి స్థాయి విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, పూర్తి స్థాయి నివేదిక అందిన తర్వాత వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు హేమాద్రి భట్ సంస్మరణ సమావేశం

సాక్షి బళ్లారి: సుదీర్ఘ కాలం ఉపాధ్యాయ వృత్తిలో పని చేసి ఆదర్శ ఉపాధ్యాయులుగా వేలాది మంది విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసిన హేమాద్రి భట్ 10వ సంస్మరణ సమావేశం శనివారం బాల భారతి పాఠశాలలో నిర్వహించనున్నారు. నగరంలోని గాంధీనగర్ బాలభారతి పాఠశాలలో జరగనున్న ఈ సంస్మరణ సమావేశానికి కమ్మరచేడుమఠం కళ్యాణ స్వామితో పాటు నగర మాజీ ఎమ్మెల్యేలు నారా సూర్యనారాయణ రెడ్డి, గాలి సోమశేఖర్‌రెడ్డి, కళ్యాణ కర్ణాటక వికాస అకాడమి అధ్యక్షులు బసవరాజ్ తదితరులు హాజరు అవుతారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సాహితీవేత్తలకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న సాహితీవేత్తలతో అతిథులు

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లా కన్నడ సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా సాహితీవేత్తలు కలబుర్గి విశ్వవిద్యాలయం నుంచి అవార్డులు అందుకున్నారు. గురువారం కలబుర్గి విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయపుర అక్కమహాదేవి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ మీనాక్షి బాళే చేతుల మీదుగా రాయచూరుకు చెందిన అమరేష్ నుగడోణ, వెంకటేష్ జాలిబెంచి, అమరేష్, మహాదేవ్ పాటిల్, షరీఫ్ హసమకల్‌లకు అవార్డులను అందించారు. అవార్డుల ప్రదానోత్సవంలో కలబుర్గి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దయానంద అగసర్, రిజిస్ట్రార్ పోతే, బాబన్న, శరణప్పలున్నారు.

కలబుర్గి- బెంగళూరు వందే భారత్ ట్రయల్‌రన్



వందే భారత్ రైలుకు స్వాగతం పలికిన దృశ్యం

రాయచూరు రూరల్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కలబుర్గి– బెంగళూరు వందే భారత్ రైల్ ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించిన నేపథ్యంలో రైలు రాయచూరు రైల్వేస్టేషన్‌కు వచ్చింది. కలబుర్గి లోక్‌సభ సభ్యుడు ఉమేష్ జాధవ్ కలబుర్గిలో ట్రయల్ రన్‌ను ప్రారంభించగా రైలు మధ్యాహ్నం రాయచూరు రైల్వేస్టేషన్‌కు విజయవంతంగా చేరింది. ఈ నెల 12న న్యూఢిల్లీలో వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ రైలుకు పచ్చ జెండా ఊపి శ్రీకారం చుడతారని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

భక్తులకు ప్రసాదం అందజేత



ఉగ్గాని, బజ్జీలను పంపిణీ చేస్తున్న శ్రీరాములు, గాలి సోమశేఖర్‌రెడ్డి

సాక్షి, బళ్లారి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస జాగరణ చేయడంతో నగరంలోని శివాలయాల వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శుక్రవారం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద స్వయంగా మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగ్గాని, బజ్జీలు తయారు చేసి భక్తులకు అందచేశారు.

వేడుకగా శివలింగాల ఊరేగింపు



శివలింగాలను ఊరేగిస్తున్న దృశ్యం

హొసపేటె: నగరంలో వెలసిన బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా శివలింగాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. లింగాలను ట్రాక్టర్లలో ఉంచి ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల దర్శనం కోసం నగరంలోని మార్కండేశ్వర ఆలయంలో ఉంచారు.

హంపీలో భక్తుల సందడి



హంపీలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

హొసపేటె: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం దక్షిణ కాశీగా వెలుగొందుతున్న హంపీలో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విరుపాక్షేశ్వరుని దర్శనం కోసం ఆలయ ఆవరణలో బారులు తీరి స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. అనంతరం భక్తులు తమ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. విదేశీయులు కూడా పంపావిరుపాక్షేశ్వరుని దర్శనం చేసుకున్నారు. ఉదయం ఆలయంలో హంపీ విద్యారణ్య పీఠం విద్యారణ్య భారతి స్వామీజీ చేతుల మీదుగా స్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్రనామం, బిల్వార్చన, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు.